తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
29-4-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 87 పేజీలు: 10+4 వెల: 6.50





సోమవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయిన సిఎస్ రామకృష్ణారావు

## సిఎం రేవంత్‌రెడ్డితో కొత్త సిఎస్ మర్యాదపూర్వక భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్28:** తెలంగాణ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె. రామకృష్ణ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు రేవంత్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.. కాగా, ప్రస్తుత సిఎస్ శాంతికుమారి ఈ నెల 30వ తేదిన పదవీ విరమణ చేయనున్నారు. ఆమె స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం రామకృష్ణారావును చీఫ్ సెక్రటరీగా నియమించింది. ఆయన మే నెల ఒకటో తేదిన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ప్రధాని మోడీతో రాజ్‌నాథ్ భేటీ

>> ఆకాశవాణిలో ప్రసారమైన మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. బాధితులకు తప్పక న్యాయం జరుగుతుందని, ఉగ్రదాడి ఘటనతో దేశ ప్రజల రక్తం మరుగుతోందన్నారు. ప్రధాని మోదీ వ్యాఖ్యల నేపథ్యంలో జరుగుతున్న ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. అంతకుముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ అనిల్ చౌహాన్ భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్ర దాడి తర్వాత సమస్యాత్మక ప్రాంతాలతో పాటు సరిహద్దు వెంట తీసుకుంటున్న చర్యలను వివరించినట్లు తెలుస్తోంది. దీంతో పాటు ముఖ్యంగా ఆ సమావేశంలో సైన్యం తీసుకున్న కొన్ని కీలక నిర్ణయాలపైనా చర్చించినట్లు సమాచారం. ఇంకా బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దిల్జీత్ సింగ్ చౌధరీ నార్త్ బ్లాక్‌కు రావటం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు పహల్గాం ఉగ్ర దాడితో సరిహద్దుల్లో గందరగోళ వాతావరణం నెలకొంది. భారత్ వైపు నుంచి దాడి ఉండొచ్చన్న అంచనాలతో పాక్ ముందస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే సరిహద్దుల్లో అదనపు బలగాలను మోహరించినట్లు వార్తలు రాగా, తాజాగా తుర్కియేకు చెందిన పలు సీ130 హెర్క్యులస్ విమానాలు పాక్‌లో ల్యాండ్ అయినట్లు తెలుస్తోంది. ఈ విమానాల్లో సైన్యానికి అవసరమైన కార్గోను తీసుకొచ్చినట్లు సమాచారం అందుతోంది.

## ఘనంగా 'పద్మా' అవార్డుల ప్రదానం

>> సాయంత్రం. ఈ అవార్డులను అందజేసి గ్రహీతలను గౌరవించారు. తెలుగు రాష్ట్రాల నుంచి వైద్య విభాగంలో పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన డాక్టర్ దువ్వూరు నాగేశ్వర్ రెడ్డి, కళా రంగంలో పద్మభూషణుకు ఎంపికైన సినీ నటుడు బాలకృష్ణ, పద్మశ్రీకి ఎంపికైన మాడుగుల నాగఫణిశర్మ రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ విశిష్ట పౌర పురస్కారాలను అందుకున్నారు. అలాగే, సినీ నటుడు అజిత్, క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తదితరులు నేడు పద్మ అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, శివరాజ్సింగ్ చౌహాన్, జితేంద్రసింగ్‌తో పాటు ఏపీ మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి, పలువురు ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**బాలకృష్ణను అభినందించిన, సినీ,రాజకీయ ప్రముఖులు**

సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా బాలయ్య పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. పద్మ అవార్డుల ప్రదానోత్సవానికి బాలకృష్ణ తెలుగుదనం ఉట్టి పడేలా పంచె కట్టుతో హాజరయ్యారు. మరోవైపు నటుడిగా సినీ రంగానికి బాలకృష్ణ సేవలను గుర్తించి కేంద్రం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భంగా పలువురు రాజకీయ,సినిమా ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## అభివృద్ధికి దూరంగా నల్లగొండ

>> స్టేజి వన్ ద్వారా సాగు నీరు ఇస్తామన్నారు. రాచకాలువ పనులు పూర్తి చేస్తామని, గంధమల్ల ప్రాజెక్టును తప్పనిసరిగా పూర్తి చేస్తామన్నారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నారాయణపూర్ ,చౌటుప్పల్‌కు కాల్వ విస్తరించి నిరందిస్తామన్నారు. పెళ్లిపాకల, గాజుపేట లిఫ్ట్ ఇరిగేషన్ నుచేపట్టి పూర్తి చేస్తామని చెప్పారు. దేవాదుల నుండి తుంగతుర్తికి సాగునీరు తెస్తామని, ఎస్సారెస్పీ ప్రాజెక్టును పునరుద్ధరణ చేసి నీళ్ల పెంచుతామని తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై ప్రజాప్రతినిధులు అదికారులతో రెండు నెలలకోకసారి సమీక్షి స్తామన్నారు. కాంగ్రెస్ అదికారంలోకి వచ్చిన తరువాత 66.7 లక్షల ఎకరాలలో 153 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పండించామని, యాసంగి ధాన్యం కలుపుకుని మొత్తం 2,80,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి రికార్డు సృష్టించామని తెలిపారు. సన్న ధాన్యం పండించిన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు 500 రూపాయల బోనస్ ను ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టు లు ఏవి పూర్తి చేయలేదని, కొత్తగా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, ఉన్న రేషన్ కార్డుల పై దొడ్డు బియ్యం ఇచ్చారని తెలిపారు. హామీ ఇచ్చినట్లు ఉచితంగా 85 లక్షల జనాభాకు ఆరు కేజీల చొప్పున సన్నబియ్యం ఇస్తున్నామని, పేదలకు సన్నబియ్యం పథకం ఎంతగానే ఉపయోగపడుతుందని అన్నారు. మంత్రి ఉత్తమ్ సహకారంతో జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేస్తా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిరాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ సహకారంతో జిల్లాలోని ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయించి అభివృద్ధి చేస్తామని చెప్పారు. 36 కోట్ల రూపాయలతో జిల్లా కలెక్టర్ కార్యాలయం అదనపు బ్లాకుకు శంకుస్థాపన ,సుమారు 50 కోట్ల రూపాయలతో ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేయడం సంతోషమని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే కలెక్టర్ కార్యాలయం అయిందని, అయితే ప్రస్తుతం ప్రభుత్వ పథకాలు పెరగడం, కార్యాలయాలు పెంపు వల్ల ప్రస్తుతం ఉన్న కలెక్టర్ సరిపోదని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులకు మంచి వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఆర్ అండ్ బి శాఖ ద్వారా 36 కోట్లు రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, 9 నెలల్లో ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు .ఈ భవన నిర్మాణం పూర్తయితే డీఈఓ ,డిఎంహెచ్ కార్యాలయాలు సైతం జిల్లా కలెక్టర్ కాంప్లెక్స్ లోకి వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు 5 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మండ్ల కింద ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, బీర్ల ఐలయ్య, ఎంఎల్ఏ లు కోమటరెడ్డి రాజగోపాల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మళ్లీ ముంచిన అకాల వర్షాలు
### పిడుగు పాటుకు ఇద్దరు రైతుల మృతి

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** తెలంగాణలో మరోసారి అకాలవర్షాలు ఆగమాగం చేసి, మళ్లీ రైతులను నష్టాల పాల్చేశాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కురిని వర్షాలకు ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోగా, చేతికందివచ్చిన పంట లు నీటి పాలయ్యాయి. వివిధ జిల్లాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపో యాయి. ఆదివారం నుండి సోమవారం తెల్లవారు జాము వరకూ కురిసిన వర్షానికి ప్రాణ, పంట నష్టం సంభవించింది. రాష్ట్రంలోని నారాయణపేట జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. అలాగే జోగుళాంబ గద్వాల జిల్లాలో పిడుగులు పడి అనేక మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. పలుచోట్ల వరి నేలకొరగా, మరికొన్నిచోట్ల కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో అకాల వర్షం, పిడుగులు బెంబేలెత్తించాయి. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో పిడుగులు పడి ఇద్దరు మృతిచెందారు. ఉప్పర్‌పల్లికి చెందిన పట్నం ఆంజనేయులు (36) పొలంలోని కల్లంలో ఆరబెట్టిన ధాన్యంపై కవర్లు కప్పుతుండగా పిడుగు పడి మృతిచెందాడు. దాదన్‌పల్లికి చెందిన యువకుడు కురుమూర్తి (17) పొలం పనుల్లో నిమగ్నమై ఉండగా పిడుగుపాటుకు ప్రాణాలు కోల్పోయాడు. నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో పలు గ్రామాల్లో పిడుగులు పడి 2 ఆవులు, 2 ఎద్దులు, 2 గేదెలు, కోడె దూడ, 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఇదేజిల్లా మాగనూరు సమీపంలో 167వ జాతీ య రహదారిపై 11 కేవీ, 33 కేవీ విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. తాళంకేరిలో ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఆసిఫాబాద్ జిల్లాలోని పలు మండలాలతో పాటు, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, కోరుట్ల మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దహెగాం మండలం గిరివెల్లి, ఖర్జి తదితర గ్రామాల్లో వరి నేలకొరిగింది. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసినధాన్యం తడిసి పోయింది. కోరుట్ల మండలలో మామిడి నేలరాలడంతో రైతులకు నష్టం వాటిల్లింది. భువనగిరి జిల్లా చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, వలిగొండ, భువనగిరి మండలాల్లో అకాల వర్షం కురిసింది. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం రాశులు తడిసిపోయాయి. ఇప్పటికే పలు దఫాలుగా కురిసిన అకాల వర్షాలతో పంట దెబ్బతిన్న రైతులకు మళ్లీ మరోసారి భారీ నష్టం వాటిల్లింది.

### వారం - వర్జ్యం

తేది : 29-04-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
శు.విదియ సా.5.35
కృత్తిక సా.6.50
వర్జ్యం ఉ.9.12-10.38
దు.ఉ.8.16-9.07, 2) రా.11.31-12.22
శుభసమయం : ఉ.7.10-7.40
రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం :** ఉద్యోగాలలో చిక్కులు ఎదురైన అధిగమిస్తారు. సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**వృషభం :** గృహ నిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు. పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు.

**మిథునం:** ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు. వృత్తి, వ్యాపారాలలో స్వల్పలాభాలు పొందుతారు.

**కర్కాటకం:**ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి. ఋణబాధలు తప్పవు. వాహనయోగం.

**సింహం:** భూవివాదాలు కొంత వరకు తీరుతాయి. ఉద్యోగాలలో అనుకోని మార్పులు వుంటాయి.

**కన్య :** విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు. చిన్ననాటి మిత్రులను కలుస్తారు.

**తుల :** ఆర్థిక లావాదేవీలు సంతృప్తి కరంగా ఉంటుంది. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

**వృశ్చికం:** ఉద్యోగాలలో పదోన్నతులు, హోదాలు పొందుతారు. పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**ధనుస్సు:** దూర ప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి వివాదాలు తీరి ఊరట చెందుతారు.

**మకరం:** సోదరులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా "సాగుతాయి. వస్తులాభం.

**కుంభం:** ఉద్యోగాలలో అనుకూల వాతావరణం. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ప్రయాణాలు.

**మీనం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. బంధువుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఖజానా ఖాళీ చేసి మామీద నిందలా?

>> ప్రధాని ఇందిరా గాంధీ లాంటి నాయకత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అనర్థాలకు కేసీఆర్ బాధ్యత వహించాలని, రాష్ట్ర ఖజానాను లూటీ చేసింది కేసీఆరే అని ఆయన మండిపడ్డారు. ఆయన స్పీచ్ అంతా అక్కసుతో నిండి ఉందని విమర్శించారు. తాను సీఎం అయిన రెండో రోజే కేసీఆర్ గుండె పగిలిపోయిందని ఆరోపించారు. గతంలో ఖమ్మంలో రాహుల్ గాంధీ సభకు వాళ్లు కనీసం బస్సులు ఇవ్వలేదని పేర్కొంటూ తాము మాత్రం కేసీఆర్ సభకు ఎన్ని బస్సులు అంటే అన్ని బస్సులు ఇచ్చాం,ఆర్టీసికి ఆదాయం కూడా వచ్చిందని పేర్కొన్నారు. బస్సులు ఆపితే సభ ఆగిపోతుందని అనుకునేంత ఆలోచన వాళ్లది అని వాఖ్యానించారు. కేటీఆర్, హరీష్ రావులను చిన్నపిల్లలుగా పేర్కొన్న వ్యాఖ్యలు కూడా కేసీఆర్ తీరుని ప్రతిబింబిస్తున్నాయని, తాను అసెంబ్లీలో ఏం చెప్పానో కెసిఆర్ కూడా బిఆర్ఎస్ సభలో అదే చెప్పారన్నారు. పిల్లగాళ్లు అని కెసిఆర్ అన్నాడు మరి వాళ్లెందుకు అసెంబ్లీకి పంపిస్తున్నాడు అని ప్రశ్నించారు. ఏడాదిన్నరగా పథకాలు ప్లానింగ్‌కే సమయం సరిపోయిందని, ఇప్పుడు వాటన్నింటినీ స్ట్రీమ్‌లైన్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఇకపై పథకాలు గ్రౌండింగ్ మీద ఫోకస్ పెడతానని చెప్పారు. కెసిఆర్ మాదిరిగా లాంచింగ్... క్లోజింగ్ నేను చేయను, షో పుటప్ స్కీంలు నా వల్ల కాదు అని వ్యాఖ్యానించారు. కెసిఆర్ ప్రవేశపెట్టినవన్నీ శాంపిల్ పథకాలే, ఆయనలా లాంచింగ్ చేసి వదిలేయలేనని అన్నారు. ఒక పథకం ప్రారంభిస్తే అర్హులకు అందే వరకు పని చేస్తానని చెప్పారు. తానింకా 20 ఏళ్లు రాజకీయాల్లో ఉంటానని, కమిట్‌మెంట్ ఇస్తే చేసి తీరుతానని స్పష్టం చేశారు. తాము చేసింది చెప్పుకోవడంలో వెనుకబడ్డామని, పనులు వేగవంతం చేస్తామని, అధికార యంత్రాంగాన్ని స్ట్రీమ్‌లైన చేశామని తెలిపారు. గజ్వేల్‌లో నేను పెట్టిన సభనే హైలెట్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన స్కీంలు ఏ రాష్ట్రంలో అమలులో లేవని పేర్కొన్నారు. పదేళ్లు మాక్కూడా ప్రజలు అవకాశం ఇస్తారని, పదేళ్లలో ఆయన చేసిన విధ్వంసం సెట్ చేయడానికి ఏడాది సరిపోయిందని పేర్కొన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అనర్థాలకు కేసీఆరే కారణమని, కేసీఆర్ అభద్రతా భావంలో అక్కసు వెల్లగక్కారని ఫైర్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ కేసుల విషయంలో చట్టం మేరకే చర్యలు తీసుకుంటామని, చట్టం ప్రకారం పనిచేస్తామని అన్నారు. కేసీఆర్ లాగా తాను చట్టాన్ని అతిక్రమించి అరెస్టులు చేయించనన్నారు. కేటీఆర్ మీద ఉన్న కేసులు కూడా చట్ట ప్రకారమే సాగిస్తామని స్పష్టం చేశారు. తనకు రాహుల్ గాంధీతో మంచి మైత్రి ఉందని, ఇది ఎవరు నమ్మినా, నమ్మకపోయినా తనకు పరవాలేదన్నారు. రాహుల్ గాంధీకి.. నాకు తెలిస్తే చాలు.. బయట ఎవరేం అనుకుంటున్నారు అనేది నాకు అనవసరమని రేవంత్ అన్నారు. కొంత మంది అధికారుల పనితీరు తెలిసినా, అవసరంగా ఉన్న కారణంగా వారి సేవలను కొనసాగించాల్సి వస్తోందని, ఆప్షన్ లేకపోవడంతో తప్పడం లేదన్నారు. కలెక్టర్ల మార్పుకునే వెసులుబాటు ఉందని, అందుకనే అవసరమైన మార్పులు చేసుకుంటామని వివరించారు. కొందరు అధికారులు సంపాదనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఎన్నికలకు చివరి 6 నెలలు తన పాలనపై చర్చ జరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**ఎమ్మెల్యేల పనితీరుపై సిఎం రేవంత్ హాట్ కామెంట్స్**

ఎమ్మెల్యేల పనితీరుపై సిఎం రేవంత్‌రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో టైమ్ పాస్ చేయొద్దు, నియోజకవర్గాల్లో తిరగండీ అంటే హైదరాబాద్ చుట్టూ తిరుగుతున్నారని, ఎమ్మెల్యేలు అయ్యాక మనోదు,మందోడు అని ఉండదన్నారు. సిఎల్పీ సమావేశంలో అందరినీ అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ప్రచారంకు వాల్ రైటింగ్స్ చేయిస్తామన్నారు. రేవంత్ చెప్పిది చేస్తాడు, అనే నమ్మకం ప్రజల్లో కలిగేలా పని చేస్తానన్నారు. తనను నమ్ముకున్న వారిని తాను ఎప్పటికీ మర్చిపోనని, నన్ను నమ్మిన వారిలో ఒకరైన దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి వచ్చిందని చెప్పారు. ఓపికగా ఉన్న వారికే తన నుండి బాధ్యతలు వస్తాయని, బయటకి వెళ్లి విమర్శలు చేస్తే తనపై బాధ్యత ఉండదన్నారు. ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలని, వారు వెళితేనే పథకాలు ప్రజల్లోకి వెళతాయని అన్నారు. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయని అన్నారు. ఇష్టానుసారంగా మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారని హెచ్చరించారు. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని సిఎం రేవంత్‌రెడ్డి మరోసారి హెచ్చరించారు. ఓపికతో ఉంటే నాకూ బాధ్యత ఉంటుందని, కాదు అని నా వెంట ఉండి బయటకు వెళ్లి ఎవరైనా విమర్శలు చేస్తే తనపై భారం ఉండదన్నారు. చెల్లుకు చెల్లు అయినట్లు ఫీలవుతానని స్పష్టం చేశారు.

# పాతబస్తీలో ఇడి సోదాలు

>> ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అంతర్గ తంగా విచారణ చేయడం తెలిసిందే. ఈ గోల్‌మాల్ రాకెట్‌లో సీనియర్, ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు, వారి కుటుంబ సభ్యులకు వాటా వుందని వార్తలు రావడంతో గత ఏడాది అక్టోబర్ నెలలో మొదటిసారి ఈడీ అధికారులు రంగంలో దిగి విచారణ చేబట్టారు. ఆ సమయంలో సీనియర్ ఐఎఎస్ అధికారి అమోయ్ కుమార్‌ను మూడు రోజుల పాటు సుధీర్ఘంగా విచారించారు. మొదటి రెండు రోజులు బషీర్‌బాగ్‌లోని తమ కార్యాలయంలో విచారించిన ఈడీ అధికారులు చివరిరోజు భూదాన్ భూములున్న నాగారం గ్రామానికి తీసుకువెళ్లి మరీ విచారించారు. దీంతో పాటు ఆయన పనిచేసిన కలెక్టర్ కార్యాలయంలోనూ విచారణ జరిగింది. ఆ సమయంలో అక్కడి రికార్డులను ఆయన సమక్షంలో పరిశీలించడంతో పాటు అక్కడి సిబ్బందిని కూడా ఈడీ అధికారులు విచారించారు. ఇదే సమయంలో అమో య్ కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా వున్న సమయంలో కార్యాలయంలో కీ లక విభాగాల్లో పనిచేసిన అధికారులను కూడా విచారించారు. విచారణ సందర్భంగా అమోయ్ కుమార్ వాంగ్మూలాన్ని ఈడీ అధికారులు నమోదు చేశారు. కాగా సోమవారం నాడు అప్పట్లో ఈ భూములను లే అవుట్ చేసి ప్లాట్లుగా విక్రయిం చిన పాతబస్తీలోని సంతోష్ నగర్, యాకూత్‌పురాకు చెందిన మునవర్ ఖాన్, ఖధీర్ వున్నీసా, సర్ఫాన్, సుకూర్ అనే వ్యక్తుల ఇళ్లలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ కేసులో ఖధీర్ వున్నీసా కీలకమైన వ్యక్తిగా చెబుతున్నారు. ఆమె తండ్రి ఇక్కడ వున్న 50 ఎకరాల భూమిని గతంలో భూదాన్ బోర్డుకు దాన ంగా ఇచ్చారు. అనంతరం ఈ భూముల్లో స్థానిక రైతులు సేద్యం చేస్తూ వస్తున్నారు. మధ్యలో సర్కారు ఈఐపిఎల్ అనే కంపెనీకి కొంత భూమి కేటాయించింది . దీని తరువాత అవుటర్ రింగ్ రోడ్డు ఈ ప్రాంతం గుండా వెళ్లడంతో భూముల విలువ ఒక్కసారిగా పెరగడంతో భూదాన్ భూములపై కొందరి కన్ను పడింది. ఈ క్రమంలోనే 2021లో ఖధీర్ వున్నీసా తిరిగి ఈ భూమి తనకు కావాలని, తన తండ్రికి తానే వారసురాలినని అర్జీ పెట్టుకుంది. అప్పట్లో తన తండ్రి దానం చేసిన భూమిని తనకు తిరిగి బదలాయించాలని, ఆర్థికంగా తాను చితికిపోయినందున తనకు మేలు చేయాలని ఆమె కోరింది. దీని తరువాత రాజకీయ నాయ కులు రంగ ంలో దిగి భూదాన్ బోర్డులో వున్న విలువైన 50 ఎకరాల భూమిని ఖధీర్ వున్నీసా పేరిట బదలాయించేశారు. ఆ సమయంలో రంగారెడ్డి జిల్లా క లెక్టర్‌గా అమోయ్ కుమార్ వున్నారు. ఈ భూముల బదలాయింపులో ఎలాంటి విచారణ చేయకుండానే ఏకపక్షంగా బదలాయించినట్లు ఈడీ గుర్తించింది. ఈ 50 ఎకరాల భూ ములను ప్లాట్లుగా విభజించారు. వీటిని చాలా మంది కొనుగోలు చేశారు. అతి తక్కువ ధరకు కొన్న వారిలో సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులతో పాటు ఒకరిద్దరు మాజీ చీఫ్ సెక్రటరీలు, మాజీ డిజిపిలు కూడా వున్నారని ఈడీ గుర్తించిందని తెలిసింది. ఈ క్రమంలోనే పాతబస్తీలో వుంటున్న నలుగురి ఇళ్లలో ఈడీ అధికారులు దాడులు చేబట్టి సోదాలు నిర్వహించారు. దాడుల సం దర్భంగా కీలక పత్రాలతో పాటు కొన్ని వాహనాలను జప్తు చేశారు. ఈ సోదాలు రాత్రి వరకు కొనసాగాయి.



26 రాఫెల్ ఎం (మెరైన్) విమానాల కొనుగోలు కోసం సోమవారం న్యూఢిల్లీలో ఒప్పంద పత్రాలను మార్చుకొంటున్న భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులు

# రూ. 64 వేల కోట్లతో 'రఫేల్'

>> రక్షణ మంత్రిత్వశాఖ అధికారులు, ఫ్రాన్స్ రాయబారి హాజరై నట్లు పేర్కొన్నాయి. ఇది పూర్తిగా భారత్ ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందమని వివరించాయి. భారత్‌ఫ్రాన్స్‌ల మధ్య ద్వైపాక్షిక రక్షణ సహకారం బలోపేతమే లక్ష్యంగా ఇరుదేశాల ప్రభుత్వాల మధ్య, ఇంకా ప్రభుత్వం, వ్యాపారాల మధ్య అనేక అనుబంధ ఒప్పందాలు జరిగినట్లు తెలుస్తోంది. 26 రఫేల్ మెరైన్ జెట్లను విమాన వాహకనౌకలపై వెంటనే మోహరించాల్సిన అవసరం ఉంది. వీటిల్లో 22 సింగిల్ సీటర్ జెట్లు కాగా మరో నాలుగు ట్విన్ సీటర్ ట్రైనర్లు ఉన్నాయని, వీటి డెలివరీలు 2031 నాటికి పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు. అయితే, ఈ విమానాలను ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్యపై మోహరించనుంది భారత్. ప్రస్తుతం వాడుతున్న మిగ్ 29ల స్థానంలో వీటిని భర్తీ చేయనునుంది. అంతకుముందు ఐఎన్ఎస్ విక్రాంత్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కోసం యుద్ధ విమానాల కోసం ఫ్రెంచ్ డిఫెన్స్ సంస్థ డస్సాల్ట్ ఏవియేషన్ నుంచి భారత్ కొనుగోలు చేసింది. రెండు వారాల క్రితం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో వీటిని కొనుగోలుకు ఆమోద ముద్ర పడింది. కాగా, ప్రస్తుతం భారత వాయుసేన మొత్తం 36 రఫేల్ యుద్ధ విమానాలను వినియోగిస్తోంది. తాజాగా నేవీ కూడా వీటిని కొనుగోలు చేయనుండటం వల్ల రెండు దళాల మధ్య సమన్వయం పెరుగుతుందని నిపుణులు భావిస్తున్నారు. బడ్డీబడ్డీ రీఫ్యూయలింగ్‌కు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఓ ఫైటర్ జెట్ రీఫ్యూయలింగ్ పాడ్ సాయంతో మరో ఫైటర్ జెట్‌లో ఇంధనం నింపడాన్ని బడ్డీబడ్డీ రీఫ్యూయలింగ్ అంటారు. అప్పుడు భారీ ఫ్యూయల్ ట్యాంకర్ విమానాల అవసరం ఉండదు.

## నేటి నుంచి ఎప్‌సెట్

>> నేడు(మంగళవారం) రేపు(బుధవారం) రెండు రోజులపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం పరీక్షను నిర్వహించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 112 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. నిమిషం ఆలస్యం అయినా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించేది లేదని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. పరీక్షా కేంద్రంలోనికి గంటన్నర ముందు నుంచే అనుమతి ఇస్తున్నామని.. విద్యార్థులు త్వరగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 9 గంటల లోపుగా పరీక్ష నిర్వహించే కేంద్రం గేటులోనికి వచ్చిన వారందరికీ పరీక్ష రాసే అవకాశం కల్పించనున్నారు. నేటి నుంచి ప్రారంభం కానున్న ఎప్ సెట్ పరీక్షలకి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఎప్ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, కో కన్వీనర్, జేఎన్‌టియూ రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఎప్‌సెట్‌కి 3,06,796 మంది దరఖాస్తు చేసుకున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీకి 86,493 దరఖాస్తులు రాగా.. ఇంజనీరింగ్‌కి 2,20,049 దరఖాస్తులు... రెండింటికి 254 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 29, 30 తేదిల్లో జరిగే అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు.. 112 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. మే 2 నుంచి 4 వరకు జరిగే ఇంజనీరింగ్ పరీక్షలకు 124 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు .. తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులు చేయాల్సిందల్లా హాల్ టిక్కెట్లపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్‌తో స్కాన్ చేయడం. స్కాన్ చేసిన తర్వాత గూగుల్ మ్యాప్స్ అప్లికేషన్‌లో ఒక లింక్ తెరుచుకుంటుంది, దాంతోపాటు ట్రాఫిక్‌ను పరిగణనలోకి తీసుకుని వారి కేంద్రం ఎంత దూరంలో ఉంది.. అక్కడికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుందో కూడా విద్యార్థులు నిర్ధారించుకోవడానికి అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

# పంటల బీమా

>> చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేస్తోంది. అందుకోసం ఇప్పటికే ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్లో ప్రభుత్వం ఈ మేరకు నిధులు కూడా కేటాయించింది. బీమా ప్రీమియంలో రైతుల వాటాగా దాదాపు రూ.300 కోట్లు మేర ఉంటుందని అధికారులు అంచనా వేశారు. కాగా ఈ ప్రీమియం సొమ్మును కూడా రాష్ట్ర ప్రభుత్వం భరించి రైతులకు ఉచితంగా పంటల బీమా అమలు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. కాగా రాష్ట్రంలో గ్రామం, ప్రాంతాన్న యూనిట్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని పంటల బీమా అమలు చేయనున్నారు. అకాల వర్షాలతో నష్టం జరిగితే ఒక రకంగాను, కోత కోసి కల్లాల్లో ఉన్నప్పుడు నష్టం జరిగితే మరో రకంగా, స్వల్పంగా దిగుబడి వస్తే పరిహారం అందించేందుకు ఇంకో రకంగా ఆయా గ్రామాల పరిస్థితులకు అనుగుణంగా బీమా పరిహారాన్ని అమలు చేయాలని వ్యవసాయ శాఖ ఆలోచన చేస్తోంది. ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి కావడానికి గాను అవసమైన విధివిధానాలు ఇప్పటికే ఖరారు చేయడం జరిగింది. ఇక వచ్చే వానాకాలం సీజన్లో రాష్ట్ర వ్యాప్తంగా 1.60 కోట్ల లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రకృతి విపత్తులతో నష్టం జరిగితే రైతులకు పరిహారం అందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా వానాకాలంతో పాటు, యాసంగి సీజన్లలో ప్రకృతి వైపరీత్యాలు, నీళ్ల లేక పంటలు ఎండిపోయినా, అకాల వర్షాలు, వరదలు తో నష్టం జరిగినా ఈ పంటల బీమా ద్వారా ఆదుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

## ఈఆర్సీ సభ్యులుగా శ్రీనివాసరావు, రఘు

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** తెలం గాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) సభ్యులుగా సిహెచ్ శ్రీనివాసరావు, కె రఘులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరి గరిష్ట పదవికాలం 5 ఏళ్ల కాగా, అంతకు ముందే 65 ఏళ్ల వయస్సుకి చేరితే మాత్రం అప్పటి వరకే ఈ పదవిలో కొనసాగుతారు.

## నరేందర్‌రెడ్డి పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్ ఏప్రిల్ 28:** చిత్రకారుడు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలో పెయింటింగ్ ఎగ్జి బిషన్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోమ వారం ప్రారంభించారు. కావూరి హిల్స్ చిత్ర మయి స్టేట్ ఆర్ట్స్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి పెయింటింగ్స్‌ను పరిశీలించారు.

## యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్/ మిర్యాలగూడ, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. దామచర్లలోని పవర్ ప్లాంట్ మొదటి యూనిట్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. సోమవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో మొదటి యూనిట్‌లోని బాయిలర్ నుంచి ఆయిల్ లీక్‌అయింది. అదేసమయంలో కింద వెల్డింగ్ చేస్తుండగా మంటలు అంటుకున్నాయి. క్రమంగా అవి యూనిట్ మొత్తానికి వ్యాపించడంతో పెద్ద ఎత్తున అగ్ని కీలలు ఎగసిపడుతున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. సకాలంలో మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో 600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. ట్రయల్ రన్‌కు సిద్ధమవుతుండగా ప్రమాదం చోటుచేసుకోవడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి 14న కూడా యాదాద్రి పవర్‌ప్లాంటులో ప్రమాదం జరిగింది. యాష్ ప్లాంట్ ఈఎస్పీ వద్ద కాలిన బూడిద పడటంతో ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్లాంటులోని రెండో యూనిట్ నుంచి ప్రస్తుతం 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న క్రమంలో ఈఎస్పీ వద్ద యాష్ జామ్ కావడంతో ట్రిప్ అయ్యి బాయిలర్ నిలిచిపోయింది. జామ్ అయిన యాష్‌ను తొలగిస్తున్న క్రమంలో ఒక్కసారిగా వేడి బూడిద మీద పడి ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. కాగా ట్రాయల్ రన్ చేసేటప్పుడు ఇలాంటి ప్రమాదాలు సహజమే అని థర్మల్ పవన్ ప్లాంట్ అధికారులు చెబుతున్నారు. గత డిసెంబర్‌లో యూనిట్2ను కూడా జాతికి అంకితం చేశారు. ఇప్పుడు తాజాగా వచ్చే నెలలో యూనిట్ 1లో విద్యుత్ ఉత్పత్తిని చేసే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. కానీ ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు చెబుతున్నారు. అగ్నిప్రమాదం సంభవించిన యాదాద్రి థర్మల్ పవర్ యూనిట్‌కు మరమ్మతులు చేసి వెంటనే సాధారణ కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జనెక్కో సిఎండి సందీప్ కుమార్ సుల్తానియా వెల్లడించారు ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వీలైనంత త్వరగా యూనిట్ మరమ్మతు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-4-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 87 పేజీలు: 10+4 వెల: 6.50


## రూ.64వేల కోట్లతో 'రఫేల్'

### 26 మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలు కోసం భారత్ - ఫ్రాన్స్ ఒప్పందం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** భారత్‌ఫ్రాన్స్ మధ్య 26 రఫేల్ మెరైన్ యుద్ధ విమానాల కోసం రూ. 64 వేల కోట్ల విలువ చేసే ఒప్పందం జరిగింది. ఈ మేరకు ఇరు దేశాల అధికారుల మధ్య సంతకాలు జరిగాయి. భారత ప్రతినిధిగా రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. దీనికి ఇరు దేశాల రక్షణమంత్రులు వర్చువల్‌గా హాజరైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా >>2



## ప్రధాని మోడీతో రాజ్‌నాథ్ భేటీ

### తాజా పరిస్థితులపై ప్రధానికి రక్షణ మంత్రి వివరణ


### పాక్‌కు తుర్కియే యుద్ధ విమానాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** పహల్గాం ఉగ్రదాడి ఘటన తర్వాత దిల్లీలో జరుగుతున్న వరుస భేటీలు ఉత్కంఠ రేపుతున్నాయి. సోమవారం ఉదయం 11గంటలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమావేశమయ్యారు. ప్రస్తుతం జమ్ము కశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై మోదీకి రాజ్‌నాథ్ వివరించారు. ఈ క్రమంలోనే భద్రతా పరిస్థితులతో పాటు సైన్యం తీసుకున్ననిర్ణయాలను మోదీకి వివరించారు. ప్రధాని మోడీ నివాసంలో దాదాపు 40 నిమిషాలపాటు ఈ సమావేశం జరిగింది. కాగా, ఈ భేటీ లో ఆయనతో పాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ కూడా పాల్గొన్నారు. పహల్గాం ఉగ్రదాడి బాధ్యులకు కఠిన శిక్ష తప్పదని ఆదివారం >>2

## పాక్ యూట్యూబ్ ఛానళ్లపై భారత్ నిషేధం 7

### కేంద్రం మరో కీలక నిర్ణయం

### 'ఉగ్ర'కవరేజీపై బిబిసికి లేఖ



## నేటి నుంచి ఎప్‌సెట్

### నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు..

### నేడు, రేపు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష

### 112 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

### 2 నుంచి ఇంజినీరింగ్ ఎగ్జామ్

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్ సెట్-2025 పరీక్షలు నేటి (మంగళశారం) నుంచి ప్రారంభం కానున్నాయి. >>2



సోమవారం పద్మవిభూషణ్ అవార్డును నాగేశ్వర్‌రెడ్డికి, పద్మభూషణ్ అవార్డును బాలకృష్ణకు అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

## ఘనంగా 'పద్మ' అవార్డుల ప్రదానం

### పద్మ విభూషణ్: నాగేశ్వర్‌రెడ్డి, పద్మభూషణ్: బాలకృష్ణ, పద్మశ్రీ : మాడుగుల నాగఫణిశర్మలకు అవార్డులను అందజేసిన రాష్ట్రపతి

**హైదరాబాద్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు భారత గణతంత్ర దినోత్సవం (రిపబ్లిక్ డె సెలబ్రేషన్స్) వేళ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల (పద్మాఅవార్డులు 2025) ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లోఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం >>2



కెసిఆర్‌పై మండిపడ్డ సిఎం రేవంత్

# ఖజానా ఖాళీ చేసి మా మీద నిందలా?

## కెసిఆర్ ప్రసంగం అక్కసుతో ఉంది, స్పష్టత లోపించింది

### నమ్మినా నమ్మకపోయినా రాహుల్‌గాంధీతో నాకు గ్యాప్ లేదు

### గులాబీ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరు

### బిఆర్ఎస్ ప్రవేశపెట్టినవన్నీ శాంపిల్ పథకాలే, వారిలా లాంచ్ చేసి వదిలేయలేను

### ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లో కాదు, నియోజకవర్గాల్లో పర్యటించాలి

### కొందరు అధికారులు సంపాదనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆరోపణలు

### మీడియా చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 28:** బిఆర్ఎస్ ఎల్కతుర్తిలో నిర్వహించిన పార్టీ రజతోత్సవ సభలో ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రసంగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ ప్రసంగం పూర్తిగా అక్కసుతో నిండి ఉందని, ఆయన మాటల్లో స్పష్టత కొరవడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ఖజానాను కేసీఆర్ పూర్తిగా ఖాళీ చేసి, ఇప్పుడు ఆ నిందను కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం సీనియర్ కాంగ్రెస్ నేత జానారెడ్డితో సమావేశమైన అనంతరం సిఎం రేవంత్ మీడియాతో చిట్ చాట్ గా మాట్లాడుతూ.. కేసీఆర్ కాంగ్రెస్ పార్టీపై, పాలనపై చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని, కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడుతున్నారని ఆయన తప్పుపట్టారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి, తనకు మధ్య దూరం పెరిగిందంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. రాహుల్ గాంధీతో తనకు ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని స్పష్టం చేశారు. అవసరాలకు అనుగుణంగా కేసీఆర్, ప్రధాని నరేంద్రమోడీ తమ వైఖరిని మార్చుకుంటున్నారని విమర్శించారు. దేశానికి దివంగత >>2

## పదేళ్లుగా అభివృద్ధికి దూరంగా నల్లగొండ



నల్లగొండ జిల్లాలో పలు అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

### డిండి లిఫ్ట్‌కు రూ.1800 కోట్లతో పనులు మొదలు పెట్టి కాల్వలను విస్తరిస్తాం..

### ఎస్ఎల్‌బిసి మా హయాంలోనే పూర్తి చేస్తాం

### ఇక రెండు నెలలకోసారి ప్రాజెక్టులపై సమీక్ష చేస్తాం:

### మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

**నల్గొండ ప్రతినిధి, ఏప్రిల్28,ప్రభాతవార్త:** ఉమ్మడి నల్గొండ జిల్లాలో చేపట్టిన ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. సోమవారం ఆర్అండ్‌బి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డితో కలిసి నల్గొండ జిల్లా లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జిల్లా కేంద్రం సమీపంలోని బక్కతాయి కుంట వద్ద 20 కోట్ల 22 లక్షల రూపాయల అంచనాలతో నిర్మించనున్న బక్కతాయకుంట లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు, 6 కోట్ల 8 లక్షలు రూపాయలతో నిర్మించే పునుగోడు ఎత్తిపోతల పథకానికి, 19.95 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నర్సింగ్ బట్ల ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 36 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న అదనపు బ్లాక్ కు శంకుస్థాపన చేశారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫోటో ప్రదర్శనను తిలకించిన అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. గతప్రభుత్వ హయాంలో పదేళ్ళు అదికారంలో ఉన్నా నల్గొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులు చేపట్టలేదని కనీసం జిల్లాలో ఉన్న సమస్యల పరిష్కరించే ప్రయత్నం చేయలేదని ఆరోపించారు . ఎన్నో ఏళ్ల నుండి ఈప్రాంత రైతులు ఎదురుచూస్తున్న డిండి లిఫ్ట్ ఇరిగేషన్ కు ఎదుల ద్వారా నీరు అందించేందుకు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 1800 కోట్ల రూపాయలను మంజూరు చేసి పనులు మొదలుపెట్టామని చెప్పారు. హై లెవెల్ కెనాల్ కు 442 కోట్లు మంజూరు చేశామని ,పిల్లాయపల్లి కాలువ,శివన్న గూడెం నుండి నారాయణపూర్, చౌటుప్పల్ మీదుగా సాగునీరు అందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు త్వరితగతిన మంజూరు చేస్తానని ప్రకటించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా రైతుల ప్రయోజనం కోసం మూసి పునరుద్ధరణ చేసి రైతులకు మేలు చేస్తామన్నారు. తమ హయాం లోనే ఎస్ఎల్బిసిని పూర్తిచేసి నీరందిస్తామని చెప్పారు. దున్నపోతుల గండి లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు,మరో నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్లు పూర్తిచేస్తామని, అలాగే ఐటిపాముల లిఫ్ట్ పనులు కూడా వేగవంతం చేసిపూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నాగార్జునసాగర్ నియోజకవర్గానికి మేలు చేసే నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేసి అతి త్వరలోనే >>2

## ఆపరేషన్ కగార్‌పై పార్టీ నిర్ణయం తర్వాతే ప్రభుత్వ విధానం

7 జానారెడ్డితో సమావేశం, దిగ్విజయ్‌కు సిఎం రేవంత్ ఫోన్



పాతబస్తీలో సోదాలు చేస్తున్న అధికారులు

## పాతబస్తీలో ఇడి సోదాలు

### భూదాన్ భూములను లే అవుట్ చేసిన నలుగురి ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు.. కీలక పత్రాలు, 40 వాహనాలు జప్తు

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన భూదాన్ భూముల బదలాయింపు వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) మరోసారి రంగంలో దిగింది. గత ఏడాది అక్టోబర్ నెలలో భూదాన్ భూముల బదలాయింపు సమయంలో రంగారెడ్డి కలెక్టర్‌గా పనిచేసిన సీనియర్ ఐఎఎస్ అధికారి అమోయ్ కుమార్‌ను విచారించిన ఈడీ అధికారులు తాజాగా సోమవారం నాడు ఈ భూములను లే అవుట్ చేసి ప్లాట్లుగా మార్చిన పాతబస్తీకి చెందిన నలుగురు ఇళ్లు, కార్యాలయాలు 14 చోట్ల తనిఖీలు చేసి, కీలక పత్రాలతో పాటు 40న్న వాహనాలను జప్తు చేశారు. రంగారెడ్డి జిల్లా నాగారం పరిధిలో సర్వే నంబర్ 181, 182లో గల 103 ఎకరాల భూదాన్ భూముల్లో గల 50 ఎకరాల విలువైన భూదాన్ భూముల ను రైతుల నుంచి బలవంతంగా తీసుకుని ఇతరులకు బదలాయించడంపై చెలరేగిన వివాదం ఇంకా కొనసాగుతోంది. దీనిపై >>2

## యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో అగ్నిప్రమాదం 2








### రైతుల వాటా రూ.300 కోట్లు

### రూ.1,300 కోట్లు భరించనున్న సర్కార్

### బీమా సంస్థలతో ఇప్పటికే వ్యవసాయ శాఖ చర్చలు

## వానాకాలం నుండి పంటల బీమా

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** తెలంగాణలో వచ్చేవానాకాలం నుంచి కేంద్రంఅమలు చేస్తున్న పంట బీమా పథకాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేం దుకు రాష్ట్ర సర్కార్ సన్నాహాలు చేస్తున్నది. ఇప్పటికే పంటల బీమాపై వ్యవసాయ శాఖ అధికారులు కసరత్తు చేశారు. ఈ నేపథ్యంలోనే రైతులకు ఉచితంగా పంటల బీమా సదుపాయం కల్పించేందుకు వివిధ బీమా కంపెనీలతో అధికారులు సంప్రదింపులు చేశారు. పంటల బీమా కోసం నిర్వహించే టెండర్లలో బీమా కంపెనీలు కోట్ చేసే ప్రీమియం ధరలను బట్టి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఈ బీమా కోసం రైతులు చెల్లించే బీమా ప్రీమియం వాటాను కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించడానికి ముందుకు వచ్చింది. దీంతో రైతులకు పైసా ఖర్చు లేకుండానే ఉచితంగా పంటల బీమా అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలో అమలు చేసే పంటల బీమా పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలతో పాటు, రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వాటాను రాష్ట్ర సర్కారే భరించనుంది. వ్యవసాయ శాఖ అంచనాల మేరకు వానాకాలం, యాసంగి రెండు సీజన్లకు కలిపి 1,300 కోట్ల రూపాయల మేర ప్రీమియం రూపంలో బీమా కంపెనీలకు >>2

వార్త

జీవితం అంటే ఒక సమస్య నుంచి మరొక సమస్యకు ప్రయాణం మాత్రమే. ఏ సమస్యలూ లేని జీవితం ఉండదు.

-వాల్టర్ స్కాట్

# అవినీతిని మట్టుపెట్టగలమా?


ఒర్లి ఒర్లి వారుపోతారు వండకతిని మనం పోదామన్నట్లుగా ఉంది అవినీతిపరులైన అధికారుల వ్యవహారశైలి. ఒకపక్క అవినీతి ఎక్కడ, ఏ రూపంలో ఉన్నా కూకటివేళ్లతో పెకలించివేస్తామని, అటు కేంద్ర, ఇటు రాష్ట్ర పాలకులు అరిచికేకలు పెడుతున్నా అవినీతి అధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. అవినీతి యధేచ్ఛగా విజృంభించిపోతున్నది. పరాకాష్ఠకు చేరుకుంటుందని చెప్పొచ్చు. ఆదాయానికి మించి ఆస్తుల కేసుల్లో అరెస్టు అయిన కాళేశ్వరం ఇంజినీరింగ్ చీఫ్ ఆస్తుల విలువ ఇప్పటికి జరిగిన దర్యాప్తు ప్రకారం దాదాపు రెండువందల కోట్లకుపైమాటేనని అధికారవర్గాలు అంచనా వేస్తున్నట్లు తెలిసింది. ఇంకా ఆయన బంధువులు, మిత్రుల పేర్లపై బినామీ ఆస్తులు ఎన్నో ఉన్నట్లు తెలుస్తున్నా అవి రుజువు చేసేందుకు కావాల్సిన ఆధారాల కోసం లోతైన దర్యాప్తు చేస్తున్నారు. దీంతో ఆయనను కస్టడీకి తీసుకొని విచారణ చేపట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్టుతోసహా నీటిపారుదల శాఖలో ముఖ్యమైన ప్రాజెక్టులలో ఆయన కీలకపాత్ర వహించారు. ఆయన చేతుల మీదుగా వేలాది కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టుల పనులు కొనసాగాయి. ఇప్పుడే కాదు ఇంతకుముందు కూడా ఆదాయానికి మించిన ఆస్తులున్నవారిపై ఆకస్మిక దాడులు చేసి కేసులు పెట్టిన సందర్భాలెన్నో ఉన్నాయి. అలాంటి వారిని జైళ్లకు పంపుతున్నారు. అయినా ఇవి ఆగడం లేదు. మొన్న ఆ మధ్య హైదరాబాద్‌లో రేరా కార్యదర్శిగా, మెట్రోరైలు ప్రణాళికా విభాగం అధికారిగా ద్విపాత్రాభినయం చేస్తున్న అధికారి ఇంట్లో, ఆయన సమీప బంధువుల ఇళ్లల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు చేసినదాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఏకంగా కోటి రూపాయల నగదు, కళ్లుచెదిరే ప్యాకింగ్‌లో భద్రపరిచినబంగారు ఆభరణాలు యాభైకిపైగా అత్యంత ఖరీదైన గడియారాలు, నలభై వరకు ల్యాప్‌టాప్‌లు, ఐఫోన్లతో పాటు వివిధ బ్యాంకుల్లో కోట్లరూపాయల్లో డిపాజిట్లు, విల్లాలు, ప్లాట్లు, భూములు, తదితరవెన్నో వెలుగుచూశాయి. అంతకు ముందు కూడా ఎందరో కీలకపోస్టుల్లోఉన్న అధికారులు ఎసిబి దాడుల్లో పట్టుబడ్డారు. ప్రస్తుతం తాజాగా పట్టుబడ్డ కాళేశ్వరం ఇఎన్‌సి కానీ, అటు రేరా అధికారి కానీ ఒక్కరే వ్యవహారాన్ని ఎలా నడపగలిగారు? ఇంత భారీ ఎత్తున అవినీతికి పాల్పడుతుంటే పర్యవేక్షించాల్సిన అధికారులు, పాలకులు ఏంచేశారు. అందులో వారికి కూడా భాగస్వామ్యం ఉందా? పైవారికి కూడా ముడుపులు అందుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉన్నతస్థాయిలో ఉన్న కొందరు అధికారుల అండదండలు లేకుండా ఇన్ని కోట్ల రూపాయలు లంచాల రూపంలో భోంచేయడం సాధ్యమయ్యేపనికాదు. ఈ దాడులు కానీ, జైళ్లు కానీ చట్టాలు కానీ ఈఅవినీతి అధికారుల అక్రమాలకు అడ్డు కట్ట వేయలేకపోతున్నాయి. అవినీతికి పాల్పడేవారి సంఖ్య దేశవ్యాప్తంగా చూస్తే కోట్లలో ఉండవచ్చు. అవినీతి నిర్మూలనకు దశాబ్దాల తరబడి ప్రయత్నాలు చేస్తున్నామని నేతలు చెప్పుకుంటున్నా అది అంతకంతకు పెరుగుతున్నదే తప్ప తగ్గడంలేదు. అవినీతికి పాల్పడినట్లు రుజువు అయితే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ముఖ్య మంత్రులు, కేంద్ర మంత్రులు, చివరకు ప్రధాన మంత్రితో సహా అందరూ పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. అవినీతి నిర్మూలన విషయంలో రాజీలేని పోరాటం చేస్తామని పెద్ద పెద్ద ప్రకటనలు ఇస్తున్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ భారీ అవినీతి దేశానికి పెనుసవాలుగా మిగులుతుందని, చెదలపురుగులా పట్టితొలచి వేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పలు సందర్భాల్లో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మొన్న ఆమధ్య నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ విజిలెన్స్ యాంటి కార్పొరేషన్ సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ వారసత్వంగా మారిన కుంభకోణాలు, అవినీతి కొన్ని రాష్ట్రాల రాజకీయాల సంస్కృతిలో అంతర్భాగమైపోయయాని అక్రమాలకు పాల్పడినవారికి సరైన శిక్షలుపడకపోతే అది మరింతగా రెచ్చిపోతుందని ఆయన హెచ్చరించారు. ఆయనే కాదు, మాజీ ప్రధానులు లాల్‌బహదూర్ శాస్త్రి, గుల్జారీలాల్ నంద, తదితర జాతీయ నాయకులెందరో అవినీతి జిడ్డు తమకు ఏమాత్రం అంటకుండాఎంతో ఆదర్శంగా ఉంటూ అవినీతిని నియంత్రించేందుకు తమవంతు కృషిచేశారు. అయితే అవినీతిముందు ఓడిపోయామని చెప్పలేం కానీ విజయం మాత్రం సాధించలేకపోయారు. ఫలితంగా భారత్‌లో అవినీతి పొగమంచులా విస్తరించిపోతున్నది. దేశవ్యాప్తంగా లక్షలాది కోట్లతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. అవినీతి అదే స్థాయిలో చొచ్చుకుపోతున్నది. గతంలో లేదనికాదు. ఇప్పుడు అది శృతిమించిపోతున్నది. దేనికైనా హద్దుపద్దు ఉండాలి. దారులుకొట్టి బతికే బంధిపోటు దొంగలకుకూడా దోపిడీకి, దోపిడీకి మధ్య కొంతవ్యవధి ఇస్తుంటారు. కానీ కొందరు అధికారులు ఆ సమయం కూడా ఇవ్వడం లేదు. ఇటు రాష్ట్రాల్లోని ఎసిబిలు కానీ, అటు కేంద్ర పరిధిలోని సిబిఐని కానీపెద్దగా పట్టించుకోవడం లేదు. గతంలోఅంతో ఇంతో భయభక్తులుండేవి. పట్టుబడి అరెస్టు అయి జైలుకు వెలితే సమాజంలో జంకు, బిడియం ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితులు మారిపోయాయి. వీరికి కొందరు రాజకీయ నాయకులు రక్షకులుగా నిలబడుతున్నారు. అందుకు వీగిపోతున్న కేసులు బలం చేకూరుస్తున్నాయి. ఏదిఏమైనా అవినీతిని నియంత్రించకుండా ఆశించిన మేరకు అభివృద్ధి సాధించడం అసాధ్యం. కానీ అవినీతిని కూకటివేళ్లతో పెకలించడం అంతసులభంకాదు. దానికి ఎంతో ధైర్యం, త్రికరణశుద్ధి, వీటన్నింటిని మించి రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకోగలిగిన గుండె కావాలి.

ఈప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. అయితే అందుకు అవలంబించే విధానం లోపభూయిష్టంగా ఉండరాదు.



ఎల్లెన్ గ్లాస్గో

కష్టాలనేవి కలకాలం ఉండవు. క్లిష్టసమస్యలు వచ్చినప్పుడు స్థిరచిత్తులై నిలవండి.



గోల్డ్‌స్మిత్

## ప్రజావాక్కు



### గ్రంథాలయాలకు మంచి రోజులు ఎప్పుడు?

రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడ్డాయి కానీ ఇంకా మనకు గ్రంథాలయవిధానం ప్రత్యేకంగాతయారు కాలేదు. ఉన్నత పదవుల్లో ఆంధ్రఅధికారులే ఉన్నారు. ప్రభుత్వాలు మంచి తలపెట్టినా అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. చైర్మన్లు గ్రంథాలయ పరిషత్ అధ్యక్షులు ఉత్సవ విగ్రహాల్లా తయారయ్యారు. అధికారులచేతుల్లో కీలుబొమ్మల్లా తయారయ్యారు. తోక జాడిస్తే తమకు వచ్చే రెమ్యూనరేషన్లు రావనే బెంగ కూడానూ! గ్రంథాలయ ఉద్యోగ సంఘాలు అధికారుల కనుసన్నల్లో వారిఆగ్రహాలకు ఆనందాలకు తలుపుతూ పనిచేస్తున్నారు. అలా కాకుండా అందరూ మంచే చేస్తే?!కొత్తఉద్యోగాలు రాలేదు. గ్రంథాలయ విధానంలేదు. ఆంధ్రాఅధికారుల పెత్తనంపోలేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులజీవితాలు మారలేదు. సాంకేతికంగా లైబ్రరీలు 1శాతం కూడా ఆధునీకరణ కాలేదు.

-కిరణ్, హైదరాబాద్

### సీనియార్టీ ప్రాతిపదికగా ప్రమోషన్లు ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాశాఖకు సంబంధించిమే, జూన్ నెలల్లోస్కూల్స్ ప్రారంభమయ్యేనాటికి టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వడానికి, ట్రాన్స్‌ఫర్లుచేయడానికి ప్రభుత్వం సమాయత్తమవుతుంది. ఈనేపథ్యంలో ఎవరు ప్రాతినిధ్యంవారు చేస్తూ ఉన్నారు. ప్రమోషన్లు ప్రాతిపదిక సీనియారిటీ అవ్వాలి. కానీ గత కొన్నిదశాబ్దాలుగా అలా జరగడంలేదు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు, కుంటి ,గుడ్డి మొదలగు అంగవైకల్యం ఉన్నవారు, మనోవైకల్యం ఉన్నవారు, ఆటగాళ్లు పాటగాళ్లు అనేకరకాల వాళ్లు, చట్టాలలోని లోపాలను అడ్డుగా పెట్టుకొని ప్రమోషన్లు పొందుతూ ఉన్నారు. ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభించినప్పుడు ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు డైరెక్ట్ రిక్రూట్మెంట్ వాళ్లకి పోస్టింగ్ ఇవ్వరాదు.

- వీరగంట భాస్కర్ రావు, విజయనగరం జిల్లా

### ఎదురుకాల్పులు ఆమోదయోగ్యంకాదు

మావోయిస్ట్, పోలీస్ బలగాల మధ్య కర్రెగుట్టలలో జరుగుతున్న ఎదురుకాల్పులు ఎంతమాత్రం ఆమోదయోగ్యమైన పని కాదు. మావోయిస్టుల సమస్యను ఆర్థిక సామాజిక కోణంలో కాకుండా శాంతి భద్రతల సమస్యగా చూడడం వల్లనే ఈఘర్షణ పూర్వవాతావరణం ఏర్పడింది. అయితే పౌర సమాజం ముఖ్యంగా తెలంగాణ పౌర సమాజం 2004లో చర్చల పేరుతో ఒక ప్రయోగం చేసింది.

- భారత అవినాష్, జనగామ

### రికార్డులలోనే వ్యవసాయ భూమి?

ప్రభుత్వ ఆర్థిక సహాయంతో పేద ప్రజలకు కొని ఇచ్చిన కాలనీలలో ఇండ్లస్థలాల భూమి అక్రమాలు ఒకచోట జరుగుతుండగా కాలనీ భూమి కొంతమంది రైతుల పేరిట ఉంది వారికి రైతుబీమా, రైతుబంధుప్రభుత్వ ఆర్థికసహాయం అందుతుంది. వ్యవసాయ శాఖ, రెవిన్యూ శాఖ అధికారుల ప్రకారం అట్టి కాలనీఒక రైతుకు చెందినదిగా రికార్డులలో నమోదు అయింది. రియల్‌గా ఫీల్డ్ మీద చూస్తే కాలనీలలో పేద ప్రజలు ఇల్లు కట్టుకొని ఉన్నారు. కొన్ని రిజిస్ట్రేషన్ అయినాయి. మరి కొన్ని కాలేదు. ఇట్టి వారికి స్థానిక గ్రామపంచాయతీ, రెవిన్యూ శాఖ ఇండ్ల యజమానుల హద్దులు నిర్ణయించి ఇంటి నెంబర్లు ఇవ్వాలి. ఇండ్లకు కరెంటు, మంచినీటి వసతికి గ్రామపంచాయతీ నల్లా నీళ్లు సరఫరా చేయాలి. రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ ఎవరి స్థలాలు వారికి ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలి.

- రాపాక రవీందర్, జనగాం

### నష్టపోయేది పాక్ మాత్రమే..

సిమ్లా ఒప్పందానికి ఒకచారిత్రక నేపథ్యం ఉంది. 1971 బంగ్లాదేశ్ అవతరణ జరిగిన తరువాత వచ్చిన ఒప్పందం ఇది. కేస్ ఫైర్ లైన్ అని బోర్డర్ లైన్ అని పిలువాల్సిందని ఇందిరాగాంధీ పైన విమర్శలు వచ్చినా ఓపిక వహించిన ఘనత మన దేశానికి దక్కుతుంది. మరి సిమ్లాఒప్పందం రద్దు తరవాత నియంత్రణ రేఖలు చెరిగిపోతాయి. అలాగే ఆధీన రేఖలు మలిగిపోతాయి. 1960-70లలో దక్షిణాసియా దేశాలలో సంపన్న దేశంగా వెలుగొందిన పాక్ నేడు ప్రపంచం ముందు తలదించుకుని పరిస్థితి ఉన్నది అంటే అతిశయోక్తి లేదు. పరిస్థితి ఏది ఎమైనా సిమ్లా ఒప్పందం రద్దుతో నష్టపోయేది పాక్ మాత్రమే.

- భారత అవినాష్, జనగామ

### నూతన విద్యా సంస్కరణలు

ఏపి రాష్ట్ర అధికార తెలుగు దేశం పార్టీ వివిధ శాఖల్లో పనితీరు మార్చే విధానాల్లో విద్య విధానంలో అవసరమైన మార్పులకు నిర్ణయం తీసుకున్నారు. వాటిలో అన్ని అంశాలు చాలా విలువైనవి. అమలులో చాలా ఉన్నత ప్రమాణాలు సాధించవచ్చు. విద్యార్థులపై పుస్తకాల ఒత్తిడి తొలగింపు, మానవతా విలువల బోధన, స్వతంత్ర పోరాట వీరుల చరిత్రలు, ఫ్లాష్ కార్డులు, ఇంటి పనుల్లో పిల్లల తోడు, లింగ సమానత్వం ప్రధానమైనవి. రాజకీయ జోక్యం లేకుండా అన్ని స్థాయిలలో జరిగేటట్లుచేస్తే విద్యాస్థాయిదేశంలో మంచిప్రగతి పథంలో ఉంటుంది.

-బొల్లోజు మేఘానాధమ్, విశాఖపట్నం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpagevaarta@gmail.com)

# ఉగ్రవాదానికి ఊతం డ్రగ్స్

**ప్రభుత్వాలు సరిహద్దు రాష్ట్రాలపై నిఘా ఉంచాలి. ఫెడరలిజాన్ని గౌరవించాలి. రాష్ట్రాలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండాలి. వివక్షత అణిచివేత ధోరణులు శ్రేయోస్కరం కాదు. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనకు కట్టుబడి ఉండాలి. సంకుచిత ధోరణులు, వివక్షత, అణిచివేతతో కూడిన పాలన ఎల్లప్పుడూ ప్రమాదమేనని పాలకులు గ్రహించాలి. దేశంలో ఉన్న అలజడులు, ఉగ్రవాద కార్యకలాపాలకు ఉన్న ప్రధాన కారణాలు ఇకనైనా పాలకులు గ్రహించి, అందరితో చర్చించి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయడం ద్వారా నిర్మూలన చేయవచ్చు. నిఘా సంస్థలు మరింత పారదర్శకంగా పని చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి. రాజ్యాంగం ప్రకారం వ్యవహరిస్తే అందరికి సమ న్యాయం జరుగుతుంది అని గ్రహించాలి. మన దేశానికి నష్టం కలిగించే విధంగా ప్రవర్తించే దేశాలపై అంతర్జాతీయ సంస్థల ద్వారా చర్యలు తీసుకునే విధంగా ఒత్తిడి తేవాలి. అవసరమైతే మన సత్తా చాటాలి.**

ఐ.ప్రసాద రావు

నేడు ప్రపంచవ్యాప్తంగా సవాలుగా ఉన్న పెను ప్రమాదం ఉగ్రవాదం. వివిధ దేశాల్లో ఉన్న అసమానతలు, అణచివేతలు, వివక్షతలు, రాజకీయ ఆర్థిక సామాజిక పరిస్థితులు, ముఖ్యంగా జాతి, మత సంఘర్షణలు, వేర్పాటువాదం, సంకుచిత ధోరణులు, దోపిడి వంటి పలు కారణాల వల్ల ఉగ్రవాదం మర్రిచెట్టు వలే వివిధ దేశాల్లో విస్తరించి ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణం అవుతుంది. గత వారంలో మనదేశంలో కాశ్మీర్, పెహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడుల్లో సుమారు 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడంతో ప్రపంచవ్యాప్తంగా మరల ఉగ్రవాదం అంశం మరింత సీరియస్‌గా అందరి దృష్టి సారించే విధంగా చేసింది. ముఖ్యంగా భారత్‌పై పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం దశాబ్దాలుగా అనేకసార్లు వివిధ ప్రాంతాల్లో దాడులు చేయడం జరిగింది. సాక్షాత్తు దేశ ప్రజాస్వామ్య నిలయంగా భావించే పార్లమెంటుపై కూడా తీవ్రవాదులు దాడిచేసిన ఘటన జరిగింది. పైన తెలిపిన వివిధ కారణాలతోపాటు అసలు ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం పెరగడానికి కావలసిన అత్యంత ప్రధానమైన వనరు ఆర్థికపరిపుష్టత, ఈ ఆర్థిక వనరు సులభంగా ఉగ్రవాదులకు 'డ్రగ్స్ వ్యాపారం' ద్వారా లభిస్తుంది అని వివిధ దర్యాప్తు సంస్థలు, నిఘాసంస్థలు తమ తమ నివేదికల ద్వారా కోర్టులకు, ప్రభుత్వాలకు, ప్రపంచానికి తేటతెల్లం చేస్తున్నాయి. అదే సమయంలో వివిధ దేశాలు ఉగ్రవాదులకు ఆశ్రమం కల్పిస్తూ, పెంచి పోషిస్తున్నాయి. ముఖ్యంగా మన దేశంలో ఉగ్రవాదం దశాబ్దాలుగా వెంటాడుతూనే ఉంది. దీనికి ప్రధాన కారణం మన సరిహద్దు దేశం పాకిస్థాన్ ప్రోద్బలంతో జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదం తరచూ బుసలు కొడుతోంది. అనేకమంది అమాయక ప్రజల ప్రాణాలు, సైనికుల జీవితాలను బలితీసుకుంటోంది. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో అస్సాం, మణిపూర్, త్రిపుర, మేఘాలయ మిజోరాం వంటి రాష్ట్రాల్లో మయన్మార్ బంగ్లాదేశ్ ఆఫ్ఘనిస్థాన్ వంటి దేశాల ద్వారా వివిధ రకాల మత్తు పదార్థాలు దేశంలోకి అక్రమ రవాణా జరగటం తద్వారా ఉగ్రవాదులకు ఆర్థిక సహకారం దొరకడం ద్వారా ఉగ్రవాదం మరింత బలపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, కాశ్మీర్‌లో సుమారు 40శాతం మంది యువత మత్తు పదార్థాలకు బానిసలైనారు అని పలు నివేదికలు చెబుతున్నాయి. ఈ నార్కోటిక్స్ వ్యాపారం ద్వారా అనేకఉగ్రవాద సంస్థలు లష్కరే ఈ తోయిబా (ఎల్.ఈ.టి) వంటి సంస్థలు ఆర్థికంగా బలపడంతోపాటు, మత్తులకు బానిసలైన యువతను ఉగ్రవాదం వైపు మళ్లిస్తూ, తర్ఫీదు ఇస్తూ అనేక దాడులు చేయించడం జరుగుతుంది. అనేక రకాలైన అత్యాధునికమైన తుపాకీలు, డ్రోన్లు, బాంబులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, యుద్ధ సామాగ్రి, నిఘా వ్యవస్థ సమకూర్చుకుంటూ ప్రభుత్వాలకు, ఆయా దేశాల సైనిక శక్తికి ఛాలెంజ్‌గా ఉండుట గమనార్హం. దీంట్లో భాగంగానే, కాశ్మీర్‌లో, ఇతర సరిహద్దు రాష్ట్రాల్లో ఉగ్రవాదులకు స్థానికులు ఆశ్రయం అందిస్తున్నారు. స్థానికప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలి. దేశానికి సంబంధించిన బడ్జెట్‌లో ఎక్కువ భాగం సైనిక రంగానికి కేటాయించడం జరుగుతుంది. ఇకనైనా యువతపై ప్రత్యేక శ్రద్ధవహించాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలి. మతోన్మాదశక్తులుగా, యుద్ధోన్మోద శక్తులుగా మారకుండా చూడాలి. ఇక ఒడిసా, ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతాలలో, జార్ఖండ్, బీహార్, ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ వంటి



ప్రాంతాల్లో 'గంజాయి' పండిస్తూ దేశవ్యాప్తంగా పెద్దఎత్తున అక్రమ రవాణా చేస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. అనేక అక్రమాలకు, దోపిడీలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా యువతను చెడువ్యసనాలకు బానిసలుగా మారి సమాజంలో అనేక రుగ్మతలకు కారణం అవుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మత్తుకు అలవాటైన యువత కారణం అవుతున్నారు. మన దేశంలోకి సరిహద్దు దేశాలైన చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ ఆఫ్ఘనిస్థాన్ మయన్మార్, భూటాన్ వంటి దేశాల ద్వారా అనేక విధాలుగా అనేక రకాలైన మత్తుపదార్థాలు హెరాయిన్, గంజాయి, నల్లమందు వంటివి అక్రమ మార్గంలో దళారుల ద్వారా వివిధరూపాల్లో ఘన, ద్రవ, పౌడర్ రూపాల్లో వివిధరకాల ఏజెంట్లద్వారా కావలసిన వారికి సురక్షితంగా చేరుతుంది. కోట్లరూపాయలు అక్రమార్కులకు, ఉగ్రవాదులకు, ఉగ్రవాద సంస్థలకు చేరుతుంది. ఐ.యస్.ఐ వంటిసంస్థలు సహకారం పుష్కలంగా ఉంటుంది అని నిఘాసంస్థలు తేల్చిచెబుతున్నారు. ఈ నార్కోటిక్స్ వ్యాపారం ద్వారా లభించే ఆదాయం ద్వారా పలు ఉగ్రవాద సంస్థలు అనేకమంది యువకులను ఆకర్షించి, తర్ఫీదుఇస్తూ ఉగ్రవాదులుగా మారుస్తూ, మారణహోమం సృష్టించడానికి, ఆస్తినష్టం వాటిల్లించడానికి వివిధ దేశాలకు పంపుతున్నారు. నిరుద్యోగంతో బాధపడుతున్న యువత, మత్తు పదార్థాలకు బానిసలైనారు ఎక్కువగా ఉగ్రవాదులుగా, నార్కోటిక్ టెర్రరిజం వైపు ప్రయాణం చేస్తున్నారు. దీంతో సరిహద్దు రాష్ట్రాల్లో ఎదో రూపంలో భారతదేశంలో ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయి. దీనికి తోడు పాలకులు, ప్రజా ప్రతినిధులు ప్రసంగాలు కొన్నివర్గాల్లో, మైనారిటీల్లో ఆందోళన కలిగిస్తోంది. 'విద్వేష ప్రసంగాలకు' ఇకనైనా స్వస్తి పలకాలి. భారత రాజ్యాంగం ప్రకారం అందరినీ సమానంగా చూడాలి. ప్రాథమిక హక్కులు కాపాడాలి. సరిహద్దు రాష్ట్రాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. యువతను ఉపాధి రంగాల్లో భారీఎత్తున తరలించాలి. గిరిజన ప్రాంతాల్లో అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనులకు లబ్ధి కల్పించేందుకు కృషి చేయాలి. ముఖ్యంగా మన దేశంలో ఉన్న మైనారిటీ ప్రజల రక్షణకు భరోసా కల్పించాలి. మెజారిటీ ఉంది కదా అని, పాలకులు రాజ్యాంగ నియమాలు పాటించకుండా, గిరిజన, మైనారిటీ ప్రజల రక్షణకు విరోధమైన చట్టాలు చేసి, వారిలో ఆగ్రహావేశాలు రగిలించరాదు. కార్పొరేట్ వ్యక్తులకు, సంస్థలకు గిరిజన ప్రాంతాల్లో అటవీ ప్రాంతంలో ఉన్నఅపారమైన ఖనిజ సంపద దోచిపట్టరాదు. ముఖ్యంగా దేశంలో ఉన్న మావోయిస్టులు ప్రభావం, ఇతర దేశాల ద్వారా మన దేశంలో ప్రవేశించే ఉగ్రవాదులను అరికట్టాలంటే ముఖ్యంగా దేశంలో ఉన్న'యువతను' సరైన మార్గంలో ఉంచాలి. ముఖ్యంగా విద్యతోపాటు సమానమైన అవకాశాలు అందించాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకంపై దృష్టి సారించాలి. ప్రభుత్వాలు సరిహద్దు రాష్ట్రాలపై నిఘా ఉంచాలి. ఫెడరలిజాన్ని గౌరవించాలి. రాష్ట్రాలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండాలి. వివక్షత అణిచివేత ధోరణులు శ్రేయోస్కరం కాదు. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనకు కట్టుబడి ఉండాలి. సంకుచిత ధోరణులు, వివక్షత, అణిచివేతతో కూడిన పాలన ఎల్లప్పుడూ ప్రమాదమేనని పాలకులు గ్రహించాలి. దేశంలో ఉన్న అలజడులు, ఉగ్రవాద కార్యకలాపాలకు ఉన్న ప్రధాన కారణాలు ఇకనైనా పాలకులు గ్రహించి, అందరితో చర్చించి శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయడం ద్వారా నిర్మూలన చేయవచ్చు. నిఘా సంస్థలు మరింత పారదర్శకంగా పని చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి. రాజ్యాంగ ప్రకారం వ్యవహరిస్తే అందరికి సమ న్యాయం జరుగుతుంది అని గ్రహించాలి. మన దేశానికి నష్టం కలిగించే విధంగా ప్రవర్తించే దేశాలపై అంతర్జాతీయ సంస్థల ద్వారా చర్యలు తీసుకునే విధంగా ఒత్తిడి తేవాలి. అవసరమైతే మన సత్తా చాటాలి.

# సింధుజలాలు జీవనాధారాలు

తరిగోపుల నారాయణస్వామి

సింధు జలాలు భారతదేశం, పాకిస్థాన్ దేశాల జీవనాధారాలు. హిమాలయ పర్వతాలలో జన్మించిన సింధు నది పంజాబ్, సింధ్ ప్రాంతాలను గమిస్తూ అరేబియా సముద్రంలో కలుస్తుంది. దీని ఉపనదులు జీలం, చినాబ్, రవి, బియాస్, సట్లెజ్ కలిసి విస్తృతమైన నదీ వ్యవస్థను రూపొందిస్తాయి. ఈ నదుల నీరు వ్యవసాయం, తాగునీటి అవసరాల కోసం భారతదేశం, పాకిస్థాన్ రెండూ అధికంగా వినియోగిస్తున్నాయి. సింధు జలాల ప్రణాళిక రెండు దేశాల అభివృద్ధికి కీలకమైనది. సింధు నది పరివాహక ప్రాంతంలో పాకిస్థాన్ జనాభాలో సుమారు 60శాతం మంది నివసిస్తున్నారు. పాకిస్థాన్ మొత్తం వ్యవసాయంలో సింధు జలాలపై ఆధారపడే ప్రాంతం 80శాతం వరకు ఉంటుంది. భారతదేశంలోనూ ప్రత్యేకంగా పంజాబ్, జమ్ముకాశ్మీర్ రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు సింధు ఉపనదులపై ఆధారపడి వ్యవసాయం కొనసాగిస్తున్నారు. సింధు జలాలు లేకపోతే ఈ ప్రాంతాల్లో సాగు నష్టపోయి, ఆహార ఉత్పత్తి తీవ్రంగా తగ్గిపోతుంది. 1960లో సంతకం చేసిన సింధు జలాల ఒప్పందం ప్రకారం, ప్రధాన నదులైన సింధు, జీలం, చినాబ్ నదులపై పాకిస్థాన్ అధికారం పొందింది, నీటిని పూర్తిగా వినియోగించకపోవడం వలన పెద్దఎత్తున నీరు పాకిస్థాన్‌కు వెళ్లిపోయేది. ప్రస్తుతం భారత్ తన హక్కును వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టింది. పాకిస్థాన్‌కు భారత్ నీరు ఇవ్వడం తగ్గించినచో, అక్కడి వ్యవసాయ వ్యవస్థ తీవ్రఇబ్బందులు ఎదుర్కొనవచ్చు. ఇటీవల భారత దేశం తన వాటాలోని సింధుజలాలను పాకిస్థాన్‌కు




ఇవ్వకూడదని నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ తరచుగా భారత్‌పై శత్రుధోరణి అవలంబించడం, ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం వంటి పరిస్థితుల దృష్ట్యా, భారత్ తన నీటిహక్కులను పూర్తిగా వినియోగించుకోవాలని నిర్ణయించింది. భారతదేశం ఇప్పుడు జలాశయాలు నిర్మించి, డ్యాములు ఏర్పాటు చేసి, సింధు జలాలను నిల్వ చేసుకునే ప్రణాళికలను వేగవంతం చేస్తోంది. ఈ నిర్ణయం వల్ల భారత్‌కు సాగునీటి విస్తరణ, విద్యుత్ ఉత్పత్తి పెరుగుదల వంటి ప్రయోజనాలు లభించనున్నాయి. భారతదేశం తనవాటా సింధు జలాలను సక్రమంగా వినియోగించుకోవడం దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలపరిచే అవకాశం ఉంది. నూతన నీటి నిల్వ ప్రణాళికలు, మైక్రోఇరిగేషన్ పద్ధతులు, వ్యవసాయ ఆధారిత ప్రాజెక్టులు సక్రమంగా అభివృద్ధి చేయాలి. తాగునీటి అవసరాలనుతీర్చడంలో, విద్యుత్ ఉత్పత్తి పెంపులో, దేశీయ ఆహార భద్రతను మెరుగుపరచడంలో సింధుజలాలు కీలకపాత్ర పోషించగలవు. సమర్థవంతమైన నీటి నిర్వహణ ద్వారా భారత్ జలవనరులను భవిష్యత్‌తరాల కోసం సంరక్షించగలదు. సింధు జలాల పరిరక్షణ వినియోగంపై భారతదేశం తీసుకుంటున్న కొత్త దిశ దేశ భద్రత, ఆర్థికాభివృద్ధి, జలవనరుల స్వావలంబనను పెంపొందించేందుకు కీలకమవుతోంది. హిమాలయాల నుంచి ప్రవహించే ఈపవిత్ర నదులు భారతదేశ భవిష్యత్తుకు వెలకట్టలేని వనరులు. శాస్త్రీయ జలవనరుల నిర్వహణ, ప్రజల అవగాహన పెంపు, నదీ కాలుష్య నివారణచర్యలు కలిసివచ్చినప్పుడు మాత్రమేసింధు జలాల విలువను గౌరవిస్తూ భవిష్యత్తులో ముందుకునడవగలం.

# తెలుగు వన్నెచిన్నెలు ఏమాత్రం?

కోట దామోదర్

విద్యావంతులు మాతృభాష సమస్యను ఎదుర్కొంటే మనం కలలు కంటున్న స్వేచ్ఛా భారతాన్ని సాధించలేమని, అన్ని స్థాయిలలో మాతృభాషను ప్రభుత్వ భాషగా, బోధనా భాషగా కొనసాగించాలని మహాత్ముడు ఆనాడే కోరారు. నేటికీ మహాత్ముడి మనోవ్యథను చిత్రించే పరిస్థితులు ఎందుకున్నాయో అందరూ ఆలోచించాల్సిన విషయమే. భారత రాజ్యాంగం (ఆర్టికల్ 350) కొఠారి కమిషన్ ప్రాథమిక స్థాయిలో మాతృభాషా మాధ్యమం అనివార్యమైన అవసరం అని సూచించారు. యునెస్కోతో పాటు అనేక అభివృద్ధి చెందిన దేశాలుకూడా పిల్లలకు మాతృభాషలోనే చదువు చెప్పాలని చెబుతున్నాయి. ఉత్పత్తిలో అత్యున్నత స్థాయి అభివృద్ధి సాధించిన జపాన్ దేశీయ మాధ్యమాన్ని అత్యున్నత స్థాయిలో అమలు చేస్తోంది. భారత ప్రభుత్వం 2010లో ప్రాథమిక స్థాయి నుంచి మాతృభాషా మాధ్యమాన్నే అమలు చేయాలని నిర్దేశించినప్పటికీ ఎలాంటి ఫలితం ఇవ్వకపోవడం బాధాకరమైన విషయం. చాలా దేశాలు మాతృభాషకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుండగా, మన దేశం మాత్రం ఆంగ్ల భాషకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం విచారకరం. యువత ఇంగ్లీషు భాషపై ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండటంతో అన్ని రాష్ట్రాల్లో మాతృభాషా మాధ్యమాన్ని బోధించే ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడింది. తెలుగు వద్దు ఆంగ్లం ముద్దు అంటూ ప్రైవేట్ పాఠశాలలు యువతను, తల్లిదండ్రులను విశేషంగా ఆకర్షిస్తున్నా, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. భాష ఒక దేశం నాగరికత, సంస్కృతి ప్రజాజీవితాన్ని ప్రతిబింబిస్తుంది. భాష అనేది భావాన్ని వ్యక్తీకరించడానికి మాత్రమే కాకుండా, భావాలు ఏకీకృతం చేయడానికి భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడానికి సహాయపడుతుంది. మనం తల్లి నుండి మొట్టమొదటగా నేర్చుకునేది, ఎక్కువగా మాట్లాడేదీ, భావోద్వేగ లేదా హృదయాను గత సంబంధం కలిగినదీ, ప్రతిచర్యలో ఉపయోగించేది మాతృభాష. చదువు సమయంలో పిల్లలకు ఆసక్తి, అవగాహన పెంపొందించేందుకు మాతృభాషలో బోధన తప్పనిసరి. విద్యార్థులకు కొత్త విషయాలపై అవగాహన కల్పించడంలో మాతృభాష ముఖ్య పాత్ర పోషిస్తుంది. మాతృభాషలో బోధించడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం, దేశభక్తి పెంపొందుతాయి. మాతృభాషలో వ్యక్తీకరించడం, బోధించడం నేర్చుకోవడం వంటి ప్రక్రియలు సులభతరం అవుతాయి. వ్యక్తిత్వ వికాసం, కళాపోషణ, సాహిత్య అభినయం, సృజనాత్మకత, తీర్పు మొదలైన వాటిలో మాతృభాష ప్రధాన పాత్ర పోషిస్తుంది. మాతృభాషలో చదువుకోవడం వల్ల ప్రతి పాఠాన్ని కంఠస్థం చేయకుండా సులభంగా అర్థం చేసుకోవచ్చు. అర్థం చేసుకున్న పాఠం మరచిపోలేం. అంతేకాదు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. అవగాహన భావాలు స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి వీలు కల్పిస్తుంది. విద్యార్థి మాతృభాషలో జ్ఞానాన్ని పెంపొందించుకుని స్వీయ రచనకు సిద్ధమవుతాడు. మాతృభాషలో విద్యాబోధన చేస్తే విషయం బాగా అర్థమవుతుంది. ఇంగ్లీషు మీడియంలో చదివే పిల్లలు పాఠంపై పట్టు సాధించలేరు. ఇంగ్లీషు మీడియంలో చదివిన వారిని, మాతృభాషా మాధ్యమంలో చదివిన వారిని పరిశీలించినప్పుడు మాతృభాషా మాధ్యమంలో చదివే వారికి పాఠ్యాంశాలపై



ఎక్కువ అవగాహన ఉంటుంది. ఇప్పటివరకు ఏ పార్టీ అయినా ప్రాథమిక విద్యను ఇంగ్లీష్ మీడియానికి మార్చుతామని, తెలుగుని ఒక సబ్జెక్ట్‌గా మాత్రమే ఉంచుతామని హామీలు ఇవ్వడం జరిగింది. అంతేతప్ప ప్రాథమిక విద్యను తెలుగు మాధ్యమంలో ఉంచి ఇంగ్లీష్‌ని ఒక సబ్జెక్టుగా ఉంచుతామని ఏ ఒక్కపార్టీ కూడా ఇంతవరకు హామీ ఇవ్వలేదు. తెలుగు మాధ్యమంలో చదువుకు, ఉపాధికి ఏ పార్టీ కూడా హామీలు ఇవ్వకపోవడమే కాదు గత మూడేళ్ల నుంచి అనేక ప్రాథమిక పాఠశాలలను ఆంగ్ల మాధ్యమంగా మార్చారు. దీంతో పాటు మిగిలిన పాఠశాలలను కూడా మార్చే అవకాశాలు ఉన్నాయి. ఇకనుంచి అన్ని పాఠశాలలు ఇంగ్లీష్ మీడియం అవుతుందనడంలో సందేహం లేదు. ఇందుకు కారణం విద్యార్థుల తల్లిదండ్రులు ఆంగ్లమాధ్యమంపై మక్కువ చూపుతున్నారనే ఒక్కకారణం చూపుతూ తెలుగు మాధ్యమాన్ని లేకుండా తీసిపారేస్తున్నారు. అందువల్ల విద్యార్థులకు మాతృభాషపై పట్టు కోల్పోవడమే కాక గురువులు చెప్పే పాఠంలోని సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఒకానొక సందర్భంలో మహాత్మాగాంధీ మాతృభాషలో విద్య ఉంటె స్వరాజ్యం ఎప్పుడో వచ్చేది అన్నారట. ఇది మాత్రం అక్షర సత్యమే, భాషా చాతుర్యం ఉంటే ఏదైనా సంక్లిష్టమైన విషయాన్ని సులభంగా పరిష్కరించగలం. మనం చెప్పదలుచుకున్న ప్రతిదాన్ని క్షణాల్లో వివరించగలం. ఊహాత్మక ఆలోచనకు, ఊహాత్మక శక్తికి, సృజనాత్మకతకు మూలం మాతృభాష. మాతృభాషను విస్మరించి పరభాషకు పట్టం ఎందుకు కడుతున్నారంటే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా పరభాషలోనే దొరుకుతున్నాయి. కాబట్టి అందుకు విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను ఆంగ్ల మాధ్యమంలోనే చదివించడానికి ఆసక్తి చూపుతున్నారు. మాతృభాషలో ప్రాథమిక విద్య లేనందున విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యం కోల్పోతున్నారు. ఆంగ్ల మాధ్యమం వల్ల పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అంతేకాకుండా ఆంగ్లమాధ్యమంలో చదివిన విద్యార్థులు తెలుగు మాట్లాడితే అందులో చాలావరకు తప్పులు ఉంటున్నాయి. అంటే వారు కనీసం మాట్లాడటానికి కూడా విముఖత చూపుతున్నారు. రాబోవు రోజుల్లో తెలుగుమాట్లాడేవారి సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశముంది. ఆంగ్ల మాధ్యమానికి ఉన్నంతగా ప్రోత్సాహకాలు తెలుగుమాధ్యమానికి లేకపోవడంతో ప్రజలు కూడా తమ పిల్లలు ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలని మార్పు కోరుకుంటున్నారు. అభివృద్ధి చెందిన దేశాలన్నీ మాతృభాషకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. తెలంగాణలో ప్రభుత్వ బడులు మూసివేయడం బాధాకర మైన విషయం. అందుకు కారణం బడుల్లో పిల్లలు లేకపోవడంవల్లే మూసివేస్తున్నామని ప్రభుత్వం చెబుతుంటే విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం పాఠశాలలో టీచర్స్ కొరతవల్లే పిల్లలను పంపలేకపోతున్నామని చెబుతున్నారు. కానీ ఆయా ప్రభుత్వ బడుల్లో పిల్లలుచేరకపోవడానికి, తల్లిదండ్రులు చేర్పించకపోవడానికి గల అసలు కారణాలను తెలుసుకోవడానికి అధికారికంగా, శాస్త్రీయంగా ఒక్కప్రయత్నం కూడాజరగలేదు. పిల్లలను తెలుగు మీడి యం చదివిస్తే రాబోవు రోజుల్లో సరైన ఉద్యోగ అవకాశాలు ఉండవేమో అనే ఉద్దేశంతో ఇంగ్లీష్ మీడియం చదువుకొరకు ఊరిబడిని వదిలి, కిక్కిరిసిన బస్సుల్లో తమపిల్లలను పేరెంట్స్ దూరప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు బడులకు పంపడానికి అనేక కారణాలున్నాయి. ఆంగ్ల మాధ్యమ బోధన అందులో మొదటిది. కాగా సర్కారుబడుల్లో ముఖ్యంగా ప్రైమరీస్థాయిలో ఒకటి లేదా రెండుగదుల్లో అన్ని తరగతులు ఒకరు లేదా ఇద్దరు టీచర్లునిర్వహించాల్సి రావడం మరొక ప్రధాన కారణం. ప్రభుత్వ పాఠశాలలు మూతపడకుండా, ఉపాధ్యాయులకొరత నివారించేందుకు రాష్ట్రప్రభుత్వం తగుచర్యలు తీసుకోవాలి. తెలుగు భాషను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

# అఖిలపక్ష భేటీకి మోడీ గైర్హాజర్..

## ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే ఫైర్



**జైపూర్, ఏప్రిల్ 28:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. పహల్గాం ఉగ్రదాడిపై చర్చించేందుకు ఏప్రిల్ 23న ఢిల్లీలో ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశానికి మోదీ గైర్హాజరు కావడాన్ని ఆయన తప్పుపట్టారు. అన్ని పార్టీల ముఖ్య నేతలు ఆ సమావేశానికి వచ్చారు. కానీ ప్రధాని మోదీ రాకపోవడం బాధాకరం. బీహార్‌లో రాజకీయ ప్రసంగం ఇవ్వడానికి మాత్రం ఏప్రిల్ 24న మోదీజీ వెళ్లారు. అఖిలపక్ష సమావేశానికి హాజరై ప్రభుత్వ వద్దనున్న ప్రణాళికను ప్రధాని వివరించి ఉండాల్సింది. మా నుంచి ఎలాంటి సహకారం కావాలో అడిగి ఉండాల్సిందని ఖర్గే వ్యాఖ్యానించారు. సోమవారం రాజస్థాన్‌లోని జైపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'సంవిధాన్ బచావో' ర్యాలీలో పాల్గొని పార్టీ చీఫ్ ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీలోని ప్రతీ నేతకు భారతదేశమే ముఖ్యం. అదే పరమావధి. దేశం తర్వాతే పార్టీలు, మతాలు. దేశం కోసం మనమంతా ఏకమై నిలవాలి. దేశం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను అందరూ సమర్థించాలి. కాంగ్రెస్ పార్టీ ఐకమత్యం గురించి చెబుతుంటే బీజేపీ విభజన వాదంతో ముందుకుపోతోంది. భారత దేశంలో రాజ్యాంగమే అత్యున్నతమైంది. దాని ప్రకారమే దేశంలోని ప్రజాస్వామిక వ్యవస్థలు నడుస్తాయి. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ శక్తి వల్లే టీ అమ్ముకునే వ్యక్తి కూడా ప్రధానమంత్రి కాగలిగారు. పహల్గాం ఉగ్రదాడితో మన దేశం ప్రతిష్ఠకు భంగం కలిగింది. అటువంటి కష్టకాలంలో ప్రధాని మోదీ బీహార్‌లో ఎన్నికల ప్రచారం చేయడం దారుణం. మోదీ సర్కారు వల్ల మన దేశానికి ద్రవ్యోల్బణం, నిరుద్యోగమే మిగిలాయి. అలాంటి పాలకులు దేశాన్ని బలహీనపరిచేవారు. మోదీజీ 56 ఇంచుల ఛాతీ చిన్నదై పోయిందని ఖర్గే వ్యాఖ్యానించారు. కేంద్ర సర్కారు దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోంది. వాటిని వాడుకొని కాంగ్రెస్ నేతలను వేధిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎదగడాన్ని బీజేపీ లాంటి పార్టీలు ఓర్వలేవు. మేం అణిచివేతకు కుంగిపోయే రకం కాదు. కాంగ్రెస్ కాస్త బలంగా కనిపించగానే బీజేపీ వాళ్లు కలవరపడతారు. మా పార్టీ నేతలను బలహీనపర్చేందుకు కుట్రలు పన్నుతారు. కొందరు నేతలపై కేసులు పెట్టినంత మాత్రాన యావత్ ప్రజాస్వామిక వ్యవస్థ బలహీన పడదు. బీజేపీ వాళ్లు దేవుడి పేరు స్మరిస్తారో లేదో తెలియదు కానీ, మా నేతల పేర్లను నిత్యం స్మరిస్తారు. మా స్థాయిలో భారత దేశానికి ఏ పార్టీ కూడా సేవలు చేయలేదు. ఆహార భద్రత, ఉపాధి హామీ పథకం, విద్యా వసతులను మేమే దేశ ప్రజలకు ఇచ్చాం. తప్పకుండా మేం కేంద్రంలో అధికారంలోకి వస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఓడరేవు ప్రమాదంలో 40కి పెరిగిన మృతులు



**టెహ్రాన్, ఏప్రిల్ 28:** దక్షిణ ఇరాన్‌లోని షాహీద్ రజాయే ఓడరేవులో సంభవించిన పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 40కి చేరింది. 1000మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో 197మంది ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. దాదాపు వెయ్యి మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ పరామర్శించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆ దేశ అంతర్గత వ్యవహారాలశాఖ మంత్రి తెలిపారు. అణ్వాయుధాలపై ఇరాన్, అమెరికాలు ఒమన్‌లో మూడో విడత చర్చలు జరుపుతున్న సమయంలో బందర్ అబ్బాస్ నగరంలోని షాహీద్ రజాయే ఓడరేవులో ఈనెల 26న భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటన తీవ్రత భయానకంగా ఉంది. పేలుడు సంభవించిన వెంటనే మంటలు ఎగిసి పడ్డాయి. అగ్నికీలలు కంటైనర్‌యార్డ్ మొత్తం వ్యాపించాయి. రజాయే పేలుడు ఘటన వెనుక విద్రోహ చర్యఉందా అని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఇది దాడి కాదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి స్పష్టం చేశారు. బాలిస్టిక్ క్షిపణుల్లో ఘనరూప ఇంధనంగా వాడే అమ్మోనియం పెర్‌క్లోరేట్ రాకెట్ ఫ్యూయల్ గత నెలలో షాహీద్ రజాయే ఓడరేవులో దిగుమతి అయిందని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ఇది చైనా నుంచి రెండు నౌకల్లో వచ్చిందని పేర్కొంది. పోర్టులో నిల్వ ఉన్న కొన్ని అమ్మోనియం పెర్‌క్లోరేట్ కంటైనర్లు పేలడం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు.

# పాక్‌కు మద్దతుపలికిన చైనా

## వక్రబుద్ధిని మరోసారి బైటపెట్టుకున్న డ్రాగన్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** చైనా మరోసారి తన వక్రబద్ధిని ప్రదర్శించింది. ఓ వైపు ప్రపంచ దేశాలు బాధిత దేశమైన భారత్‌కు మద్దతుగా నిలుస్తుంటే, చైనా మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. కుట్రదారు పాకిస్థాన్‌కు వత్తాసు పలుకుతోంది. తమ మిత్రరాజ్యమైన పాకిస్థాన్ సార్వభౌమాధి కారం, భద్రతా ప్రయోజనాలను కాపాడేందుకు తాము అండగా ఉంటామని ప్రకటించి తన వక్రబుద్ధిని మరోసారి బహిరంగపర్చుకుంది. అలాగే పహల్గాం ఉగ్రదాడిపై త్వరగా, న్యాయమైన దర్యాప్తు చేయాలని చైనా వ్యాఖ్యానించింది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యి పాకిస్థాన్ ఉపప్రధాని, విదేశాంగ మంత్రి అయిన ఇషాక్ దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్, పాక్‌ల మధ్య పెరిగిన ఉద్రిక్తతల గురించి వాంగ్ యికు ఇషాక్ దార్ వివరించినట్లు చైనా అధికారిక వార్తా సంస్థ జిన్హువా వెల్లడించింది. చైనాభారత్, పాక్‌ల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను, జరుగుతున్న పరిణామాలను చైనా నిశితంగా గమనిస్తోందని, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం ప్రపంచ దేశాల ఉమ్మడి బాధ్యత అని వాంగ్ పేర్కొన్నారు. కానీ వెంటనే చైనా వక్రబుద్ధిని స్పష్టంగా బయటపెట్టారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని నిరోధించడానికి చేస్తున్న ప్రయత్నాలకు సంపూర్ణంగా చైనా మద్దతు ఉంటుందని పునరుద్ఘాటించారు. పహల్గాం దాడినిమేము తీవ్రంగా ఖండిస్తున్నాం. చైనా అన్ని రకాల ఉగ్రవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ప్రాణాలు కోల్పోయిన వారికి మేము సంతాపం తెలియజేస్తున్నాం. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాం అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గువో జియాకున్‌అన్నారు. భారతదేశంలోని చైనా రాయబారి ఫీహాంగ్ కూడా ఈ ఉగ్రదాడిని ఖండించారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. దాడిని మేము ఖండిస్తున్నాం. బాధితులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం. ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తున్నాం అని జుఫీహాంగ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. కానీ ఇప్పుడు చైనా విదేశాంగ మంత్రి పాక్‌కు మద్దతుగా మాట్లాడడం చూస్తే చైనా వక్రబుద్ధి బయటపడుతోంది.

# భోజ్‌పురి గాయని నేహాసింగ్ రాథోడ్ దేశద్రోహి

**పాట్నా, ఏప్రిల్ 28:** ప్రపంచ నేతలు, ప్రపంచ పౌరులు పహల్గాం దాడిని నిర్ద్వంద్వంగా ఖండిస్తుంటే తన ఇష్టానికి మాట్లాడింది. భద్రతా దళాలు లేక పోతే, అమాయకపు మనుషుల్ని మతాన్ని అడిగి మరీ చంపేస్తారా అనే కనీస ఆలోచన లేకుండా కారుకూతలు కూసింది. ఈ దేశోద్ధారకురాలు ఎవరో కాదు భోజ్‌పురి గాయని నేహాసింగ్ రాథోడ్. 26 మంది పౌరుల ప్రాణాలను బలిగొన్న ఇటీవలి పహల్గామ్ ఉగ్రదాడి, ప్రభుత్వం, నిఘా, భద్రతా వైఫల్యం అని పేర్కొంటూ పోస్టులు పెట్టింది నేహాసింగ్ రాథోడ్. సందట్లో సడేమియాలా దాడి చేస్తూ సోషల్ మీడియాలో 'అభ్యంతరకరమైన' పోస్టు చేసింది. పర్యవసానంగా ఈ భోజ్‌పురి గాయని నేహాసింగ్ రాథోడ్‌పై దేశద్రోహం అభియోగాలు నమోదయ్యాయి.



మొత్తంగా ఆమె చేసిన తప్పుడు చేష్టలకు పది కేసులు ఆమెపై నమోదు చేశారు. పహల్గాం దాడి పేరుతో ప్రధాని మోడీ ఇప్పుడు బీహార్‌లో ఓట్లు అడుగుతారని ఆమె చేసిన విడియోను పాకిస్థాన్ జర్నలిస్టుల బృందం నిర్వహిస్తున్న ఎక్స్ హ్యాండిల్ తిరిగి పోస్టు చేయడం (షేర్)తో లక్నోలోని హజ్రత్‌గంజ్‌లో నేహాపై కేసు నమోదైంది. ఈ గాయని గతంలో కూడా ఇలాంటి సోషల్ మీడియా తప్పుడు మాటలు, తప్పుడు పోస్టులు చేసి వివాదాల్లో చిక్కుకుంది. అయినా ఈమెకు తెలిసిరాక, మళ్లీ దేశం మీద తెగబడింది. దేశస్తులందరిదీ ఒక దారైతే, నా దారి వేరేదంటూ మళ్లీ మొదటికొచ్చి నడి రోడ్డులో నిల్చుంది.

# ఏముఖం పెట్టుకుని రాష్ట్రహోదా అడగాలి?

## అసెంబ్లీలో సిఎం ఓమర్ అబ్దుల్లా భావోద్వేగం



**శ్రీనగర్, ఏప్రిల్ 28:** పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన 26 మంది ప్రజల పేరిట జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను డిమాండ్ చేయబోనని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సోమవారం అన్నారు. ఈ విషయాన్ని భవిష్యత్తులో ఏదో ఒక సమయంలో లేవనెత్తుతాం తప్ప, ఈ సమయంలో కాదని చెప్పారు. అంతేకాకుండా తన అతిథులను కాపాడుకోలేకపోయానని భావోద్వానికి గురయ్యారు. ఈ మేరకు జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో ప్రసంగిస్తూ ఎమోషనల్ అయ్యారు. గతంలో ఇలాంటి చాలా దాడులు మనం చూశాం. బైసరన్‌లో 21ఏళ్లుగా ఇంత స్థాయిలో జరగడం ఇదే తొలిసారి. మృతుల కుటుంబాలకు ఎలా క్షమాపణలు చెప్పాలో తెలియడం లేదు. ఆతిథ్యం ఇచ్చే వ్యక్తిగా, పర్యాటకులను సురక్షితంగా వెనక్కి పంపడం నా కర్తవ్యం. నేను అది చేయలేకపోయాను. క్షమాపణ అడగడానికి నా దగ్గర మాటలు రావడం లేదు. తండ్రిని కోల్పోయిన పిల్లలకు, కొన్ని రోజుల క్రితం పెళ్లి చేసుకున్న భర్తను కోల్పోయిన భార్యకు, నేను ఏం సమాధానం చెప్పాలి. వారు మా తప్పు ఏమిటని అడిగారు. మేము సెలవుల కోసం వచ్చాం అన్నారు. అయితే దీన్ని చేసిన వారు మన కోసమే చేశారని అంటున్నారు. కానీ నేను అడగాలనుకుంటున్నాను, మనం దీన్ని ఆమోదించామా. మేమ దీన్ని చేయమని చెప్పామా. మేము ఈ దాడికి మద్దతు ఇవ్వడం లేదు అని ఒమర్ అబ్దుల్లా భావోద్వేగానికి గురయ్యారు. ఏ ముఖంతో రాష్ట్ర హోదా అడగాలి పహల్గామ్ తర్వాత, నేను ఏ ముఖంతో జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా అడగాలి. నా రాజకీయాలు అంత చౌకగా ఉన్నాయా. మేము గతంలో రాష్ట్ర హోదా గురించి మాట్లాడాము, భవిష్యత్తులో కూడా అలాగే చేస్తాము. కానీ 26 మంది మరణించారని, ఇప్పుడు నాకు రాష్ట్ర హోదా ఇవ్వండి అని కేంద్ర ప్రభుత్వం దగ్గరికి వెళ్లి అడిగితే అది నాకు సిగ్గుచేటు అని ఆయన అన్నారు.

# చార్‌ధామ్ యాత్రకు ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్లు



**డెహ్రాడూన్, ఏప్రిల్ 28:** ఉత్తరాఖండ్‌లో చార్ ధామ్ యాత్ర ఈనెల 30న ప్రారంభం కానుంది. ఈ యాత్ర కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లను చేస్తోంది. ఇప్పటికే చార్ ధామ్ యాత్ర ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా, తాజాగా ఆఫ్‌లైన్‌లో కూడా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉత్తరఖాండ్‌లోని హరిద్వార్ ప్రారంభించినట్లు పర్యటక అధికారి శుశీల్ నౌటియాల్ తెలిపారు. చార్‌ధామ్ యాత్రం కోసం ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్లు సోమవారమే ప్రారంభమైంది. పర్యటకుల కోసం అదనంగా 20 కౌంటర్లు ఏర్పాటు చేశాం. దివ్యాంగులు, వృద్ధులు, విదేశీ పౌరుల కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఉన్నాయి. ప్రస్తుతానికి 1,000 మందికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది. పై అధికారుల సూచనల మేరకు ఈ పరిమితిలో మార్పులు ఉండొచ్చని శుశీల్ నౌటియాల్ తెలిపారు. చార్ ధామ్ యాత్రకు భారత్ నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ప్రతి సంవత్సరం భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. భక్తుల ప్రయాణం, దర్శనం సజావుగా, సురక్షితంగా సాగేలా ఏర్పాట్లను మెరుగుపరిచే పనిలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది. భక్తుల యాత్ర సజావుగా జరిగేందుకు యుద్ధ ప్రతిపాదికన సన్నాహాలు జరుగుతున్నట్లు హరిద్వార్ ఎస్‌పీ ప్రమోద్ దబాల్ తెలిపారు. వివిధ ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలను అమర్చినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ట్రాఫిక్‌ను నిర్మూలించేందుకు డ్రోన్లు కూడా ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతాన్ని జోన్లు, సెక్టార్లుగా విభజించి భారీగా పోలీసు బలగాలను మోహరించనున్నారని తెలిపారు. భక్తులకు సాయం చేసేందుకు అదనంగా ఐదు పర్యటక పోలీసు కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ఈనెల30న గంగోత్రి, యమునోత్రి ధామ్ తలుపులు తెరవడం వల్ల చార్ ధామ్ యాత్ర ప్రారంభమవుతుంది. కేదార్‌నాథ్ తలుపులు మే 2న, బద్రీనాథ్ ఆలయ తలుపులు మే 4న తెరుస్తారు. హరిద్వార్, రిషికేశ్‌లో గంగా హారతి జరుగుతుంది. అయితే విదేశీ భక్తులను రిషికేశ్‌లో గంగా హారతిలో పాల్గొనడానికి ఈసారి అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. మార్చి 20వ తేదీనుంచే చార్‌ధామ్ యాత్ర 2025 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభమైంది.

# అశ్లీలకంటెంట్ నిరోధంపై నోటీసులు జారీచేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియాలో ప్రసారమవుతున్న అశ్లీల కంటెంట్‌ను కట్టడి చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. దీనిపై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం సహా పలు ఓటీటీ, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసిహ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఈ నోటీసులు జారీ చేసింది. ఓటీటీ, సామాజిక మాధ్యమాల్లో లైంగిక అసభ్యకరమైన కంటెంట్‌ను నిషేధించేందుకు నేషనల్ కంటెంట్ కంట్రోల్ అథారిటీని ఏర్పాటు చేసి మార్గదర్శకాలు జారీ చేయాలని ఐదు గురు పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే దీనిపై సరైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. దీనికి సంబంధించి కొన్ని నిబంధనలు ఇప్పటికే ఉన్నాయని, భవిష్యత్తులో మరిన్నింటిని అమలు చేస్తామని కేంద్రం తరఫు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బదులిచ్చారు. మరోవైపు ఈ పిటిషన్‌పై విచారణ సమయంలో ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి లైంగిక అసభ్యకరమైన కంటెంట్ కారణంగా పిల్లలు, యువతతో పాటు పెద్దల ఆలోచనలు కూడా కలుషితం అవుతాయని అభిప్రాయపడింది. ఇది వికృతమైన, అసహజమైన లైంగిక ధోరణులకు దారితీస్తుందని సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో నేరాల రేటు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అంతేకాకుండా విచారణ సమయంలో పరిపాలన, కార్యనిర్వాహక వ్యవహారాల పరిధిలోని ఒక ముఖ్యమైన సమస్యను పిటిషనర్ లేవనెత్తారు. దీనిపై జస్టిస్ బీఆర్ గువాయ్ స్పందిస్తూ ఇప్పటికే పరిపాలన, కార్యనిర్వాహక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నామని తమపై ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీం కోర్టు సోమవారం నిరాకరించింది. ఇప్పటికే ఈ అంశంపై వందలాది పిటిషన్లు ఉన్నాయంటూ తిరస్కరించింది. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కే కుమార్‌తోకూడిన డిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

దాఖలైన పిటిషన్లలో ఐదింటిని మాత్రమే విచారిస్తామని చెప్పిన న్యాయస్థానం, దీనిని వెనక్కి తీసుకోవాలని పిటిషనర్‌కు సూచించింది. కాగా, ఇప్పటివరకు వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దాదాపు 72 పిటిషన్లు దాఖలయ్యాయి. ఇందులో మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్‌ఓవైసీతో పాటు పలువురు ముస్లిం సంఘాల నేతలు, పలు పార్టీల ఎంపీలు పిటిషన్లు దాఖలు చేశారు.


VARDHAMAN BANK

VARDHAMAN (MAHILA) CO-OPERATIVE URBAN BANK LIMITED

8-2-351/N/1, Nishant House, 3rd Floor, Road No.3, Banjara Hills, HYDERABAD – 500034

NOTICE

OPENING OF 12TH BRANCH – ATTAPUR

On 29th April, 2025,

At

# 3-3-76/123/9/12, Siri Malle Home, Hyderguda, Attapur, Rajendra Nagar, Hyderabad - 500 048. Ph 91542 11401

Date : 29-04-2025
Place : Hyderabad

By order of the Board
Chief Executive Officer



తెలంగాణ ప్రభుత్వం
దేవాదాయ ధర్మాదాయశాఖ
శ్రీ గణేష్ దేవాలయము, స్టేషన్ రోడ్, సికింద్రాబాద్, ఫోన్ నం. 040-27701885

ఇ-ప్రొక్యూర్‌మెంటు/సీల్డు టెండరు ప్రకటన

నోటీస్ నం. 01/యస్.జి.టి/2025, తేది: .04.2025

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా సదరు దేవాలయమునకు ఈ దిగువ కనబరిచిన సరఫరా హక్కుల నిమిత్తము ఆసక్తిగల వారి నుండి తక్కువ మొత్తములో కోట్ చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంటు/సీల్డు టెండరు ద్వారా టెండర్లను కోరనైనది. టెండర్ల వివరములు :- 1. కొబ్బరి కాయలు పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు. 2. అరటి పండ్లు సప్లయి. 3. పూల అలంకరణ. 4. కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకొను లైసెన్స్ హక్కు. 5. చెప్పుల స్టాండు నిర్వహణ హక్కు. 6. భక్తులు సమర్పించిన ధోవతులు, చీరలు ప్రోగు చేసుకొను హక్కు. 7. కట్టెలు (వంట చెరుకు) సరఫరా (క్రమ సంఖ్య 1నకు ఒక సంవత్సర కాలపరిమితి మరియు 2 నుండి 7 వరకు గల టెండర్లు రెండు సంవత్సరములకుగాను) ఇ-టెండరులో పాల్గొనుటకు ఆసక్తిగల వారు వివరముల కొరకు www.tender.telangana.gov.in నందు చూడగలరు మరియు ఇతర వివరములకై దేవస్థాన కార్యాలయము నందు సంప్రదించగలరు. పై టెండర్లకు సంబంధించిన షెడ్యూలు ఫారములు దేవస్థాన కార్యాలయమునందు పొందగలరు. తేది: 30.04.2025 నుండి 07.05.2025 సా.5.00గం.ల వరకు పొందవచ్చును. పూర్తి చేసిన టెండరు ఫారములతో పాటు ధరావత్తు డి.డి.లతో ఆఖరిది తేది: 08.05.2025 మ.1.00గం.ల లోపు దేవస్థాన సీల్డు టెండరు బాక్సు నందు వేయవలెను. ఇ-టెండరు మరియు సీల్డు టెండర్లు తేది: 08.05.2025 మ.3.00గం.లకు దేవస్థాన కార్యాలయములో కార్యనిర్వహణాధికారి, పర్యవేక్షణాధికారులు మరియు టెండరుదారుల సమక్షములో తెరువబడును. ఫోన్ నం. 9491000657 మరియు నం. 9494251583.

సం/-. ఉప కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి.

DIPR.NO. 930-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 28.04.2025



డా॥ హరిసింగ్ గౌర్ విశ్వవిద్యాలయం, సాగర్ (మ.ప్ర) భారత్
(ఒక కేంద్రీయ విశ్వవిద్యాలయం)
వెబ్ సైట్: www.dhsgsu.edu.in టెలి: +91-7582-265228

ప్రకటన నం: R/A-NT/2025/03 తేదీ : 26.04.2025

నియామక ప్రకటన

డాక్టర్ హరిసింగ్ గౌర్ విశ్వవిద్యాలయం అర్హులైన భారత జాతీయుల నుండి వివిధ నాన్-టీచింగ్ స్థానాలకు (గ్రూప్ A) డైరెక్ట్ డిప్యుటేషన్/కాంట్రాక్ట్ రిక్రూట్‌మెంట్‌చే నియామకం కొరకు నిర్దేశిత నమూనాలో ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం దాఖలుకు ప్రారంభ తేదీ : 26.04.2025.
- ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం దాఖలుకు చివరి తేదీ : 25.05.2025
- అప్లికేషన్ ఫారం యొక్క హార్డ్ కాపీ దాఖలుకు చివరి తేదీ: 02.06.2025న సా.6.00గం. ముందు.
- ఆన్‌లైన్ లింక్ (https://dhsgsunt.samarth.edu.in/) లైవ్ అందుబాటులో నుండి.

విద్యార్హతలు, అర్హతా ప్రమాణం, ఇతర వివరాలు మరియు అప్‌డేట్స్ కొరకు దయచేసి యూనివర్సిటీ వెబ్‌సైట్ www.dhsgsu.edu.in వీక్షించండి.

సవరణ, ఏవైనా యూనివర్సిటీ వెబ్‌సైట్‌పై మాత్రమే ప్రచురింపబడును.

రిజిస్ట్రార్ (Offg.)

CBC 21273/12/0003/2526



STCI ఫైనాన్స్ లిమిటెడ్

(పూర్వపు) సెక్యూరిటీస్ ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్)

నమోదిత కార్యాలయం: A/B1 802, A-వింగ్, 8వ అంతస్తు, మరథాన్ ఇన్నోవా, మరథాన్ నెక్స్‌జెన్ కాంపౌండ్, Off: గణ్‌పత్‌రావు కదమ్ మార్గ్, లోయర్ పరేల్ (W), ముంబై 400013

బ్రాంచ్ కార్యాలయం: 401 & 412, ప్రకాష్ దీప్ బిల్డింగ్, 7 టాల్‌స్టాయ్ మార్గ్, న్యూఢిల్లీ-110001.

CIN: U51900MH1994PLC078303 వెబ్‌సైట్: https://stcionline.com

అనుబంధం-IV-A

సెక్యూర్డ్ ఆస్తి/లు యొక్క విక్రయానికి బహిరంగ ప్రకటన-కం-ఇ-వేలం ప్రకటన

(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధనలు 8 & 9)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం 2002 ("SARFAESI చట్టం, 2002") సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 ("నిబంధనలు") యొక్క నిబంధన 8(6)కు ఏర్పాటుతో చదువబడే దాని క్రింద సెక్యూర్డ్ ఆస్తి/లు యొక్క విక్రయానికి ఇ-వేలం విక్రయ ప్రకటన. సాధారణ ప్రజానీకానికి మరియు రుణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులుకు ప్రత్యేకంగా ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా క్రింద వివరించబడిన సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన/ఛార్జ్‌డు సెక్యూర్డ్ ఆస్తి/లు, STCI ఫైనాన్స్ లిమిటెడ్, (సెక్యూర్డ్ క్రెడిటార్) యొక్క అధీకృత అధికారిచే 19.04.2024న ఏవైతే భౌతికంగా స్వాధీనం చేసుకోబడినవో వాటిని మొత్తం సొమ్ము **రూ.1,21,59,46,795 (రూపాయలు ఒక వంద మరియు ఇరవై ఒక్క కోట్ల యాభై తొమ్మిది లక్షల నలభై ఆరు వేల ఏడువందల మరియు తొంభై అయిదు మాత్రమే) 09.04.2025 నాటికి తదుపరి వడ్డీ కాంట్రాక్చుయల్ రేట్ల వద్ద పీనల్ ఛార్జీలు మరియు అన్ని ధరలు, ఛార్జీలు మరియు ఖర్చులు లేదా ఏవైనా ఇన్సిడెంటల్ ఛార్జీలు అన్నీ కలుపుకొని చెల్లింపు తేదీ వరకు మరియు/లేదా నాటెమ్స్ షుగర్ ప్రైవేట్ లిమిటెడ్ (రుణగ్రహీత/తనఖాదారుడు) శ్రీ నందకుమార్ రామానుజాలు (వ్యక్తిగత హామీదారుడు) & డా. రామ్‌నాథ్ నందకుమార్ (వ్యక్తిగత హామీదారుడు) నుండి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు రుణ బకాయి రియలైజేషన్ తిరిగి వసూలు నిమిత్తం "ఏది ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా, ఏది ఎలా ఉన్నదీ అలా, అక్కడ ఉన్నది అలా" సహాయంపై ఆధారపడకుండా పద్ధతిపై అమ్మివేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.**

సెక్యూర్డ్ క్రెడిటార్ 2002 SARFAESI చట్టం యొక్క 13(4) సెక్షన్ క్రింద సంక్రమించిన అధికారాలను అందులోని నిబంధనలతో చదువబడే విధంగా వినియోగిస్తూ ఈ దిగువ ఇందుతో పేర్కొనబడిన సెక్యూర్డ్ ఆస్తి(లు) ఇ-వేలం ద్వారా విక్రయానికి నిర్ణయించుకొన్నారు.

**సెక్యూర్డ్ ఆస్తి/లు యొక్క వివరణ:**

ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా, నింద్ర మండలం, కొప్పేడు మరియు సమయపురం గ్రామాలు నం.99 వద్ద ఉన్న సర్వే నం.లు 117/3, 133, 123/5 మరియు 124/1లోని సుమారు 84.43 ఎక. విస్తీర్ణం అన్నీ చరాస్తులతో అదనపు మిషనరీ మరియు భవిష్యత్‌లో కట్టబడే మరియు ప్రస్తుత శాశ్వత అన్ని కట్టడాలతో పారిశ్రామిక మెట్ట భూమి అయిన నాటెమ్స్ షుగర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన స్థిరాస్తి మొత్తం అదంతా. భూమి కొలతలు ఈ విధంగా కలిగి: (ఎ) సర్వే నం.117/3, (ప్రస్తుత సర్వే నం.117/3ఎ)లో ఎక.4-70 సెంట్లు మరియు (బి) చిత్తూరు జిల్లా, నింద్ర మండలం, కొప్పేడు గ్రామం వద్ద ఉన్న సర్వే నం.133లో ఎక.10-13 సెంట్లు, (ఎ) సర్వే నం.123/5లో ఎక.6-83 సెంట్లు, మరియు ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా, నింద్ర మండలం, సమయపురం గ్రామం వద్ద ఉన్న 124/1 సర్వే నం.లో ఎక.62-77 సెంట్లు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, పిచ్చాటూరు పరిధిలో పేర్కొన్న విధంగా ఉన్నాయి. దిగువ వివరణలో మరియు దీని ద్వారా పేర్కొనబడినది మరియు సరిహద్దులచే:

| క్ర. నం. | కొనుగోలుదారు పేరు, సర్వే నం. & రిజిస్టర్ డాక్యుమెంట్ నం. | సరిహద్దుల యొక్క విస్తరణ | ఎకరాల యొక్క మొత్తం విస్తీర్ణం |
|---|---|---|---|
| 1. | సమయపురం గ్రామం యొక్క సర్వే నెం.123/5: ప్రుడెన్షియల్ షుగర్ కార్పొరేషన్ లిమిటెడ్ వాస్తవానికి జి. కృష్ణ దాస్ అనే ఇద్దరు విక్రేతల నుండి కొనుగోలు చేయబడింది-రెజి. డాక్. నం.826/05.10.1944 మరియు సర్వే నెం.123/4 విస్తీర్ణం 3.15 ఎకరాలు మరియు శ్రీమతి శర్మిష్ఠ - రెజి. డాక్. నెం.827/30.09.1994 మరియు అదే సర్వే నెం. 123/4 విస్తీర్ణంలో 3.68 ఎకరాలు మరియు తరువాత పేర్కొన్న ఇద్దరు భూమి కొనుగోలుదారులను కలపడం ద్వారా సర్వే నెం. 123/5గా మొత్తం 6.83 ఎకరాల విస్తీర్ణంగా మారింది. | **ఉత్తరం:** ప్రుడెన్షియల్ షుగర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన సర్వే నం.124 పార్ట్ **దక్షిణం:** సర్వే నం.123 **తూర్పు:** సర్వే నం.లు 128 & 129లో ఉన్న నగరి - నాగలాపురం రోడ్ **పడమర:** సర్వే నం.119 | 6.83 |
| 2. | సమయపురం గ్రామం యొక్క సర్వే నెం. 124/1: ప్రుడెన్షియల్ షుగర్ కార్పొరేషన్ లిమిటెడ్ వాస్తవానికి జి. కృష్ణ దాస్ అనే ఇద్దరు విక్రేతల నుండి కొనుగోలు చేయబడింది - రెజి. డాక్. నెం.826/05.10.1944 మరియు సర్వే నెం.124 విస్తీర్ణం 31.72 ఎకరాలు మరియు శ్రీమతి శర్మిష్ఠ - రెజి. డాక్. నెం.827/30.09.1994 మరియు అదే సర్వే నెం. 124 విస్తీర్ణంలో 31.05 ఎకరాలు మరియు తరువాత పేర్కొన్న ఇద్దరు భూమి కొనుగోలుదారులను కలుపుకొని సర్వే నెం. 124/1 మొత్తం 62.77 ఎకరాల విస్తీర్ణంగా మారింది. | **ఉత్తరం:** సర్వే నం.133 **దక్షిణం:** సర్వే నం.123 **తూర్పు:** సర్వే నం.లు 128 & 129లో ఉన్న నగరి - నాగలాపురం రోడ్ **పడమర:** ఈఫెల్ రూఫింగ్ లిమిటెడ్ | 62.77 |
| 3. | కొప్పేడు గ్రామం యొక్క సర్వే నెం.117/3: ప్రుడెన్షియల్ షుగర్ కార్పొరేషన్ లిమిటెడ్ వాస్తవానికి జి. దశరథ రాజు అనే విక్రేత నుండి కొనుగోలు చేయబడింది-రెజి. డాక్. నెం.412/29.04.1992 మరియు సర్వే నెం.117/3 విస్తీర్ణం 2.35 ఎకరాలు మరియు రెజి. డాక్. నెం.413 /04.05.1992 మరియు సర్వే నెం.117/3 విస్తీర్ణం 2.35 ఎకరాలు మరియు తరువాత పేర్కొన్న ఇద్దరు భూమి కొనుగోలు దారులను కలుపుకొని సర్వే నెం.117/3A మొత్తం 4.70 ఎకరాల విస్తీర్ణంగా మారింది. | **ఉత్తరం:** చెన్నై నుండి తిరుపతి హై రోడ్ **దక్షిణం:** ప్రుడెన్షియల్ సుగర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన సర్వే నం.124 భాగం **తూర్పు:** ప్రుడెన్షియల్ షుగర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన సర్వే నం.133 **పడమర:** ఈఫెల్ రూఫింగ్ లిమిటెడ్ | 4.70 |
| 4. | కొప్పేడు గ్రామం యొక్క సర్వే నెం.133: ప్రుడెన్షియల్ షుగర్ కార్పొరేషన్ లిమిటెడ్ వాస్తవానికి విక్రేతల నుండి కొనుగోలు చేయబడింది: (ఎ) (1) ముప్పాల రాజేంద్ర రాజు (2) ముప్పాల రేవంత్ కుమార్ (3) ముప్పాల భాస్కర్ రాజు మరియు (4) ముప్పాల మధులత - రి. డాక్. నం.291/29.04.1994 మరియు సర్వే నం.133 విస్తీర్ణం 0.33 ఎకరాలు మరియు (బి) (1) ముప్పాల నారపరాజు (2) ముప్పాల నరసింహులు రాజు (3) ముప్పాల లక్ష్మీ నారాయణ మరియు (4) ముప్పాల లక్ష్మీ రాజ్యం రి. డాక్. నెం.292/29.04.1994 మరియు సర్వే నెం.133 విస్తీర్ణం 3.13 ఎకరాలు మరియు (సి) (1) ముప్పాల మునల రాజు (2) ముప్పాల చెంగల్ రాజు మరియు (3) ముప్పాల నవీన్ రి. డాక్. నం. 293/ 29.04.1994 మరియు సర్వే నెం.133 పరిధి 3.00 ఎకరాలు. (డి) (1) ముప్పాల వెంకట రాజు (2) ముప్పాల లీలావతి రి. డాక్. నెం. 911/29.10.1994 మరియు సర్వే నెం.133 పరిధి 3.67 ఎకరాలు మరియు ఆ తరువాత సదరు నలుగురు భూమి కొనుగోలుదారులు కలుపుకొని సర్వే నం.133గా మొత్తం విస్తీర్ణం 10.13 ఎకరాలు. | **ఉత్తరం:** చెన్నై నుండి తిరుపతి హై రోడ్ **దక్షిణం:** ప్రుడెన్షియల్ షుగర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన సర్వే నం.124 భాగం **తూర్పు:** సర్వే నం.లు 128 & 129లో ఉన్న నగరి - నాగలాపురం రోడ్ **పడమర:** ప్రుడెన్షియల్ షుగర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన సర్వే నం.117/3ఎ భాగం | 10.13 |
| | మొత్తం | | 84.43 |

ప్రస్తుతం ఉన్న అన్ని ఫ్యాక్టరీ బిల్డింగ్ యొక్క వివరణ

| క్ర. నం. | ముఖ్య వివరాలు | టైప్ ఆర్.సి.సి. భవనం చ.అడుగులలో | టైప్ ఎ.సి.సి. భవనం చ.అడుగులలో |
|---|---|---|---|
| 1. | కూలింగ్ టవర్, కూలింగ్ టవర్ పంప్ షెడ్, హాట్ అండ్ కోల్డ్ వాటర్ ఛానల్, రిజర్వాయర్ (చల్లని నీరు), కోల్డ్ & హాట్ వాటర్ సర్క్యులేషన్ ట్యాంక్, సర్వీస్ వాటర్ ట్యాంక్, మినీ కూలింగ్ టవర్, కండెన్సేట్ వాటర్ ట్యాంక్, ETP స్క్రీన్ ఛాంబర్, ETP గ్రీజ్ ట్రాప్, సహా ఫ్యాక్టరీ భవనం ETP మిక్సింగ్ ట్యాంక్, ETP ఏరోబిక్ ట్యాంక్, ETP ఏరోబిక్ ట్యాంక్, ETP క్లారిఫైయర్, ETP రౌండ్ ట్యాంక్, మొలాసిస్ ట్యాంకులు 2 సంఖ్యలు. | 6,243 | 2,05,817 |
| 2. | గోడౌన్లు | 97 | 1,10,696 |
| 3. | పాలనా భవనం | 7,788 | 2,734 |
| 4. | క్యాంటీన్లు | 4,585 | |
| 5. | అతిథి గృహం | 5,038 | |
| 6. | స్టాఫ్ క్వార్టర్స్ | 80,213 | |
| 7. | మెషీన్ ఫౌండేషన్ | | |
| | మొత్తం | 1,03,964 | 3,19,247 |

**ఇప్పటికే ఉన్న ప్లాంట్ మరియు మెషినరీ యొక్క వివరణ**

ఇన్‌స్టాల్ చేయబడినా లేకపోయినా భూమికి పొందుపరచబడినా, చేయకపోయినా మరియు ఇప్పుడు వదులుగా పడి ఉన్నా లేదా ఇప్పుడు పడి ఉన్న లేదా ఏ ప్రదేశంలో నిల్వ ఉంచబడినా, రుణగ్రహీత పేరు మీద ఉన్న మరియు/లేదా నిలబడి ఉన్న అన్ని ప్లాంట్ మరియు యంత్రాలు ఇన్‌స్టాల్ చేయాలి లేదా పారిశ్రామిక భూమిని నిర్మించే ఫ్యాక్టరీ వద్ద పొందుపరచబడింది లేదా వదులుగా పడి ఉంది.

**తాకట్టు పెట్టబడిన స్థిర ఆస్తులు**

అందరు రుణగ్రహీతల యొక్క ప్రస్తుత మరియు స్థిరాస్తుల ఫిక్స్‌డ్ ఆస్తులలో భాగమై కలిసి ఉంది. కదిలే ప్లాంట్, మెషీనరీ వాహనాలు, పరికరాలు, తయారీ(లు), మెషీనరీ భాగాలు మరియు స్టోర్స్, టూల్స్ మరియు అదనపు సామగ్రి, ఫర్నీచర్ మరియు ఫిక్చర్ మరియు రుణగ్రహీతకు చెందిన ఉపకరణాలు, స్థాపించబడినా లేకపోయినా, భూమికి పొందుపరచబడినా లేకపోయినా మరియు లూజ్‌గా పడివున్నా లేదా లేకపోయినా, స్టోర్‌ల వద్ద ఏ ప్రదేశంలో ఉన్నా, ఎలా ఉన్నా లేదా రుణగ్రహీత ఫ్యాక్టరీలు, ప్రాంగణాలు, గిడ్డంగులు మరియు గోడౌన్‌లు లేదా అవి ఎక్కడున్నా లేదా ఏ పార్టీచే ఎక్కడ ఉంచబడినా ఆర్డర్‌కు లేదా రుణగ్రహీత యొక్క అధీనంలో లేదా రవాణాలో లేదా సముద్రయానం లేదా డెలివరీ క్రమంలో ఎలా ఉన్నా రుణగ్రహీత స్వాధీనం ఎక్కడ ఎలా ఉన్నా మరియు ప్రత్యామ్నాయంగా లేదా అదనంగా ఏ పేరిట ఉన్నా మరియు టైటిల్ యొక్క అన్ని డాక్యుమెంట్లు లేడింగ్ యొక్క బిల్లులు షిప్పింగ్ డాక్యుమెంట్లు ఇన్సూరెన్స్ పాలసీలు కలుపుకొని మరియు ఇతర పరికరాలు మరియు డాక్యుమెంట్లు కదల్చకలిగే వాటికి చెందినవి కలిపి ప్రయోజనాలు వాటి సంబంధిత అన్ని హక్కులతోసహా కలుపుకొని.

**తాకట్టు పెట్టబడిన వర్తమాన ఆస్తులు**

రుణగ్రహీత యొక్క ప్రస్తుత మరియు భవిష్యత్ స్టాక్‌ల మొత్తం ముడి పదార్థాలు, తయారీ ప్రక్రియలో ఉన్న వస్తువులు, సెమీ-పూర్తి వస్తువులు మరియు అన్ని పూర్తయిన మరియు తయారు చేసిన వస్తువులు మరియు అన్ని దుకాణాలు, భాగాలు మరియు విడిభాగాలతో పాటుగా ఇప్పుడు లేదా ఇకపై కాలానుగుణంగా ఉండవచ్చు ఈ భద్రత కొనసాగే సమయంలో రుణగ్రహీతకు చెందినవి మరియు వాటిని నిల్వ ఉంచవచ్చు లేదా తీసుకురావచ్చు లేదా రుణగ్రహీత యొక్క ఫ్యాక్టరీ, గోడౌన్‌లు మరియు/లేదా వాటి ప్రాంగణంలో లేదా వాటి చుట్టూ ఉన్న లేదా వాటిని ఎక్కడైనా ఉంచవచ్చు, నిల్వ చేయవచ్చు లేదా పడి ఉండవచ్చు లేదా రుణగ్రహీతకి డెలివరీ సమయంలో అటువంటి ముడి పదార్థాలు, ఇన్వెంటరీలు, కథనాలు లేదా వస్తువులు, ఏదైనా స్టోర్స్ స్పేర్స్ మరియు కాంపోనెంట్స్ లేదా ఇతర సారూప్య చర ఆస్తులతో సహా.

**బుక్ రుణాలు**

రుణగ్రహీత యొక్క ప్రస్తుత మరియు భవిష్యత్తు బుక్ రుణాలు, బాకీ ఉన్న సొమ్ములు, స్వీకరించదగినవి, క్లెయిమ్‌లు, డిమాండ్‌లు, బిల్లులు, పెట్టుబడులు, ఒప్పందాలు, ఎంగేజ్‌మెంట్‌లు, సెక్యూరిటీలు, ప్రస్తుతం బకాయి ఉన్న, బకాయి ఉన్న ప్రస్తుత ఆస్తులలో భాగమైన చర ఆస్తులు మరియు చర ఆస్తులపై లేదా హక్కులు చెల్లించదగినది లేదా రుణగ్రహీతకు చెందినది లేదా ఈ సెక్యూరిటీ కొనసాగింపు సమయంలో ఇకపై ఎప్పుడైనా చెల్లించవలసి ఉంటుంది, చెల్లించాల్సిన కారణంగా లేదా రుణగ్రహీతకు చెందినది దాని వ్యాపారంలో మరియు అన్ని ప్రయోజనాలు, ప్రయోజనాలు మరియు చట్టపరమైన ఇన్సిడెన్స్‌తో పాటుగా.

**సెక్యూర్డ్ ఆస్తి/లు వీటికి చెందినవి:**
నాటెమ్స్ షుగర్ ప్రైవేట్ లిమిటెడ్

**ఇ-వేలం యొక్క వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:**

| రిజర్వు ధర (రూ. కోటి) | బయానా (EMD) (రూ. కోటి) | బిడ్డింగ్ పద్ధతిలో ఇంక్రిమెంట్ (రూ. కోటి) | సెక్యూర్డ్ ఆస్తి/లు యొక్క తనిఖీ తేదీ మరియు సమయం | బిడ్ దరఖాస్తు ఫారం యొక్క దాఖలుకు చివరి తేదీ | ఇ-వేలం యొక్క తేదీ & సమయం |
|---|---|---|---|---|---|
| 88.00 | 8.80 | 0.10 | 02/05/2025 (ఉ.11.00 గం. నుండి సా.5.00 గం.కు) | 07/05/2025 | 08/05/2025 (ఉ.11.00 గం. నుండి మ.12.00 గం.కు) |

విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి STCI ఫైనాన్స్ లిమిటెడ్, సెక్యూర్డ్ క్రెడిటర్స్ యొక్క వెబ్‌సైట్ అంటే https://stcionline.com మరియు M/s e-Procurement Technologies Ltd. (సర్వీస్ ప్రొవైడర్) పోర్టల్‌లో అందించిన ఇ-వేలం కోసం లింక్‌ను చూడండి) https://sarfaesi.auctiontiger.net.

**చిక్కులు :**

1. అటాచ్‌మెంట్ నోటీసులు రెఫ. నం. 20210555YL000000EE2D తేదీ 25/06/2021 ప్రకారం మరియు నం. 20210055YL000000DEF0 తేదీ 10/06/2021 ప్రకారం అసిస్టెంట్ కమిషనర్, సెంట్రల్ ట్యాక్స్, తిరుపతి GST డివిజన్ జారీ చేసింది. ఈ నోటీసులను STCI ఫైనాన్స్ లిమిటెడ్ సవాలు చేసింది. 02/06/2021 నాటి ఉత్తర్వు ద్వారా ఆంధ్రప్రదేశ్ గౌరవనీయమైన హెచ్‌సి పేర్కొన్న సదరు నోటీసుల ఆపరేషన్‌పై స్టే ఇచ్చే సంతోషం వ్యక్తం చేసింది.
2. 22/09/2023 తేదీన అటాచ్‌మెంట్ నోటీసు జారీ చేయబడింది u/s 27 A.P. రెవెన్యూ రికవరీ యాక్ట్, 1864 తహసీల్దార్, నింద్ర మండలం, చిత్తూరు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ ద్వారా జారీ చేయబడింది. ఈ నోటీసును STCI ఫైనాన్స్ లిమిటెడ్ సవాలు చేసింది. 09/10/2023 నాటి ఉత్తర్వు ద్వారా ఆంధ్రప్రదేశ్ గౌరవనీయమైన హెచ్‌సి పేర్కొన్న నోటీసు యొక్క ఆపరేషన్‌పై స్టే ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.
3. Ld ఆమోదించిన 16/02/2023 నాటి అటాచ్‌మెంట్ ఆర్డర్. సీనియర్ సివిల్ జడ్జి, పుత్తూరు, చిత్తూరు, ఏపీ ఎగ్జిక్యూషన్ పిటిషన్‌లో కె. సోమశేఖర్ నాయుడు వర్సెస్ నాటెమ్స్ షుగర్ ప్రైవేట్ లిమిటెడ్. O.S నం. 2021 యొక్క 25లో E.P. నం. 2022 యొక్క 15 కలిగి ఉన్న ఎగ్జిక్యూషన్ ప్రొసీడింగ్స్‌లో STCI ఫైనాన్స్ లిమిటెడ్ ఇప్పటికే 22/08/2024 నాటి తన మెమోను మరియు 19/09/2024 నాటి అభ్యంతరాలను పేర్కొన్న అటాచ్‌మెంట్‌పై అభ్యంతరం వ్యక్తం చేసింది.
4. టైటిల్డ్ ఎగ్జిక్యూటివ్ పిటిషన్స్‌లో Ld. జూనియర్ సివిల్ జడ్జి, నగరి, A.P. వారిచే పాస్ట్ అయిన 27/01/2023 తేదీ గల ఎటాచ్‌మెంట్ ఉత్తర్వులు
   a. కుట్టి భాస్కర్ వెర్సస్ ది మేనేజింగ్ డైరెక్టర్, నాటెమ్స్ షుగర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రుడెన్షియల్) హైదరాబాద్ మరియు ఇతరులు EP నం.24 ఆఫ్ 2022 O.S. నం.53 ఆఫ్ 2021లో
   b. K. ధరేష్ వెర్సస్ ది మేనేజింగ్ డైరెక్టర్ నాటెమ్స్ షుగర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రుడెన్షియల్) హైదరాబాద్ మరియు ఇతరులు EP నం.25 ఆఫ్ 2022 O.S. నం.54 ఆఫ్ 2021లో
   c. K. వెంకటేశులు వెర్సస్ ది మేనేజింగ్ డైరెక్టర్ నాటెమ్స్ షుగర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రుడెన్షియల్) హైదరాబాద్ మరియు ఇతరులు EP నం.26 ఆఫ్ 2022 O.S. నం. 55 ఆఫ్ 2021లో
5. ఏ ఇతర చిక్కులు తెలియవు.

తేది : 29.04.2025
ప్రదేశం : చిత్తూరు, ఆంధ్రప్రదేశ్

సం/- అధీకృత అధికారి
STCI ఫైనాన్స్ లిమిటెడ్
ఇ-మెయిల్: eauction@stcionline.com
టెలిఫోన్ - 022 61425100/200

# బిజెపి, బిఆర్ఎస్ ఒకటే.. కెసిఆర్ ప్రసంగంతో రుజువు




## ఆ పార్టీ ఓటమితో సంతోషించిన ప్రజలు

### పదేళ్ల గులాబీల పాలన.. 15 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ఓటమి పాలవడంతో దరిద్రం పోయిందని ప్రజలు ఆనందంగా ఉన్నారని లాభాల్లో ఉన్న తెలంగాణని రూ. ఏడు లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన కేసిఆర్‌ను ప్రజలు క్షమించడం లేదని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. గాంధీభవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ఫ్లాప్ అయిందని అన్నారు. తెలంగాణ ఫస్ట్ అండ్ చివరి విలన్ కేసిఆర్ అని ఆయన అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలన 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై చర్చకు సిద్ధం..! టైం వేదిక మీరే డిసైడ్ చేయండి చర్చకు ఎక్కడికి రమ్మన వస్తా అని బొమ్మ సవాల్ విసిరారు. ఫాంహౌస్ దాటి వచ్చే దమ్ముందా కేసిఆర్‌కు అని ఆయన అన్నారు. రజతోత్సవ సభలో జనాల కంటే విస్కీలు ఎక్కువ ఉన్నాయి సభలో అసలు మహిళలే కనిపించలే అని ఎకసెక్కాలు చేశారు. వరంగల్ సభ లో కెసిఆర్ ప్రసంగంలో పసలేదని ఇక ఆయన శకం ముగిసిందని మహేష్ వర్ణించారు. దేశం కోసం ఆస్తులు, ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని నకిలీ గాంధీలు అనడం కేసిఆర్ దుస్సాహసానికి పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. బిజెపి బిఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ అనడానికి నిదర్శనం అని అన్నారు. నెమలి పిచ్చంతో కొట్టినట్లు బిజెపి పై కేసిఆర్ రెండు నిమిషాలు విమర్శలు చేశారని మహేష్ తెలిపారు. బిసి కుల గణన, ఎస్సీ వర్గీకరణ, వక్ఫ్ చట్టంపై కేసిఆర్ ఎందుకు నోరు మెదపలేదని మహేష్ నిలదీశారు. బిజెపి బిఆర్ఎస్ కుట్రపన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పై విష ప్రచారం చేస్తున్నాయని గౌడ్ ఆవేదన చెందారు. కాంగ్రెస్ బిక్షతో ముఖ్యమంత్రి అయ్యావు కేసిఆర్.. తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం కెసిఆర్‌కు వెన్నతోపెట్టినవిద్య అని అన్నారు. మేము ఏడాదిలో 60 వేలకుపైగా ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. కాంగ్రెస్ రజతోత్సవ సభ పేరిట కేసిఆర్ హంగామా చేసిన ప్రయోజనం లేకుండా పోయింది. వేదికపై అయ్య కేసిఆర్, కొడుకు కెటిఆర్ ఫ్లెక్సీ తో అల్లుడు హరీష్, కూతురు కవిత మనసుకి మరోసారి గాయమైందని ఆయన భాష్యం చెప్పారు. చిలక ఏ తోడు లేక అంటూ కవిత,బ్రబజమానం భజగోవిందంలా హరీష్ రావు పరిస్థితి తెలంగాణ రాజకీయాల్లో కెసిఆర్ శకం ముగిసింది. తెలంగాణ ప్రజలు ఎప్పటికి కేసిఆర్ ను క్షమించారు. కెసిఆర్ ప్రసంగంతో బిజెపి బిఆర్ఎస్ ఒకటేనని మరోసారి రుజువైందని అని అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కేసిఆర్ కుటుంబం దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఆవేదన చెందారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల గణన, ఎస్సీ వర్గీకరణ,బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, సన్న బియ్యం పంపిణీని అమలు చేస్తున్నాం. కేసిఆర్ హయంలో తెలంగాణ అన్ని రంగాల్లో విధ్వంసమైందని అన్నారు. పార్టీ పేరులోంచి ప్రభుత్వ అభివృద్ధిని చూసి కెసిఆర్‌కు గుండెల్లో గుబులు మొదలైందని అన్నారు. కేటీఆర్, హరీష్ రావు, కవిత ఆడుతున్న మూడు ముక్క లాటతో కేసిఆర్ కి మతి భ్రమించిందని విమర్శించారు. కుటుంబ కొట్లాట వేగలేక తెలంగాణ పదాన్ని తొలగించినప్పుడు కన్నతల్లిని జన్మభూమిని మించిన స్వర్గం లేదనే మాట కెసిఆర్‌కు గుర్తుకు రాలేదా తెలంగాణ సెంటిమెంటును వాడుకోవడం కెసిఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య తెలంగాణరాష్ట్ర సమితిని భారతరాష్ట్ర సమితిగా మార్చిన కేసిఆర్ కు జన్మభూమి పేరిట తెలంగాణ పేరు పలకడం విడ్డూరం ఉద్యమ జెండాను దింపితే రాళ్లతో కొట్టి చంపండి అన్న కేసిఆర్‌కు పదేళ్లలో అమరవీరులు త్యాగం, ఉద్యమకారులు ఎందుకు గుర్తుకు రాలేదని అన్నారు. దొంగ పాస్ పోర్టుల బ్రోకర్ గాంధీ కుంటుబం గురించి మాట్లాడడం సిగ్గుచేటు అని అన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తా అన్నావ్ ఏమైందని ప్రశ్నించారు. దళిత సీఎం చేస్తా అన్నావ్ ద్రోహం చేశావ్ అని అన్నారు. ఆదివాసులకు, ముస్లింలు లకు రిజర్వేషన్లు ఇస్తా అన్నావ్.. మోసం చేశావ్ అని అన్నారు. బిఆర్ఎస్ పార్టివి 420 హామీలు ఇచ్చింది కాళేశ్వరం కుళేశ్వరం ప్రాజెక్టు గా మిగిలిపోలేదా అని ఆయన నిందించారు. ఎంతమంది అమరవీరుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చారో చర్చకు సిద్ధమా గజ్జె కట్టిన గద్దర్‌ను అవమానించిన చరిత్ర కేసిఆర్‌ది. మహాకవి రాసిన గేయాన్ని రాష్ట్రగేయంగా ప్రకటించామన్నారు. విద్య వ్యవస్థను కేసిఆర్ సర్వనాశనం చేశారని అన్నారు. యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో విద్యా వ్యవస్థను ప్రక్షాళనం చేశామని చెప్పారు. కిషన్‌రెడ్డితో కేసిఆర్ మిలాఖత్ అయ్యి తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు.




లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

# అధికారం కోల్పోయినా అహంకారం తగ్గని కెసిఆర్

### ధరణి పోర్టల్‌తో రైతులను భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్

### మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, పొన్నం

**వర్గల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారం కోల్పోయినా కెసిఆర్‌కు ఇంకా అహంకారం తగ్గలేదని, కడుపునిండా విషం నింపుకొని మంచి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై చిమ్ముతున్నట్లు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లు నిప్పులు చెరిగారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం శాకారం టిజిఆర్ గార్డెన్‌లో నిర్వహించిన అవగాహన సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన దేవత సోనియాగాంధీకి సాష్టాంగ ప్రణామం చేసిన కెసిఆర్ కాలం తిరగబడి ప్రజలు బుద్ధి చెప్పడంతో కాంగ్రెస్ పార్టీని విలన్‌గా చూపిస్తున్నట్లు ఎద్దేవ చేశారు. రాష్ట్ర ఖజానాను నిండా ముంచిన ఆయన కనీసం గ్రామస్థాయి సర్పంచులకు కూడా బిల్లు ఇవ్వకపోగా, తప్పును తమపై నెట్టుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియంతలా వ్యవహరించిన కెసిఆర్ సొంత ఎమ్మెల్యేలను కూడా కలిసేందుకు ఒప్పుకోని ఆయన సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు.

**దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి సమస్యలపై మాట్లాడు: మంత్రి పొంగులేటి**

**గజ్వేల్, ప్రభాతవార్త:** సోమవారం వర్గల్ మండలం శాకారం గ్రామంలో నిర్వహించిన భూభారతి చట్టం–2025పై అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు తన పార్టీకి సంబంధించి రజతోత్సవ సభ ఏర్పాటు చేసుకొని బాధతో దుఃఖం వస్తుందని అంటున్నారని, రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండడం చూసి దుఃఖం వస్తుందా లేక మహిళలు అందరూ ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేస్తే దుఃఖం వస్తుందా, రైతులకు రుణమాఫీ చేస్తే దుఃఖం వస్తుందా, పేదల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీని ప్రవేశపెడితే దుఃఖం వస్తుందా, రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని చూసి ఓర్వలేక దుఃఖం వస్తుందా అని, లేకపోతే నీ ఉద్యోగం ఊడిందన్న బాధతో దుఃఖం వస్తుందా అని ఎద్దేవా చేశారు.

# భూభారతి చట్టం చరిత్రాత్మకం

### సిసిఎల్ఎ కమిషనర్ నవీన్‌మిట్టల్

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** భూభారతి చట్టం చారిత్రాత్మకమని సిసిఎల్ఏ కమిషనర్, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు. సోమవారం భూ భారతిపై సిసిఎల్ఏ ఉద్యోగులకు అవగాహన సదస్సును కేక్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మిట్టల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం నూతనంగా రూపొందించిన భూ భారతి చట్టం 2025 చరిత్రాత్మకం అని సీసీఎల్ఏ కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు. సిసిఎల్ఏ కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి హోదాలో నవీన్ మిట్టల్.. భూభారతి చట్టం – 2025 రూపకల్పనలో కీలక భూమిక పోషించడంతోపాటు రెవెన్యూ సర్వీసెస్ సేవలను బలోపేతం చేయడంలో ప్రధాన భూమిక పోషించిన సంగతి విదితమే. భూ భారతి చట్టం ప్రారంభోత్సవం తర్వాత సోమవారం తొలిసారి సిసిఎల్ఏ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా నవీన్ మిట్టల్ ను తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వి. లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో సిసిఎల్ఏ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రైతులకు, రెవెన్యూ ఉద్యోగులకు ఆయన శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. అనంతరం సిసిఎల్ఏ కార్యాలయ ఉద్యోగులకు భూభారతి చట్టం 2025పై నిర్వహించిన అవ గాహన సదస్సులో ఆయన పాల్గొని ఉద్యోగులకు చట్టం అనివార్యత, చట్టంలోని ప్రతి క్లాజ్‌తోపాటు రూల్స్‌పై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర కోశాధికారి మల్లేశ్, టీజీఆర్ఎస్ఏ సీసీఎల్ఏ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ చైతన్య, రాంబాబు, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్ పెద్దసంఖ్యలో సీసీఎల్ఏ విభాగం ఉద్యోగులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 పిటిషన్లపై హైకోర్టు సిజె ధర్మాసనానికి టిజిపిఎస్‌సి అప్పీలు

### నేడు విచారించే అవకాశం

### తప్పడు పత్రాలతో పిటిషన్ వేసిన అభ్యర్థులకు రూ.20వేల జరిమానా

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్–1 నియామకాలపై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) సోమవారం హైకోర్టులో అప్పీలు చేసింది. అందులో తెలంగాణలో గ్రూప్–1 నియామ కాలను తాత్కాలికంగా నిలిపి వేయాలంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ టిజిపిఎస్‌సి అప్పీలు దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై సీజే ధర్మాసనం విచారణ చేపట్టనుంది. గ్రూప్–1 నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ కొందరు గ్రూప్–1 అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం సరిగ్గా జరగలేదని పిటిషనర్లు ఆరోపించారు. మెయిన్స్‌లో అక్రమాలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు సింగిల్ బెంచ్ ఈ నెల 17న విచారణ జరిపింది. ఈ సందర్భంగా సందర్భంగా విచారణ పూర్తయి తుది తీర్పు వెలువడే వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసిన అభ్యర్థులకు నియామక పత్రాలు జారీ చేయొద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను కొనసాగించవచ్చు పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో సోమవారం సింగిల్ బెంచ్‌లో విచారణ సందర్భంగా .. సీజే ధర్మాసనంలో అప్పీలు దాఖలు చేసినట్లు టిజిపిఎస్‌సి తరఫు న్యాయవాది సింగిల్ బెంచ్‌కు చెప్పారు. దాంతో సోమవారం జరగాల్సిన విచారణను జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు బుధ వారానికి వాయిదా వేశారు. సీజే ధర్మాసనంలో టిజిపిఎస్‌సి అప్పీలు నేడు(మంగళవారం) విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్టు తెలిసింది. తప్పుడు ప్రమాణ పత్రాలిచ్చిన పిటిషనర్లకు జరిమానా విధించిన హైకోర్టు.. తప్పుడు ప్రమాణ పత్రాలతో పిటిషన్ దాఖలు చేసారంటూ కొందరు గ్రూప్–1 అభ్యర్థులకు హైకోర్ట్ రూ.20 వేల జరిమానా విధించింది. అలాగే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. టిజిపిఎస్‌సి నిర్వ హించిన గ్రూప్–1 మెయిన్స్ పేపర్ వాల్యు యేషన్‌లో అవకతవకలు చోటు చేసుకున్నాయని పేర్కొంటూ 19 మంది గ్రూప్–1 అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మెమోకు.. వెబ్‌సైట్ మార్కులకు భారీ తేడాలు ఉన్నాయని, మరోసారి సమాధాన పత్రాలు రీవాల్యుయేషన్ చేయించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వాదనలు వినిపించిన టిజిపిఎస్‌సి తరఫు న్యాయవాది.. పిటిషనర్లు తప్పుడు ప్రమాణ పత్రాలు దాఖలు చేశారని తెలిపారు.

# మిర్చి రైతులకు సంకెళ్లు వేసిన డిక్టేటర్ కెసిఆర్

### తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా?: మాజీ ఎంపి విహెచ్

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** కసిఆర్ డిక్టేటర్ పాలనలో మిర్చి రైతులకు సంకెళ్లు వేశారని మాజీ ఎంపి హనుమంతరావు ఆరోపించారు. గాంధీభవన్‌లో సోమవారం మాజీ ఎంపి విహెచ్ విలేఖరులతో మాట్లాడుతూ కెసిఆర్ తప్పుల మీద తప్పులు చేశారని విమర్శించారు.పార్టీలో ఉన్న వాళ్ళు వెళ్ళిపోతారేమో అని భయపడి సభ పెట్టారు. బిఆర్ఎస్ డ్యామేజ్ కంట్రోల్ మీటింగ్ వలే ఈ సమావేశం ఉందని ఆయన ఎద్దేవా చేశారు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయ్యిందా? అని కెసిఆర్‌ను హనుమంతరావు నిలదీశారు. కొడుకు అల్లుడు కేసీఆర్‌ను ముంచిండ్రు అందుకే ప్రజలు కెసిఆర్‌ని తిరస్కరించారు. తెలంగాణ కాంగ్రెస్ ఇవ్వకపోతే,నాంపల్లి దర్గా దగ్గర మీ కుటుంబం అడుక్కునేది అంటూ ఆక్రోశం వెళ్లగక్కారు.ప్రగతి భవన్, సెక్రటేరియట్ కట్టాలనే మంచి ఆలోచన కెసిఆర్‌కు వచ్చింది.కానీ ప్రజ లను ఎవ్వరిని అక్కడికి రానివ్వలేదు.అప్ కి బార్ కిసాన్ సర్కార్ అని మహారాష్ట్ర వెళ్లి కోట్ల రూపాయలు ఖర్చు చేశారు.

# రాంపూర్ క్రాసింగ్ వద్ద ప్రమాదం

### బైక్‌కు ఢీకొన్న వ్యాన్ .. ఇద్దరు యువకుల మృతి

**నంగునూర్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. రాజగోపాల్‌పేట ఎస్ఐ మమ్మద్ అసీఫ్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన తాడం సారయ్య(36),బండోజు గణేష్(32) అనే యువకులు సిద్దిపేటలో తాపీ పని ముగించుకొని గ్లామర్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన బిఆర్ఎస్ బహిరంగ సభకు వెళ్లి వస్తున్న నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన తుఫాన్ వాహనం ముందు నుంచి ఢీ కొట్టినట్లు తెలిపారు. సంఘటనలో తాడం సారయ్య అక్కడికక్కడే మరణించగా బండోజు గణేష్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదం జరగగానే తుఫాన్ డ్రైవర్ పారిపోయినట్లు తెలిపారు. సంఘటన జరగడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అంగన్‌వాడీల ఆహారంలో మార్పులు



### బాలికలకు చిక్కీలు, చిరుధాన్యాల పట్టీలు

### మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** అంగన్‌వాడీలకు సరఫరా అవుతున్న ఆహారంలో మార్పులు, చేర్పులు చేయనున్నట్లు మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ మంత్రి సీతక్క వెల్లడిం చారు. ఇందులో భాగంగా 14 నుంచి 18 ఏండ్లలోపు కిషోర బాలికలకు పల్లిపట్టీ, చిరు ధాన్యాల పట్టీలు అందిస్తామని చెప్పారు. హైదరా బాద్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లా డుతూ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఆసిఫాబాద్, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 23 మొబైల్ అంగన్‌వాడీ వాహనాలను ఏర్పాటు చేసి అర్హులందరికీ గుడ్లు, ఆహారం చేస్తున్నాం. మహిళల్లో ఎనిమియాను ఐదు శాతం తగ్గించేల చర్యలు చేపట్టాలి. చివరిలో నిర్ణయాలు తీసుకోవడం వల్ల బడ్జెట్ కేటాయింపులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేక పోతున్నా మన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నిర్దిష్ట గడువులోగా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని చెప్పారు. ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తిచేసే దిశలో పనిచేయాలని సూచించారు. ఆరేండ్లలోపు చిన్నారులంతా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండేలా చూడాలన్నారు. అంగన్‌వాడీల్లో మరో 30 శాతం హాజరు శాతం పెంచేలా చూడాలని, తద్వారా చిన్నారుల్లో పోషకార లోపాన్ని నివారించవచ్చని చెప్పారు. అలాగే పిల్లల దత్తత ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకు ముందుకు వచ్చే వారిని ప్రోత్స హించాలన్నారు. చిన్నారుల సంరక్షణ బాధ్యతలు చూసుకునే వారికి ఆర్థిక చేయూతనిచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని వివరించారు. ఇక దివ్యాంగులకు అత్యవసరమైన సర్జరీలను ప్రభుత్వమే చేయిస్తుందన్నారు. యువ వికాస పథకంలో దివ్యాంగులకు 5 శాతం కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే కుటుంబంలో దివ్యాంగులుంటే వారి పేరు మీదే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే అంశం పరిశీలనలో ఉందని చెప్పారు.

# నకిలీ సర్టిఫికేట్లలో ఆర్మీ ఉద్యోగాలు..

### ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా గోల్‌మాల్

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ సర్టిఫికేట్లతో ఆర్మీలో ఉద్యోగాలు పొందిన కొందరి ఉదంతం వెలుగు చూసింది. ఈ ఘటన జిల్లాలోని ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్‌లో జరిగిందని పోలీసుల విచారణలో తేలింది. దీనిపై ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురి పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సూరజ్ సహాని, గజేంద్ర, దిగ్విజయ్ లు స్థాని కంగా మిలటరీలో ఉద్యోగాల కోసం వచ్చే యువతకు శిక్షణ ఇచ్చి భర్తీలు జరిగే సమయంలో నిరుద్యోగులను తీసుకువెళ్లేవారు. ఈ క్రమంలో కొందరికి ఉద్యోగాలు లభించేవి, ఇంకొందరికి లభించక పోయేవి. అయితే ఈ ముగ్గురు కొన్నిసార్లు త మ వద్ద శిక్షణ పొందే వారికి ఇతర రాష్ట్రాలకు చెందిన వారుగా చెబుతూ నకిలీ నివాస ధృవపత్రాలు, స్థానికతకు సంబంధించిన ఇతర పత్రాలను తయారు చేసే వారు. ఈ క్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్ నుంచి యుపికి చెందిన కొందరు యువకులకు సూరజ్ సహాని, గజేంద్ర, దిగ్విజయ్‌లు నకిలీ సర్టిఫికేట్లను తయారుచేసి ఇచ్చారు. అయితే ఈ సర్టిఫికేట్లు నకిలీవని తేలడంతో వారిపై యుపిలో కేసు నమోదుకాగా ఇదే అంశమై అక్కడి పోలీసులు ఆదిలాబాద్‌కు వచ్చి ఆరా తీయగా నకిలీ సర్టిఫికేట్ల స్కాం రట్టయ్యింది. నకిలీ సర్టిఫికేట్లు తయారు చేసిన ముగ్గురు వ్యక్తులను యుపి పోలీసులు అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ జిల్లా పోలీసులు తెలిపారు.

# కేంద్రం నిధులు ఇవ్వలేదని కెసిఆర్ తప్పుడు ప్రచారం

### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** కేంద్రం తెలంగాణాకు నిధులు ఇవ్వలేదని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మండిపడ్డారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎల్కతుర్తిలో బిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి రూ. 11 లక్షల కోట్ల నిధులు కేటాయించిందన్నారు. కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి ఈ వివరాలను లెక్కలతో సహా ప్రచురించి, రాష్ట్ర ప్రభుత్వానికి, వివిధ అధికారులకు పంపించడం జరిగిందన్నారు. తెలంగాణకు 11 పైసలు కూడా ఇవ్వలేదని కెసిఆర్ చేసిన వ్యాఖ్యలకు ఆయన కట్టుబడి ఉంటారా? అంటూ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కేటాయించిన నిధులను సాక్ష్యంతో రుజువు చేస్తే, కెసిఆర్ తన పొరపాటును అంగీకరించి, ముక్కు నేలకు రాసి క్షమాపణ చెబుతారా? కెసిఆర్ దీని గురించి సమాధానం చెప్పాలన్నారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభతో తెలంగాణ ప్రజలకు, సమాజానికి ఒరిగిందేమీ లేదన్నారు. పదేళ్ల పాలనలో తెలంగాణను మొత్తం లూఠీ చేసి, అప్పుల ఊబిలోకి నెట్టి గొప్పలు చెప్పుకునే ప్రయత్నం చేస్తే తెలంగాణ సమాజం నమ్మదని అన్నారు.

# ప్రజలకు హీరో కాంగ్రెస్.. ప్రతిపక్షంలో ఉన్న మీరే విలన్

### ఆరేడు రాష్ట్రాలకు డబ్బు సంచులు మోసింది బిఆర్ఎస్‌యే

### రేవంత్ భయానికి అసెంబ్లీకి పోని కెసిఆర్

### పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ప్రజలకు కాంగ్రెస్ ఎప్పుడూ హీరోనే ప్రతి పక్షం ఉన్నా మీరు విలనే కాంగ్రెస్ కూడా ప్రజల పట్ల హీరోగానే ఉంటుందని మీరు ప్రతిపక్షంలో ఉండటంతో విలన్‌గా కాంగ్రెస్ కనపడుతోందని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ కెసిఆర్ పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు సీనియర్ రాజకీయ నాయకుడు గతాన్ని మరిచిపోయి డుబ్లికేట్ గాంధీలు అంటూ నోరుజారడం ఆయనకు తగదు అని అన్నారు. రాహుల్ గాంధీ తెలంగాణ ఇవ్వండి అంటేనే సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని ఆయన వివరించారు. సోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణకే నువ్వు సీఎం అయ్యావు అప్పుడు ఒరిజినల్ గాంధీ కుటుంబం అయ్యింది, ఇప్పుడేమో డూప్లికేట్ గాంధీ కుటుంబం అయ్యిందా..? అని కెసిఆర్‌ను జగ్గారెడ్డి ప్రశ్నించారు. కెసిఆర్ తెలంగాణ నినాదం నుంచి వెనక్కి తగ్గాలని అనుకున్న సమయంలో ఆయన్ని లేపింది కాంగ్రెస్ నేతలే అని చరిత్రను గుర్తుచేశారు. రాష్ట్ర విభజన జరుగాలని మా పార్టీ నేతలే వెనుక నిలబడి కెసిఆర్‌ను నడిపించారని ఆయన తెలిపారు. సోనియాగాంధీ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదని నువ్వేచెప్పావు మీ మాటపై మీకు విలువ ఉందా అప్పుడు రాహుల్ సోనియా దేవుళ్ళు అయ్యారు.ఇప్పుడు కడుపు నిండి ఉన్నది కాబట్టి దయ్యాలు అయ్యారా అని ఆయన నిలదీశారు. కేసిఆర్ అంటే నాకు గౌరవం, రాహుల్ గాంధీ గురించి మాట్లాడిన మాటలకు ఆయన భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ఉనికిని కాపాడుకొనే సభ పెట్టారని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. రాహుల్ కుటుంబం ఎథిక్స్ తో రాజకీయాలు చేస్తున్నదని బ్రిటిషు కాలంలో కూడా లక్షల కోట్లు ఆస్తులు ధారాదత్తం చేసిన కుటుంబం రాహుల్ కుటుంబమన్నారు. బిఆర్ఎస్ ఢిల్లీకి సంచులు మోయలేదా ఢిల్లీకి, ఒడిశా, పంజాబ్, కర్ణాటక తమిళనాడు డబ్బులు పంపింది నువ్వు కాదా? ఆరేడు రాష్ట్రాలకు సంచులు మోసింది కెసిఆర్ కాదా అని ఆయన ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డి భ యా నికి కెసిఆర్ అసెంబ్లీకి పోలేదు కెసిఆర్‌ను కడిగే స్తారని రేవంత్ పేరెత్తే ధైర్యం కూడా చేయ లేదు. రేవంత్, కెసిఆర్ సభలో ఎదురు పడండి తెలంగాణ ఎట్లా ఉంటదో చూద్దాం కెసిఆర్ సభకు రావాలన్నారు.

# డ్రగ్స్‌ఫ్రీ తెలంగాణకు కృషి చేయాలి

### ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన అదేశాల మేరకు ఎస్‌టిఎఫ్ టీమ్‌ల దాడులతో ఎక్సైజ్‌శాఖకు మంచి గుర్తింపు వచ్చిందని, డ్రగ్స్, గంజాయిని కట్టడి చేయడంలో కీలక భూమిక పోషించామని, ఎక్సైజ్ ఎన్‌ఫో ర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి అన్నారు. సోమవారం 79 మందికి ఎక్సైజ్ భవన్‌లోని సమావేశ మందిరంలో క్యాష్ రివార్డులు పంపిణి చేశారు. ఎస్‌టిఎఫ్ ,టీమ్‌లతో పాటు హైదారాబాద్, ఖమ్మం ప్రాంతాలకు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను అన్ని స్థాయిలో క్యాష్ అవార్డులను అందించారు.క్యాష్ రివార్డులు తీసుకోవడంతో గురుతర బాధ్యత పెరిగిందని భావించి మరింతగా దాడులు పెంచి ఎక్సైజ్ శాఖకు మంచి పేరు తీసుకరావాలని సూచించారు.

# చౌదరిగూడలో అక్రమంగా ఉంటున్న బంగ్లావాసి అరెస్టు

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తి ఒకరు అక్రమంగా నివాసం ఉంటుండగా పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్టు చేశారు. సంఘటన వివరాలు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ పరిధిలోని వెంకటసాయి ప్రేంనగర్ (మక్త) లో ప్లాట్ నెంబరు 36లో బంగ్లాదేశ్‌కు చెందిన రషెల్ షేక్ అలియాస్ ఎండి రషెల్ (31) నివాసం ఉంటున్నాడని సమాచారం అందుకున్న పోలీసులు ఎస్సై శివకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు రషెల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆ వ్యక్తి నుండి రెండు సెల్‌ఫోన్‌లు, రెండు సిమ్ కార్డులు, మన దేశానికి చెందిన ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఓటర్ ఐటీకార్డు, బంగ్లాదేశ్ ఓటర్ ఐడీకార్డు, కొవిడ్ 19 టీకా వేసుకున్న ధృవపత్రం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రషెల్ స్థానికంగా ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. నిందితుడిపై ఫారినర్స్ యాక్టు కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.



బంగ్లాదేశీయుడు రషెల్

# దోస్త్ నోటిఫికేషన్ మరిచిన ఉన్నత విద్యామండలి

### యేటా ఇంటర్ ఫలితాలు వచ్చిన ఒకటి, రెండు రోజుల్లోనే ఇచ్చేవారు

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) నోటిఫికేషన్‌ను ఇవ్వడం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మరచి పోయినట్టుంది. ప్రతి ఏడాది ఇంటర్మీడియట్ వార్షిక ఫలితాలు వెలువడిన ఒకటి, రెండు రోజుల్లోనే దోస్త్ నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యా మండలి జారీ చేస్తూ వస్తోంది. గత నాలుగైదేళ్లుగా ఇంటర్ ఫలితాలు వచ్చిన రెండు, మూడు రోజుల్లోనే జారీ చేసేవారు. అయితే ఈ ఏడాది ఇంటర్ పలితాలు ఇచ్చి వారం గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు దోస్త్ నోటిఫికేషన్‌పై ఉన్నత విద్యా మండలి ఉలుకు లేదు పలుకు లేదు. అయితే మే మొదటి వారంలో దోస్త్ నోటిఫికేషన్‌ను జారీ చేసే యోచనలో ఉన్నత విద్యా మండలి ఉన్నట్టు తెలుస్తోంది. దోస్త్ నోటిఫికేషన్ ఆలస్యం కావడానికి దోస్త్ కన్వీనర్ ఎంపిక ఒక కారణంగా తెలుస్తోంది. తెలంగాణ ఉన్నత విద్యా మండలిలో చైర్మన్‌తోపాటు ఇద్దరు వైస్‌ఛైర్మన్లు ఉంటారు. వారిలో వైస్‌ఛైర్మన్–1గా ఉన్నవారు దోస్త్‌కి కన్వీనర్‌గా ఉంటారు. ఉన్నత విద్యా మండలి నిబంధనల్లో ఇదే అంశం చేర్చబడింది. అయితే ఈ సారి దోస్త్ కన్వీనర్‌గా ఇద్దరు వైస్‌ఛైర్మన్లలో ఎవరిని కన్వీనర్‌గా నియమించాలనే అంశంపై తర్జనభర్జన పడుతున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత చైర్మన్‌గా ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డిని, వైస్ ఛైర్మన్–1గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పటికే వైస్ ఛైర్మన్–2గా కొనసాగుతున్న ఎస్‌కె మహమూద్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించ కుండా కొత్తగా కేవలం ఛైర్మన్, వైస్ ఛైర్మన్–1లను మాత్రమే నియమించింది. గత ఏడాది కూడా ఇటువంటి ఇబ్బందికర పరిస్థితే ఎదురుకావడంతో.. అప్పుడు ఛైర్మన్‌గా ఉన్న ప్రొఫెసర్ లింబాద్రిని దోస్త్ కన్వీనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి వచ్చింది. ఇప్పుడు కూడా అలాగే ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డిని దోస్త్ కన్వీనర్‌గా కొనసాగించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే మే మొదటి వారంలో దోస్త్ నోటిఫికేషన్‌ను జారీ చేసే యోచనలో ఉన్నట్టు తెలిసింది. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 1054 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు.. మరో 139 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వాటిలో సుమారు 4.26 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. కొన్ని ప్రైవేటు కాలేజీలకు కొత్త కోర్సులకు అనుమతి ఇస్తే మరికొన్ని సీట్లు పెరిగే అవకాశం ఉంటుంది.

# పత్తి మార్కెట్‌యార్డులో యువకుని హత్య

### వివాహేతర బంధమే హత్యకు కారణమా?

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పట్టపగలు స్థానిక పత్తి మార్కెట్ యార్డులో యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. పెద్దపల్లి మండలం అప్పన్నపేటకు చెందిన పోలం కుమార్‌యాదవ్‌ను ధర్మారం మండలం దొంగ తుర్తికి చెందిన వేల్పుల సంతోష్ కత్తితో మెడపై పొడిచి హత్య చేశాడు. దీంతో పోలం కుమార్‌యాదవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పెద్దపల్లి డిసిపి పుల్ల కరుణాకర్, సిఐ కొండపాక ప్రవీణ్‌కుమార్, సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ జె.లక్ష్మణ్‌రావు, బుద్దె మల్లేష్ ఘటన స్థలానికి చేరుకొని నిందితునితోపాటు మరో మహిళను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తర లించారు. మృతుని భార్య పోలం అనిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. తన భర్త పోలం కుమార్ ట్రాక్టర్ నడుపుతూ కుటుం బాన్ని పోషిస్తున్నాడని, వరుసకు చిన్నమ్మ బిడ్డ అయిన వేల్పుల శైలజతో సన్నిహితంగా ఉంటున్నాడని గమనించిన శైలజ భర్త వేల్పుల సంతోష్ కొన్ని రోజుల నుంచి తన భర్తతో గొడవ పడుతున్నాడని తెలిపారు. శైలజ కూడా తన తప్పును కప్పి ఉంచుకునేందుకు నా భర్త ఆమె వెంట పడుతున్నాడని చెప్పడంతో సంతోష్ మరింత కోపం పెంచుకున్నాడని, ఈ క్రమంలో సోమవారం నా భర్తకు ఫోన్ వచ్చాక బయటకు వెళ్లివస్తానని చెప్పి వెళ్లాడని తెలిపారు. ఈ క్రమంలో కుమార్ పెద్దపల్లి పత్తి మార్కెట్ యార్డ్‌కు చేరుకోగానే సంతోష్, శైలజ పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న కత్తితో మెడపై బలంగా పొడవటంతో బలమైన గాయామై అక్కడికక్కడే మృతి చెందాడని ఫిర్యాదులో మేరకు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి డిసిపి పుల్ల కరుణాకర్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

# ఆపరేషన్ కగార్‌పై పార్టీ నిర్ణయం తర్వాతే ప్రభుత్వ విధానం

### జానారెడ్డితో సమావేశం,

### దిగ్విజయ్‌కు సిఎం రేవంత్ ఫోన్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. ఏప్రిల్ 28:** ఆపరేషన్ కగార్‌పై ప్రభుత్వం ఎలా వ్యవహరించాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. మావోయిస్టులు,కేంద్రం మధ్య శాంతి చర్చలు జరిపేలా సిఎం రేవంత్‌రెడ్డి వేగంగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో గతంలో మావోలతో చర్చలు జరిగిన సమయంలో ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా ఉన్న దిగ్విజయ్‌సింగ్‌తో సిఎం రేవంత్ ఫోన్‌లో మాట్లాడారు. తను అనుభవం ఉపయోగించి చర్చలు జరిపేలా చొరవ చూపాలని ఆయన కోరారు. ఇదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు కే.కేశవరావుతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. సోమవారం జానారెడ్డి నివాసంలో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. శాంతిచర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, ప్రొ.హరగోపాల్‌తో పాటు పలువురు ప్రతినిధులు ఆదివారం సిఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని నివాసంలో కలిసి మావోయిస్టులతో చర్చలు జరిపే అంశంపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని కమిటీ ప్రతినిధులు కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జానారెడ్డి, కేకేతో సిఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. నక్సలిజాన్ని ఒక సామాజిక కోణంలో చూస్తున్నందున ఈ అంశంలో ఏ విధంగా ముందుకు వెళ్లొచ్చనే అంశంపై వారితో సిఎం సమాలోచనలు జరిపారు. గతంలో నక్సలైట్లతో చర్చలు జరిపిన అనుభవం జానారెడ్డి ఉన్న విషయం తెలిసిందే. జానారెడ్డితో భేటీ తర్వాత మీడియా ప్రతినిధులతో రేవంత్ రెడ్డి చిట్ చాట్‌గా మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌పై కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాతే రాష్ట్ర ప్రభుత్వ విధానం ప్రకటించనున్నట్లుగా ఆయన వెల్లడించారు. మావోయిస్టుల అంశంపై జానారెడ్డితో చర్చ చేశామని, గతంలో జానారెడ్డి, కేకేనే చర్చలు చూశారని తెలిపారు. పార్టీ హైకమాండ్‌కు కూడా సమాచారం ఇస్తామని, పార్టీ ఏం నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉండాల్సి ఉంటుందన్నారు. అధిష్ఠానంకు పీస్ కమిటీ రిక్వెస్ట్‌ను పంపిస్తానని తెలిపారు.



రాజ్‌భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డితో ప్రమాణం చేయిస్తున్న దృశ్యం

## లోకాయుక్త, ఉపలోకాయుక్త ప్రమాణ స్వీకారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. ఏప్రిల్ 28:** తెలంగాణ లోకాయుక్త, ఉపలోకాయుక్తలుగా నియమితులైన జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, ఉపలోకాయుక్త జస్టిస్ బీఎస్ జగ్జీవన్‌కుమార్‌లు సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లోకాయుక్తగా నియమితులైన జస్టిస్ ఎ. రాజశేఖర్ రెడ్డి, ఉప లోకాయుక్త జస్టిస్ బీఎస్ జగ్జీవన్ కుమార్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని పదవీ బాధ్యతలు స్వీకరించిన లోకాయుక్త, ఉప లోకాయుక్తలను అభినందించారు.సిఎంతో పాటు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, మహమ్మద్ అలీ షబ్బీర్, వేం నరేందర్ రెడ్డి. సిఎస్ శాంతికుమారి, డిజిపి జితేందర్, అసెంబ్లీ కార్యదర్శి డా.వి.నరసింహాచార్యులుతోపాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డి కేంద్రం వైస్‌చైర్‌పర్సన్‌గా శాంతికుమారి నియామకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. ఏప్రిల్ 28:** సీఎస్ శాంతికుమారి పదవీ విరమణ అనంతరం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం(ఎంసీఆర్‌హెచ్ఆర్డీ) వైస్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. వీసీ హోదాలో ఎంసీహెచ్ఆర్‌డీ డైరెక్టర్ జనరల్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. శాంతికుమారి ఈనెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. కొత్త సీఎస్‌గా ఇప్పటికే రామకృష్ణారావును ప్రభుత్వం నియమించింది. శాంతికుమారికి పీసీబీ ఛైర్‌పర్సన్ లేదా సమాచార ప్రధాన కమిషనర్‌గా నియమిస్తారని ప్రచారం జరిగినప్పటికీ ప్రభుత్వం ఎంసీహెచ్ఆర్‌డీ బాధ్యతలను అప్పగించింది. ఇదే సమయంలో మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డి డైరెక్టర్‌గా ఆమెకు అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. ఆమె నియామకం మే ఒకటో తేది నుంచి అమలులోకి వస్తుందని పేర్కొంది. కాగా కొత్త ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారావు మే 1 న ఉదయం రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

### కాళేశ్వరం ఇఎన్‌సి అక్రమాస్తుల కేసు..

## హరిరామ్ కస్టడీకి ఎసిబి పిటిషన్ దాఖలు

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** అక్రమాస్తుల కేసులో ఎసిబికి పట్టుబడ్డ కాళేశ్వరం ఈఎన్‌సి హరీరాంను మరింతగా విచారించేందుకు ఎసిబి అధికారులు సోమవారం నాడు ఎసిబి కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. హరీరాంను వారం రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం నాడు ఎసిబి కోర్టు విచారణ చేయనుంది. మరోవైపు హరీరాం అక్రమాస్తుల చిట్టా భారీగా వుండడంతో ఈ విషయంలో పూర్తి వివరాలను సేకరించే పనిలో ఎసిబి అధికారులు నిమగ్నమయ్యారు. హరీరాం అక్రమాస్తుల విలువ 200 కోట్ల రూపాయల వరకు వుంటుందని ఎసిబి అ ధికారులు వెల్లడించినా బహిరంగ మార్కెట్లో దీని విలువ రెండురెట్లకు పైగానే వుంటుందని అంచనా. హరీరాం అక్రమాస్తుల్లో ఎక్కువగా బినామీవే వుండడంతో వీరందరిని విచారించాలని ఎసిబి అధికారులు నిర్ణయించారు. హరీరాం ఇంట్లో పట్టుబడ్డ పత్రాల ఆధారంగా ఆయన బినామీ ఆస్తులపై అంచనా వేసేందుకు ఎ సిబి అధికారులు రెడీ అవుతున్నారు. ఈ విషయంలో ఆయన భార్య అనితతో పాటు బంధువులు, సన్నిహితులను కూడా విచారించాలని ఎసిబి అధికారులు నిర్ణయించారు. హరీరాం భార్య రాష్ట్ర ప్రభుత్వ సంస్థ వాలంతరిలో డైరెక్టర్‌గా వుండడం తెలిసిందే. ఆమె డిప్యూటీ ఈఎన్‌సిగా వున్నారు. హరీరాం కేసులో ఇప్ప టికే అనితను ఎసిబి అధికారులు విచారించినట్లుగా తెలిసింది. మరోదఫాగా ఆమెను విచారించాలని ఎసిబి అధికారులు భావిస్తున్నారు.

## పాక్ యూట్యూబ్ ఛానళ్లపై భారత్ నిషేధం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌కు సంబంధించిన పలు యూట్యూబ్ ఛానళ్లపై నిషేధం విధించింది. పాక్ న్యూస్, ఎంటర్‌టైన్‌మెంట్‌కు చెందిన మొత్తం 16 ఛానళ్లను బ్యాన్ చేసింది. అంతేకాకుండా పహల్గాం ఉగ్రదాడి కవరేజీపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ బీబీసీ ఇండియాకు కేంద్ర ప్రభుత్వం ఓ లేఖ రాసింది. కేంద్రం నిషేధం విధించిన వాటిల్లో డాన్ న్యూస్, జియో న్యూస్, సామా టీవీ, ఏఆర్‌వై, పలుస్పోర్ట్స్ ఛానల్స్ కూడా ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడి ఘటన తర్వాత రెచ్చగొట్టే ప్రచారం చేయటమే కాకుండా




మతపరంగా సున్నితమైన కంటెంట్‌తోపాటు తప్పుదారి పట్టించే సమాచారాన్ని ప్రసారం చేయటం, భారత్, సైనిక బలగాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. ఈ ఆరోపణల కారణంగానే ఈ యూట్యూబ్ ఛానళ్లను నిషేధం విధించినట్లు తెలిపింది. నిషేధించిన యూట్యూబ్ ఛానళ్లను క్లిక్ చేస్తే, ప్రస్తుతం ఇందులోని కంటెంట్ అందుబాటులో లేదనే సందేశం కనిపిస్తోంది. జాతీయ భద్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని వస్తోంది. ఇక ఉగ్రదాడి ఘటనకు సంబంధించిన రిపోర్టింగ్‌పై బీబీసీకి కేంద్రం పలు సూచనలు చేసింది. ఉగ్రవాదులను మిలిటెంట్లుగా పేర్కొనటాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. బీబీసీ ప్రసారాలను పర్యవేక్షించనున్నట్లు కేంద్రం లేఖలో పేర్కొంది.ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఇరు దేశా మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఇప్పటికే భారత్ పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పలుచర్యలు చేపట్టింది. పాక్ పౌరులను భారత్ నుంచి వెళ్లగొట్టింది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడం, పాక్ వీసాలను రద్దు చేయడం వంటివి చేసింది. అంతేకాకుండా పాక్ దౌత్యవేత్తలకు సమన్లు పంపింది. అటారీవాఘా సరిహద్దు గేట్లను మూసివేసింది. ఇప్పటికే పాకిస్థాన్ ప్రభుత్వానికి చెందిన అధికారిక ఎక్స్ ఖాతాను ఇండియాలో నిలిపివేసింది. తాజాగా పాకిస్థాన్‌కు చెందిన 16యూట్యూబ్ ఛానళ్లపై కొరఢా ఝుళిపించింది.

## ఎన్‌డిఎస్‌ఎ నివేదికతో ప్రజల ముందు దోషులుగా బాధ్యులు

### కాళేశ్వరం కూలడంతో రాష్ట్రం అధోగతి పాలు

### ప్రజల ప్రాణాలతో చెలగాటం సహించం

### భద్రకాళి చెరువు పూడికతీత పనులు వేగవంతం చేయాలి

### జలసౌధలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ నివేదిక అనుసరించి బాధ్యులను ప్రజల ముందు దోషులుగా నిలిపేందుకు సాంకేతిక,న్యాయపరమైన అనేక అంశాలను అధ్యయనం చేయాల్సి ఉందని అనంతరం క్యాబినెట్‌లో నిర్ణయించి దానికి అనుగుణంగా చర్యలు చేపడుదామని నీటిపారుదలశాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులకు దిశను నిర్ధేశించారు. సోమవారం జలసౌధలో నీటిపారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జ,ప్రశాంత్‌పాటిల్ ఇఎన్‌సి అనిల్‌కుమార్, మహ్మద్ మాజీద్ హుస్సేన్, టి.శ్రీనివాస్‌లు ఇతర అధికారులతో సమావేశమైనారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన రూపకల్పన నిర్వహణలోపాలు కారణంగా కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగమైన మేడిగడ్డ కుంగుబాటు, సుందిళ్ళ అన్నారం బుంగలు పడటం జరిగిందని చట్టపరమైన చర్యలు, శాఖపరమైన చర్యలు బాధ్యులపై తీసుకొనేందుకు మార్గన్వేషణచేయాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ నిర్ధేశించినట్లు తెలిసింది. భారీ ప్రాజెక్టు థర్ పార్టీ ఆడిట్ చేయించాలన్న నిబంధనల ఉండగా అది అమలు కాలేదని తెలిపారు. నీటిపారుదలశాఖ, నిర్మాణ సంస్థ మినహా మరో పక్షంతో మదింపు చేయించి ఉంటే లోపాలను ఆదిలోనే పసిగట్టే వీలుండేదని మంత్రి సమావేశంలో అభిప్రాయపడినట్లు తెలిసింది. నిర్మాణ సామగ్రి పరిమాణంనాణ్యత ప్రమాణాల మేరకు వినియోగిస్తున్నారా అవి మన్నుతాయా లేదా అనే పరీక్షలను థర్డ్ పార్టీతో చేయించలేదు అని అన్నారు.

క్వాలిటీ కంట్రోల్ విభాగం చీఫ్ ఇంజినీర్ నేతృత్వంలో ఈ ప్రక్రియ జరగాల్సి ఉండగా అమలు చేయలేదు. నిర్మాణ ప్రారంభం నుంచి చివరి వరకు ఎలైన్మెంట్, కోరింగ్ చేసే సమయంలో లోపాలున్నాయా అని క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లు పర్యవేక్షి ంచాల్సి ఉంది. కానీ, పని ప్రాంతాలను పరిశీలించకుండానే ధ్రువీకరిం చినట్లు అవగతమవుతోంది అనిఆవేదన చెందారు. భద్రకాళి చెరువు పూడిక పనులు నాణ్యతతో వేగంగా చేయాలని సూచించారు. అనే ప్రాజెక్టుల క్లియరెన్స్‌కోసం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే, వరంగల్ జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా ఈ సమావేశంలో హాజరయ్యారు.

## శక్తి మనదే.. స్ఫూర్తి మనదే

### స్త్రీశక్తి అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి సీతక్క




**హైదరాబాద్, ఏప్రిల్ 28,ప్రభాతవార్త :** మహిళలు తలచుకుంటే అసాధ్యాలు కూడా సులభ సాధ్యాలవుతాయని,అందుకు ఎందరో మహిళల విజయాలు మన కళ్ల ముందే నిదర్శనంగా నిలుస్తున్నాయని పంచాయతీరాజ్, మహిళా- శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ చాంబర్ ఆఫ్ ఇవెంట్స్ ఇండస్ట్రీ (టీసిఇఐ) ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్టాత్మక 7 ఎడిషన్ స్త్రీ శక్తి అవార్డ్స్ 2025 కార్యక్రమం సోమవారం మాధాపూర్‌లోని హెచ్ఐసిసిలో ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన సీతక్క స్త్రీ శక్తి అవార్డుల ప్రదానోత్సవాన్ని ప్రారంభించారు. స్త్రీ శక్తి అవార్డులకు ఎంపికైన వారికి అవార్డులను బహుకరిస్తూ మంత్రి సత్కారం చేశారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ..మహిళ సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, ముఖ్యంగా ఇందిరా మహిళ శక్తి పథకం వంటి వాటి గురించి ప్రస్తావించారు. మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు అన్ని విధాలుగా తాము ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ప్రత్యేక ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ సాంస్క ృతిక సృజనాత్మక పరిశ్రమలు శాఖ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ స్త్రీ శక్తి అవార్డ్స్ వంటి కార్యక్రమాలు మహిళలు ఉన్నత స్థానాల్లోకి రావడానికి దోహదపడతాయన్నారు. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ, గ్రామీణ మహిళా ఉద్దీపనకర్తల గుర్తింపులో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందన్నారు.టీసీఇఐతో కలిసి సెర్ప్ ఆధ్వర్యంలో మహిళలకు ఈవెంట్ మేనేజర్లుగా శిక్షణ ఇవ్వడం ప్రారంభించినట్లు చెప్పారు.టీసీఇఐ అధ్యక్షుడు బలరాం బాబు, స్త్రీ శక్తి అవార్డ్స్ కన్వీనర్ మిల్లెట్ బ్యాంక్ వ్యవస్థాపకురాలు విశాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మావాళ్లు సరిగా లేకపోవడంతో

## అధికారంలోకి రాలేకపోయాం

### బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్ (గోషామహాల్), ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** వరంగల్ ఎల్కతుర్తి వేదికగా బిఆర్ఎస్ రజతోత్సవ సభలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ బిజెపిపై తీవ్రస్థాయిలో చేసిన వ్యాఖ్యలపై గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎల్కతుర్తిసభలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు అన్ని అబద్దాలే మాట్లాడరని ఆరోపించారు.పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రం వందల కోట్లు ఇచ్చిందన్నారు. దురదృష్టం కొద్ది మా పార్టీ నాయకులు కరెక్టర్‌గా లేరని, లేకపోతే తామే అధికారంలోకి వచ్చేవాళ్లమన్నారు. కెసిఆర్ అంటే జూటా మాటలకు బ్రాండ్ అని విషయాన్ని ఇప్పటికే పలుమార్లు నిరూపించుకున్నారని సెటైర్లు వేశారు. నాడు బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేంద్రం నుంచి వచ్చిన నిధుల లెక్కలు చెప్పాలని,వాటిపై శ్వేతపత్రం విడుదల చేయాలని కెసిఆర్‌ను ప్రశ్నించగా ఏమి రాలేదంటూ అబద్దాలు చెప్పారని ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ పార్టీకి బుద్ది రాలేదని,ఇప్పటికైనా వాస్తవాలు మాట్లాడితే బాగుంటుంది రాజాసింగ్ కెసిఆర్‌కు చురుకలించారు.

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు

## హైకోర్టులో ఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. ఏప్రిల్ 28:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు సోమవారం కొట్టివేసింది. ఇరువైపులా వాదనలు విన్న తర్వాత ఈ కేసును జస్టిస్ కె.లక్ష్మణ్ కొట్టివేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని పార్టీ అధిష్టానా నికి రూ.2500 కోట్లు పంపించారంటూ కేటీఆర్ ఆరోపించారు.ఆయనకు ముడుపులు చెల్లిస్తేనే భవనాలకు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు.అలా వసూల్ చేసిన నగదు రూ 2500 కోట్లు ఢిల్లీలోని పార్టీ పెద్దలకు పంపారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నేత బత్తిన శ్రీనివాసరావు పోలీసులను ఆశ్రయించారు.హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి. బంజారాహిల్స్ పోలీసులకు పంపారు. దీంతో కేటీఆర్‌పై 504, 505(2) సెక్షన్ల కేసులు నమోదు చేశారు. దీనిపై కేటీఆర్ కోర్టును ఆశ్రయించారు. విచారించిన కోర్టు ఈ కేసును కొట్టి వేసింది.

## జిమ్‌లో గాయపడ్డ కెటిఆర్ కొన్ని రోజులు బెడ్‌రెస్ట్

### కెటిఆర్ త్వరగా కోలుకోవాలి: ఎపి డిప్యూటీసిఎం పవన్‌కళ్యాణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. ఏప్రిల్ 28:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రమాదానికి గురయ్యారు. జిమ్‌లో వర్కవుట్ చేస్తుండగా ఆయన గాయపడ్డారు. వెన్నుపూసలో గాయం కావడంతో కొద్దిరోజులు బెడ్ రెస్ట్ తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ విషయాన్ని కేటీఆర్ తన ట్విట్టర్ (ఎక్స్) ఖాతా ద్వారా వెల్లడించారు. తాను గాయపడినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించానని,కోలుకోవడానికి కొన్ని రోజులు బెడ్ రెస్ట్ తీసుకోవాలని డాక్టర్లు సూచించినట్లు కెటిఆర్ తెలిపారు, త్వరలో కోలుకొని ప్రజల ముందుకు వస్తానని పేర్కొన్నారు. ఎల్కతుర్తి సభలో కెటిఆర్ పాల్గొన్న విషయం తెలిసిందే. కెటిఆర్ గాయం నుంచి త్వరగా కోలుకోవాలని బిఆర్ఎస్ శ్రేణులు కామెంట్లు పెడుతున్నాయి. కాగా, ఈ విషయంపై ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. సోదరుడు తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ జిమ్‌లో వ్యాయామం చేస్తూ గాయపడ్డారని తెలిసింది. వైద్యుల సూచనలకు అనుగుణంగా తగిన విశ్రాంతి తీసుకోవాలి. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను' అని ఎక్స్‌లో పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు.

## 'నీటి బిందువు జలసింధువు'తో భూగర్భజలాల పెంపుదల

### సింగరేణి ప్రాంతాల్లో 102 చెరువుల నిర్మాణం, పూడిక తొలగింపు

### ఇప్పటికే 20 శాతం నిర్మాణాలు పూర్తి

### సమీక్ష సమావేశంలో సంస్థ ఛైర్మన్, ఎండి ఎన్.బలరామ్

**హైదరాబాద్, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** సింగరేణి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జల వనరుల సంరక్షణ ఉద్యమం చేపడుతున్నామని 2025 సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాల పెంపుదల లక్ష ్యంగా చెరువుల నిర్మాణం చేయడం ఉన్నవాటికి పూడిక తొలగించడం వంటివి చేస్తామని సంస్థ ఛైర్మన్ ఎన్.బలరామ్ తెలిపారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అన్ని ఏరియాల జీఎంలకు, సంబంధిత పర్యావరణ, సివిల్ శాఖల అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. 'నీటి బిందువు జల సింధువు' పేరుతో ఏప్రిల్ నెల ఆరంభం నుంచి ప్రారంభించిన మినీ చెరువుల నిర్మాణం వేగవంతంగా సాగుతోందని ఆయన తెలిపారు. మే 15 నాటికి సింగరేణి వ్యాప్తంగా మొత్తం 12 ఏరియాల్లో 62 కొత్త చెరువుల నిర్మాణం, 40 చెరువుల్లో పూడిక తొలగింపు పూర్తి చేయాలని ఛైర్మన్‌ఎన్.బలరామ్ అధికారులకు లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటికి 20 శాతం పైగా పనులు పూర్తయ్యాయని, పనులను మరింత వేగిర పరుస్తూ మే 15 నాటికి మొత్తం చెరువుల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రానున్న వర్షాకాలంలో సింగరేణి నిర్మించిన ఈ చెరువుల్లో నీరు పుష్కలంగా చేరే విధంగా తగు సివిల్ పనులు పూర్తి చేయాలన్నారు. రక్షణ చర్యలుగా మినీ చెరువుల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. సింగరేణి సమీప గ్రామాలలో భూగర్భ జలాలు పెంచడం కోసం తీసుకున్న ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రతి ఏరియా జీఎం ప్రత్యేక శ్రద్ధతో విజయవంతం చేయాలని సూచించారు. తొలుత 50 మినీ చెరువులు నిర్మించాలని భావించినప్పటికీ, గనుల ప్రాంతంలో ఉన్న అవకాశాలను పరిగణలోకి తీసుకొని వీటి సంఖ్యను 62 కు పెంచామని ఆయన తెలిపారు అలాగే ఇప్పటికే ఉన్న 40 చెరువుల్లో నీటి సామర్థ్యం పెంపుదలకు పూడిక తొలగింపు పనులు చేపట్టాలని నిర్ణయించారు.

సింగరేణిలో గతంలో కేవలం అక్కడక్కడ చెరువుల పూడికను కొన్ని ఏరియాలో తీసిన దాఖలాలు ఉన్నాయి కానీ ఈ విధంగా పెద్ద ఎత్తున చెరువుల నిర్మాణాన్ని చేపట్టడం గతంలో ఎన్నడూ జరగలేదని వివరించారు. ఈ చెరువుల నిర్మాణం సింగరేణి సమీప ప్రాంత భూగర్భ జలాల పెంపుదలకు ఎంతగానో ఉపయోగపడే అవకాశం ఉంది అని అభిప్రాయ పడ్డారు. ఏరియాల వారీగా సింగరేణి కొత్తగా చేపడుతున్న 62 మినీ చెరువులను ఆయన వివరించారు. మందమర్రి లో 10 మినీ చెరువులు, కొత్తగూడెంలో 8, భూపాలపల్లిలో, రామగుండం1లో, రామగుండం 2లో, ఇల్లందు, మణుగూరు, శ్రీరాంపూర్, బెల్లంపల్లి, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాలలో ఏరియాకు 5 మినీ చెరువుల చొప్పున, రామగుండం3 ఏరియాలో 4 మినీ చెరువులను సింగరేణి యాజమాన్యం నిర్మిస్తోందని గణాంకాలను ఆయన వివరించారు. సోమవారం నాటి సమీక్ష సమావేశంలో కొత్తగూడెం కార్పోరేట్ నుండి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కొప్పుల వెంకటేశ్వర్లు, హైదరాబాద్ కార్యాలయం నుంచి సింగరేణి అటవీ శాఖ అడ్వైజర్ మోహన్ పరిగెన్, పర్యావరణ శాఖ జనరల్ మేనేజర్ సైదులు, ఏరియాల నుండి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, పర్యావరణ, అటవీ శాఖ అధికారులు



## శభాష్.. కండక్టర్!

### నగల బ్యాగ్ ప్రయాణికుడికి అందించిన వైనం

### అభినందించిన ఆర్టీసి ఎండి సజ్జనార్

**హైదరాబాద్,ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** రోడ్డు మీద వంద రూపాయల నోటు కనబడితేనే.. అటుఇటు చూసి ఎవరూ చూడకుండా జేబులో వేసుకునే జనం ఉన్న ఈ రోజుల్లో.. ఏకంగా రూ.13 లక్షల విలువజేసే బంగారు నగలు ఉన్న బ్యాగు దొరికితే.. దాని యజమానికి అందజేసి.. మానవత్వం చాటుకున్నాడు ఓ ఆర్టీసీ బస్సు కండక్టర్. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. అచ్చంపేట హైదరాబాద్ రూట్ టీజీఎస్ఆర్టీసీ బస్సులో కండక్టర్ గా విధులు నిర్వహిస్తున్నాడు వెంకటేశ్వర్లు. అచ్చంపేటలో బయలుదేరిన బస్సు హైదరాబాద్ ఎంజీబీఎస్ కు చేరుకుంది.. అయితే బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు తన బ్యాగు మరిచిపోయినట్లు గుర్తించాడు కండక్టర్. దాన్ని తెరిచి చూడగా అందులో బంగారు, వెండి నగలతో పాటు కొంత నగదు కూడా ఉన్నట్లు గుర్తించి వెంటనే ఈ విషయాన్ని అచ్చంపేట డీఎం మురళీ దుర్గాప్రసాద్‌కు ఫోన్‌లో సమాచారం అందించగా.. బ్యాగ్‌ను ఎంజీబీఎస్‌లోని స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో అప్పగించాలని డీఎం సూచించారు. ఇంతలోనే అనిల్‌కుమార్ అనే ప్రయాణికుడు డీఎంకి ఫోన్ చేసి బస్సులో బ్యాగును మరచిపోయినట్లు చెప్పారు. కందుకూర్‌లో బస్సు ఎక్కి సీబీఎస్ లో దిగి కాచిగూడకు వెళ్లిపోయానని పేర్కొన్నారు. ఎంజీబీఎస్ లోని స్టేషన్ మేనేజర్ కార్యాలయానికి వెళ్లాలని అతనికి సూచించారు డీఎం. టీజీఎస్ఆర్టీసీ అధికారులు వివరాలను పరిశీలించి.. బ్యాగును ప్రయాణికుడు అనిల్ కుమార్ కు అందజేశారు. అందులో 14 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణా లతోపాటు రూ. 14,800 నగదు, తన కుమారుడి బర్త్ సర్టిఫికెట్, తన విద్యా ర్హత ధ్రువ పత్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విధినిర్వహణలో నిజాయితీగా వ్యవహరించి రూ.13 లక్షల విలువైన ఆభరణాలతో కూడిన బ్యాగును ప్రయాణికుడికి అందజేసిన కండక్టర్ వెంకటేశ్వర్లును సంస్థ ఎండి విసి సజ్జనార్ అభినందించారు.

## తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఆపరేషన్ కగార్ కొనసాగుతుంది .. సిఆర్‌పిఎఫ్

### నక్సల్స్‌తో శాంతిచర్చలపై సర్కారు ఆదేశాలు పాటిస్తాం: రాష్ట్ర పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌లో ఎలాంటి మార్పులేదని సిఆర్‌పిఎఫ్ ఉన్నతాధికారులు తెలిపారు. ఆపరేషన్ కగార్ యధాతథంగా కొనసాగుతుందని సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ సిఆర్‌పిఎఫ్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్ నక్సలైట్ల ఏరివేత కోసం నిశ్చయించినదని, ఇందులో ఎలాంటి మార్పులేదని వారు తెలిపారు. అయితే ఆపరేషన్ కగార్ ప్రభావం ఎక్కువ గా ఛత్తీస్‌ఘడ్‌లోనే వుందని, తెలంగాణలో దీని ప్రభావం పెద్దగా లేదని వారు పేర్కొన్నారు. కేంద్రం చెప్పినట్లుగా నక్సలైట్ల విముక్త భారత్‌లో భాగంగా ఇది కొనసాగుతోందని, 2025 మార్చి చివరినాటికి దేశంలో నక్సలిజం లేకుండా చేయాలన్నది తమ లక్ష్యమని వారు వెల్లడించారు. ఛత్తీస్‌ఘడ్‌తో పాటు సరిహద్దుగా వున్న తెలంగాణలో కూడా నక్సలైట్ల కదలికలు వుండడంతో రెండు వైపుల నుంచి నిఘా వుంచడంతో పాటు గాలింపు వుంటుందని సిఆర్‌పిఎఫ్ ఉన్నతాధికారు లు తెలిపారు. ఇరు రాష్ట్రాల మధ్య వున్న కర్రెగుట్టల్లో నక్సలైట్ల కోసం గాలింపు కొనసాగుతోందని వారు వెల్లడించారు. నక్సలైట్లు ఆయుధాలు వీడి లొంగిపోవాలని సిఆర్‌పిఎఫ్ ఉన్నతాధికారులు పిలుపునిచ్చారు. లొంగిపోయిన నక్సలైట్లకు పునరావాసం కల్పిస్తున్నామని వారు తెలిపారు. నక్సలైట్లు పట్టుదలకు పోకుం డా వాస్తవాలు గ్రహించి బాహ్య ప్రపంచంతో కలవాలని వారు కోరారు. గడచిన మూడు నెలల వ్యవధిలో ఛత్తీస్‌ఘడ్, తెలంగాణలో 600 మంది వరకు లొంగి పోగా ఇందులో ఒక్క తెలంగాణలోనే 250 మంది వున్నారని సిఆర్‌పిఎఫ్ ఉన్నతాధికారులు తెలిపారు. మరోవైపు నక్సలైట్లతో శాంతి చర్చల విషయమై రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి వుంటామని రాష్ట్ర పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తామని వారు పేర్కొన్నారు. నక్సలైట్లలో శాంతి చర్చలు జరపాలని పౌరహక్కుల సంఘాల నేతలు కేంద్రాన్ని కోరుతుండగా కేంద్రం నుంచి స్పందన లేకపోవడం తెలిసిందే. అయి తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నక్సలైట్ల సమస్యను శాంతి భద్రతల కోణంలో కాకుండా సామాజిక కోణంలో చూస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి చెప్పడం గమనార్హం . నక్సలైట్లతో చర్చలకు కాంగ్రెస్ పార్టీ తరపున ఒక బృందాన్ని నియమిస్తామని ఆయన వెల్లడించడంతో రాష్ట్రంలో నక్సలైట్ల విషయంలో పోలీసుల పాత్ర ఏ మిటనే దానిపై ప్రశ్నలు తలెత్తాయి. రాష్ట్రానికి సరిహద్దుల్లో వున్న ఛత్తీస్‌ఘడ్‌తో పాటు మహారాష్ట్రలో నక్సలైట్ల సమస్య తీవ్రంగా వుండగా దీని కారణంగా సరి హద్దుల్లో గ్రే హౌండ్స్ బలగాలతో పాటు ఆయా జిల్లాల పోలీసులు నిరంతరం కూంబింగ్ చేబట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఛత్తీస్‌ఘడ్, మహా రాష్ట్రలో నక్సలైట్ల ఏరివేతకు కేంద్ర బలగాలు వుండగా తెలంగాణలో మాత్రం రాష్ట్ర బలగాలే పహారా కాస్తున్నాయి.

# మే 9న 'జగదేక వీరుడు అతిలోక సుందర్ని రీరిలీజ్

మెగాస్టార్ చిరంజీవి శ్రీదేవి జంటగా నటించిన జగదేక వీరుడు అతిలోక సుందరి 1990 మే9న విడుదలైన బాక్సాఫీస్ వద్ద అఖండ విజయాన్ని అందుకుంది. వైజయంతీ మూవీస్ అశ్వనీదత్ నిర్మాణంలో దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఎవర్‌గ్రీన్ క్లాసిక్.

మే 9వ తేదీతో ఈ సినిమా విడుదలై 35 ఏళ్లు అవుతున్నాయి. ఈ సందర్భంగా ఈ సినిమాని మే 9వ గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు. 35 ఏళ్ల క్రితం మే9న విడుదలై సంచలన విజయం సాధించిన ఈ చిత్రాన్ని మళ్లీ అదే మే9న రీ రిలీజ్ చేయడం విశేషం. 2డీతో పాటు, 3డీలోనూ ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం మరో హైలెట్.

తెలుగు సినిమా చరిత్రలోనే ఎవర్‌గ్రీన్ క్లాసిక్, మైల్ స్టోన్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'జగదేక వీరుడు అతిలోక సుందర్ని చిరు, శ్రీదేవిల నటన, రాఘవేంద్రరావు



దర్శకత్వ ప్రతిభ, నిర్మాత అశ్వనీదత్ విజన్, మేస్ట్రో ఇళయరాజా సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి.

నిర్మాత అశ్వనీదత్ సినిమాపై ఉన్న ప్యాషన్‌తో అప్పటివరకూ ఎవరూ ఖర్చు చేయలేనంత భారీ బడ్జెట్‌తో తీసిన ఈ సినిమా ప్రేక్షకులు గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇస్తూ హిస్టారికల్ సక్సెస్ సాధించింది. ఇప్పుడు రీరిలీజ్ లో 2డీతో పాటు, 3డీలోనూ ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు మరోస్థాయికి చేరుకున్నాయి. జగదేకవీరుడు అతిలోక సుందరిని అప్పట్లోనే విజువల్ వండర్‌గా తీశారు. త్రీడీ వెర్షన్ ఇప్పటి ఆడియన్స్‌కి వెరీ న్యూ ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది.

# హిట్ 3 ప్రీరిలీజ్ ఈవెంట్

నేచురల్ స్టార్ నాని హైలీ యాంటిసిపేటెడ్ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ హిట్ : ది 3 కేస్. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించింది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమా, నాని యూనాని మస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఈ చిత్రం, టీజర్, ట్రైలర్ పాటలతో విడుద లకు ముందే దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. హిట్ థర్డ్ కేసు మూవీ మే 1న పాన్ ఇండియాగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి చీఫ్ గెస్ట్‌గా హాజరైన ఈ ప్రీరిలీజ్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో దర్శక ధీరుడు ఎస్ఎస్




రాజమౌళి మాట్లాడుతూ, నాని చాలా బాగా మాట్లాడి చాలా ఎమోషనల్ చేసేసాడు. మొన్న హిట్ త్రీ ఇంటర్వ్యూ చూస్తున్నాను. సినిమాకి సంబంధించి ఏదైనా విషయం బయటికి లీక్ అయినప్పుడు చాలా కోపం వస్తుంది. కానీ శైలేస్ చాలా కూల్‌గా సెటిల్‌గా మాట్లాడిన విధానం నాకు చాలా ఆకట్టుకుంది. నాని ఏ సినిమా చేసిన హిట్ అని తెలుస్తుంది. తన్నుంచి ఇంకా ఎక్కువ ఎక్స్పెక్ట్ చేస్తున్నా. నాని ఇంకా ముందుకు వెళ్లాలని కోరుకుంటు న్నాను. ఈ సినిమా టీజర్ ట్రైలర్ సాంగ్స్ అన్నీ కూడా ఈ సినిమా సూపర్ డూపర్ హిట్ అవుతుందని వైబ్‌ని క్రియేట్ చేస్తున్నాయి. మే1 ఓన్లీ ఇన్ థియేటర్స్. ఆప్ కీ బార్ అర్జున్ సర్కస్. థాంక్యూ వెరీ మచ్ అన్నారు.

నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ, మీ అందరి ఎనర్జీ మాకు చాలా జోష్ ని ఇచ్చింది. రాజమౌళితో నాకు ఒక సెంటిమెంట్ ఉండేది. మేము ప్రతి కొత్త సినిమాని ప్రసాద్ ఐమాక్స్‌లో చూసేవాళ్ళం. సినిమా రిజల్ట్, సినిమా ఎలా ఉందని ఆయన అడిగే తెలుసుకునేవాడిని, కానీ ఇప్పుడు అటువైపు వెళ్లటం లేదు. మే1న ఆయనకి ఏ పనులు ఉన్నా సరే.. ఒకవేళ ఆయనకి ట్రావెల్ ఉంటే ఆయన పాస్ పోర్ట్ నేను లాగేసుకుంటా మీరు సినిమా చూసి మళ్లీ ఆ ఎనర్జీ ఇవ్వాలని కోరుకుంటున్నాను. తప్పకుండా ఈ సినిమాని ఆయన ఎంజాయ్ చేస్తారని నమ్మకం నాకుంది. విశ్వక్సేన్, శేష్ హిట్ వెర్స్‌కి పిల్లర్స్. వాళ్లు బిల్డ్ చేసినది నెక్స్ట్ లెవెల్‌కి తీసుకువెళ్తున్నాం. ఈ ఫంక్షన్‌కి వాళ్ళు కూడా రావడం ఒక ఫ్యామిలీ ఫంక్షన్ అన్న ఫీలింగ్ ఇచ్చింది.శైలేష్ స్ట్రెంత్ నాకు తెలుసు. తనలో ఉన్న స్ట్రెంత్‌ని తను ఇంకా పూర్తిగా ఎక్స్ప్లోర్ చేశాడని నేను అనుకోవట్లేదు. తన స్ట్రెంత్ తాలూక ట్రైలర్‌ని మే1న చూడబోతున్నారు. సినిమా మీద ఉన్న ప్రేమని మరొకసారి చూపించబోతున్నాం.ఒక ఒక కమర్షియల్ మాస్, థ్రిల్లర్ ఫిలిం కలిస్తే ఎలా ఉంటుందో హిట్3 లో చూస్తారు. మనందరం థియేటర్స్ లో కలిసి చాలా ఎంజాయ్ చేయాలి. థాంక్యూ సో మచ్ అన్నారు.

హీరో అడివి శేషు మాట్లాడుతూ.. ఫ్యామిలీ ఫంక్షన్ కి వచ్చినట్లుగా ఉంది. నాని బ్రో గూఢచారి ట్రైలర్ లాంచ్ చేశారు. అప్పుడే సినిమా చేస్తానని అన్నారు. ఆయన నన్ను ఒక బ్రదర్ లాగా సపోర్ట్ చేశారు. నాని వలనే రెండు ఫ్రాంచైజీలున్న హీరోని అయ్యాను. హిట్ త్రీ లాస్ట్ 30 మినిట్స్ చూసాను. మామూలుగా ఉండదు. క్రేజీగా ఉంది తెలియని సర్ప్రైజ్ లో చాలా ఉన్నాయి. సినిమా బాగుంటే పబ్లిక్ సపోర్ట్ చేయడానికి రెడీగా ఉన్నారు. మే ఫస్ట్ కోసం ఈగర్‌గా వెయిట్ చేస్తున్నాను అన్నారు. హీరో విశ్వక్సేన్ మాట్లాడుతూ, హిట్ నాది, శేష్‌ది, నాని అన్నది, హిట్ మాది, మన అందరిదీ. ఇదే స్టేజ్ మీద నాని అన్న పలక్ నామ దాస్ ఫంక్షన్‌కి వచ్చినప్పుడు నేను హీరోగా హిట్ అనౌన్స్ చేశారు. ఇదే వేదిక మీద హిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కి రాజమోళి గారు చీఫ్ గెస్ట్‌గా వచ్చారు. హిట్ నుంచి మరెన్నో సినిమాలు వస్తాయి. నాని అన్న యాక్టర్‌గా హ్యాట్రిక్ కొట్టారు. నిర్మాతగా హ్యాట్రి కొట్టారు. ప్రశాంతి వన్ ఆఫ్ మై ఫేవరెట్ ప్రొడ్యూసర్. మే 1న ఈ సినిమా చాలా వైలెంట్ గా ఉండబోతుంది. హిట్ 3 వెరీ బిగ్ బ్లాక్ బస్టర్ కావాలని కోరుకుంటున్నాను. టీమ్ అందరికీ ఆల్ ద వెరీ బెస్ట్ అన్నారు.

డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ,ముందుగా పెహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి పవిత్ర ఆత్మలకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను.నా విజన్ ని నమ్మి ఈ సినిమాలో పార్ట్ అయిన నటీనటులకు సాంకేతిక నిపుణులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. నాని గారు అంటే నాకు చాలా ఇష్టం. సినిమా మీద ఆయనకున్న పాషన్ అద్భుతం. నాని గారు పక్కన ఉంటే చాలా ఇన్స్పైరింగ్ గా ఉంటుంది. నన్ను ఇంత బలంగా నమ్మిన నానికి థాంక్యూ. మే ఒకటి నా సినిమా రిలీజ్ అవుతుంది. ఇది చాలా హానెస్ట్ ఫిలిం. వైలెంట్ గా ఉంటుంది. సినిమాని థియేటర్స్‌లో ఎంజాయ్ చేయండి అన్నారు. హీరోయిన్ శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ,తెలుగులో ఇది నా ఫస్ట్ సినిమా. నానికి థాంక్యూ. డైరెక్టర్ శైలేష్ చాలా సపోర్ట్ చేశారు. తెలుగులో డబ్బింగ్ చెప్పడం చాలా ఆనందంగా ఉంది. డైరెక్టర్ ప్రతి విషయంలో చాలా కేర్ తీసుకున్నారు. ఆయనతో కలిసి నటించడం వండర్ఫుల్ ఎక్స్పీరియన్స్. ఈ సినిమాల్లో పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. రాజమోళిని కలవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. కేజీఎఫ్ ఆడియో ఫంక్షన్ కి రాజమౌళి చీఫ్ గెస్ట్ గా వచ్చారు. మళ్లీ ఇప్పుడు హిట్ 3 రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా కూడా కేజిఎఫ్ లా అద్భుతమైన విజయం సాధిస్తుందని నమ్మకం ఉంది. అందరూ థియేటర్స్‌కి వచ్చి ఎంజాయ్ చేయండి అన్నారు.

# 'ముత్తయ్య' ట్రైలర్ రిలీజ్

ఓ. సుధాకర్‌రెడ్డి, అరుణ్‌రాజ్, పూర్ణచంద్ర, మౌనికా బొమ్మ ప్రధాన పాత్రల్లో నటించిన అవార్డ్ విన్నింగ్ మూవీ 'ముత్తయ్య'. ఈ చిత్రాన్ని దర్శకుడు భాస్కర్ మౌర్య రూపొందించారు. హైలైఫ్ ఎంటర్టైన్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, ఫిక్షనరీ ఎంటర్టైన్మెంట్ ఎల్ఎల్పి బ్యానర్లపై వంశీ కారుమంచి, వృందా ప్రసాద్ సంయుక్తంగా నిర్మించారు.



దివాకర్‌మణి ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్, సహ నిర్మాతగా కూడా వ్యవహరించారు. హేమంత్ కుమార్ సిఆర్ అసోసియేట్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. మే 1వ తేదీ నుంచి 'ముత్తయ్య' సినిమా ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్‌కు వస్తోంది.

ఈ రోజు స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమోళి, ప్రొడ్యూసర్ శోభు యార్లగడ్డ చేతుల మీదుగా 'ముత్తయ్య' సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు. ముత్తయ్య మూవీ ట్రైలర్ తన మనసును కదిలించిందని ఈ సందర్భంగా రాజమౌళి అభినందించారు. మూవీ టీమ్‌కు ఆయన తన బెస్ట్ విషెస్ అందించారు. 'ముత్తయ్య' ట్రైలర్ ఎలా ఉందో చూస్తే నటుడు కావాలనేది 60 ఏళ్ల ముత్తయ్య కల. తమ ఊరైన చెన్నూరుకు ఏ సినిమా షూటింగ్ వాళ్లు వచ్చినా తనకో క్యారెక్టర్ ఇమ్మని అడుగుతుంటాడు. సోషల్ మీడియా రీల్స్, షార్ట్స్ చేస్తాడు. నాటకాల్లో బాగా డైలాగ్స్ చెప్పే ముత్తయ్యకు మంచి నటన ప్రతిభ ఉంటుంది. కానీ సినిమా నటుడు కావాలంటే అంత సులువు కాదు. అతని కల నెరవేర్చుకునేందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించవు. స్నేహితులు, కుటుంబ సభ్యుల నుంచి ప్రోత్సాహం అందదు. ఇలాంటి పరిస్థితులన్నీ తట్టుకుని ముత్తయ్య నటుడు కాగలిగాడా, ఏదో ఒక రోజు ఊరి ప్రజలకు తను నటించిన సినిమా పెద్ద తెరపై చూపించాలనే కలను ఎలా నెరవేర్చుకున్నాడు అనేది ట్రైలర్‌లో హార్ట్ టచింగ్‌గా చూపించారు. కలను వెంటనే నెరవేర్చుకోవాలి, లేదంటే అప్పుడే చంపేసుకోవాలి, కానీ వెంటపెట్టుకుని తిరగకూడదు అంటూ ముత్తయ్య చెప్పే డైలాగ్ అతని క్యారెక్టర్ పడే మానసిక సంఘర్షణను చూపిస్తుంది.

# పూరి జగన్నాథ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో శాండల్‌వుడ్ డైనమో విజయ్ కుమార్

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటిస్తున్న తన అత్యంత ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా ప్రాజెక్ట్ తో ఇండియన్ సినిమాని మరోసారి షేక్ చేయడానికి సిద్ధంగా వున్నారు. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మీకౌర్ నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో టబు కీలక పాత్ర పోషించనుంది.

ఎక్సయిట్మెంట్‌ని మరింత పెంచుతూ, శాండల్‌వుడ్ డైనమో విజయ్ కుమార్ ఈ చిత్రంలో పవర్ ఫుల్‌పాత్రని పోషించడానికి ప్రాజెక్ట్‌లోకి వచ్చారు. మాగ్నెటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, హైఆక్టేన్ పెర్ఫార్మెన్స్‌లతో అదరగొట్టే విజయ్ కుమార్ బ్లాక్ బస్టర్ వీరసింహారెడ్డి తర్వాత చేస్తున్న రెండో తెలుగు సినిమా ఇది. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి నెవర్ బిఫోర్ క్యారెక్టర్ కనిపించబోతున్నారు. విజయ్ సేతుపతి అవుట్ స్టాండింగ్ పెర్ఫార్మెన్స్, డిఫరెంట్ అవతార్‌లో చూడబోతున్నారు ఆడియన్స్. ఈ ప్రాజెక్ట్‌తో తెలుగు సినిమాకి స్ట్రాంగ్ కం బ్యాక్ ఇస్తున్నట్టు కథలో చాలా కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. ఇప్పుడు, విజయ్ కుమార్ ప్రాజెక్ట్‌లోకి రావడంతో ఎక్సయిట్మెంట్ మరింతగా పెరిగింది. ఈ హైలీ యాంటిసిపేటెడ్ సినిమా కోసం పూరి జగన్నాథ్ పవర్ ఫుల్ కథ ని రాశారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం హిందీ భాషలలో విడుదల కానుంది. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జూన్ నుంచి ప్రారంభమవుతుంది.






# 'సూర్యాపేట్ జంక్షన్' మూవీ సక్సెస్ మీట్



ఈశ్వర్, నైనా సర్వర్ జంటగా యోగాలక్ష్మి ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై అనీల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్ శ్రీనివాసరావు నిర్మాణంలో, రాజేష్ నాదెండ్ల దర్శకత్వంలో తెరకెక్కిన సూర్యాపేట్ జంక్షన్ మూవీ ఈ నెల 25న థియేటర్‌లలో విడుదలై హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర బృందం హైదరాబాద్‌లో ఘనంగా సక్సెస్ మీట్‌ను నిర్వహించింది.

ఈ సందర్భంగా హీరో ఈశ్వర్ మాట్లాడుతూ, 'సూర్యాపేట్ జంక్షన్' పై మీరు చూపించిన ప్రేమ, ఆదరణ మా హృదయాలను హత్తుకుంది. ప్రేక్షకుల స్పందన చూస్తుంటే సంతోషంగా ఉంది. పూర్తిగా పాజిటివ్ టాక్ ఉంది. నిన్నటి కంటే ఈ రోజు కలెక్షన్స్ పెరిగినందుకు ఆనందంగా ఉంది. మౌత్ టాక్ కూడా ప్రేక్షకులను థియేటర్‌కు వెళ్లేలా చేస్తుంది. మా చిత్ర యూనిట్ ఈ విజయాన్ని సెలెబ్రేట్ చేసుకుంటున్నాం. మీ ఆశీర్వాదాలకు, సపోర్ట్‌కు ధన్యవాదాలు, అన్నారు. హీరోయిన్ నైనా సర్వర్ మాట్లాడుతూ, ప్రేక్షకులు సూర్యాపేట్ జంక్షన్ సినిమాను ఇంతగా ఆదరించడంలో మాకు ఎంతో ప్రోత్సాహం లభించింది. సినిమా సూపర్ హిట్ టాక్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాల్లు, అని చెప్పారు. దర్శకుడు రాజేష్ నాదెండ్ల మాట్లాడుతూ, "మా సినిమా ద్వారా చెప్పాలనుకున్న సందేశాన్ని ప్రేక్షకులు అందరికీ చేరవేయడం చాలా ఆనందంగా ఉంది. మా ప్రయత్నాన్ని ఆదరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతల్లు, అన్నారు.నిర్మాతలు అనీల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్. శ్రీనివాసరావులు మాట్లాడుతూ, "సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులు, మీడియా, మా టీమ్‌కి మా హృదయపూర్వక ధన్యవాదాలు, అని పేర్కొన్నారు. చిత్ర యూనిట్ మొత్తం సినిమా విజయం పట్ల హర్షం వ్యక్తం చేసింది.

# 'టిఎస్ఆర్ మూవీ మేకర్స్' ప్రొడక్షన్ నెంబర్ 3: మొదటి షెడ్యూల్ ప్రారంభం

టిఎస్ఆర్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ప్రొడక్షన్ నెంబర్3, ప్రేమ, కుటుంబ బంధాలను అద్భుతంగా ఆవిష్కరించే ఒక హృదయ స్పర్శ చిత్రంగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత తిరుపతి శ్రీనివాసరావు నిర్మిస్తుండగా, దర్శకుడు ఆదినారాయణ పినిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. హరికృష్ణ హీరోగా, భవ్యశ్రీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం, ప్రేక్షకులకు భావోద్వేగపు అనుభవాన్ని అందించనుంది. ఈ చిత్రం ప్రేమ, త్యాగం, కుటుంబ విలువల చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందుతోంది. హరికృష్ణ భవ్యశ్రీ మధ్య సహజమైన కెమిస్ట్రీ, కథలోని భావోద్వేగాలను మరింత లోతుగా చూపిస్తుందని భావిస్తున్నారు. విపిన్ వి రాజ్ సినిమాటోగ్రఫీ దృశ్యాలు, గౌతమ్ రవిరామ్ సంగీతం, విజయ్ కందుకూరి సంభాషణలు పాత్రల భావాలను సహజంగా ఆవిష్కరించేలా ఉంటాయట. ఈ సినిమా కేవలం ప్రేమకథ మాత్రమే కాక, కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు, వారి సవాళ్లు, విజయాలను కూడా హృదయానికి హత్తుకునేలా చిత్రీకరించబడుతుంది. దర్శకుడు ఆదినారాయణ పినిశెట్టి కథనంలో సమతుల్యతను పాటిస్తూ, ప్రేమ కుటుంబ జోనర్‌లను సమర్థవంతంగా మేళవించారు.




దర్శకుడు ఆదినారాయణ పినిశెట్టి మాట్లాడుతూ టిఎస్ఆర్ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రం ద్వారా తెలుగు సినిమా ప్రేమికులకు మరో విజయవంతమైన చిత్రాన్ని అందించడానికి సిద్ధంగా ఉంది. ఈ సినిమా కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని అంటున్నారు. గతంలో ఎన్నడూ చూడని ఒక వైవిధ్యమైన ప్రేమ కథని చూపించబోతున్నారు.గతంలో ఈ బ్యానర్‌లో తికమక తాండ, కొబలి వంటి వైవిధ్యమైన సినిమాలు వచ్చాయి. ఎంతగానో ఆకట్టుకున్నాయి. కొబలి సినిమా డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో బాగా ట్రెండ్ అయ్యింది. అలాంటిది ఈ బ్యానర్‌లో ఇప్పుడు మరో అదిరిపోయే సినిమాగా ఈ సినిమా తెరకెక్కుతుంది అన్నారు. ప్రొడ్యూసర్ తిరుపతి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఈ సినిమా కంటెంట్ బాగా నచ్చిందని ప్రొడ్యూసర్ అన్నారు. కొత్త జోనర్‌లో వైవిధ్యమైన లోకేషన్‌లలో ఈ సినిమాని తెరకెక్కించి ఆడియన్స్‌కి ఒక కొత్త అనుభూతి ఇస్తాం అని అన్నారు.

# 'శార్వా 38' క్రూషియల్ రోల్‌లో డింపుల్ హాయతి

చార్మింగ్ స్టార్ శర్వా తన మేడిన్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 38ని ప్రారంభించడానికి సిద్ధంగా వున్నారు. ఈ చిత్రానికి విజనరీ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. ఈ కొలాబరేషన్ శర్వా, దర్శకుడు సంపత్ నంది ఇద్దరికీ ఒక ముఖ్యమైన మైల్ స్టోన్ ని చూస్తోంది. ఈ గ్రిప్పింగ్, హై వోల్టేజ్ యాక్షన్ డ్రామాను శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తారు. లక్ష్మి రాధామోహన్ సమర్పిస్తారు. ఈ చిత్రం హైబడ్జెట్, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రతిష్టాత్మకంగా నిర్మించబడుతుంది. ప్రీప్రొడక్షన్ విషయంలో కూడా టీం చాలా జాగ్రత్తలు తీసుకుంది.

ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్‌ని హీరోయిన్‌గా అనౌన్స్ చేసిన తర్వాత,



మేకర్స్ ఇప్పుడు క్రూషియాల్ పాత్ర కోసం డింపుల్ హాయాతిని ఎంపిక చేశారు, ఇది ప్రాజెక్ట్‌కు మరింత స్టార్ పవర్‌ని యాడ్ చేసింది. కథలో ఇంపాక్ట్ ఫుల్ క్రూషియాల్‌ని డింపుల్ పోషించనుంది. ఈ పవర్ ఫుల్ పాత్రకు ప్రాణం పోసేందుకు డింపుల్ పర్ఫెక్ట్ చాయిస్.అనుపమ, డింపుల్ ఇద్దరూ ఇంపాక్ట్ ఫుల్ రోల్స్ పోషిస్తున్నారు. అనుపమ పోస్టర్ ఒక బోల్డ్ ట్రాన్స్ ఫర్మేషన్ చూస్తోంది. డింపుల్ పాత్ర కూడా ఇంటెన్స్ ఎనర్జీ వుంది. ఆమె ముఖం కనిపించకపోయినా, మెడ, ముక్కు, చెవులు, చేతులు, వేళ్లపై బంగారు ఆభరణాలతో వుండటం ఆసక్తికరంగా వుంది. 1960లో ఉత్తర తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దులో సెట్ చేయబడిన శార్వా 38 ప్రేక్షకులను మరపురాని అనుభూతిని అందించబోతోంది. ఈ చిత్రం హైస్టేక్స్ పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఉండబోతోంది.

# పొన్నం ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న కాంగ్రెస్ నేతలు!?

### స్థానిక నేతల తీరుతో అధికారులకు తలనొప్పులు..

### నామినేటెడ్ పోస్టుల భర్తీ చేయకపోవడంతో అసంపూర్తిలో ఆశావాహులు

### కార్యకర్తల తీరును మంత్రి మార్చేనా

**హుస్నాబాద్‌రూరల్,ఏప్రిల్28,ప్రభాతవార్త:** హుస్నాబాద్‌లో రాజకీయం రంగులు మారుతుందా అంటే అవుననే చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతం నుండి శాసనసభ్యులుగా ఎన్నికై రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రిగా, అసెంబ్లీ టైగర్‌గా కొనసాగుతున్న పొన్నం ప్రభాకర్ ప్రతిష్టకు వారి పార్టీకి చెందిన నాయకులే భంగం కలిగేలా వ్యవహరించడంతో పాటు కొన్ని శాఖల అధికారులకు సైతం తలనొప్పి తెచ్చిపెడుతున్నారని స్పష్టంగా అర్థమౌతోంది. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా హుస్నాబాద్ పట్టణంతో పాటు నియోజకవర్గాలలోని అన్ని గ్రామాలలో మంత్రి పొన్నం సిసిరోడ్లకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే అభివృద్ధి పనుల విషయంలో రోడ్లు వేసే కాంట్రాక్టర్లను కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు, హుస్నాబాద్ పట్టణ కేంద్రానికి వస్తే మాజీ కౌన్సిలర్లతో పాటు చిన్నా చితకా లీడర్లు సైతం వారిని పిలిపించుకుని మరీ వారికి కమీషన్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ, వారు కోరిన మేరకు సొమ్ములు అప్పగిస్తే గాని వారికి కాంట్రాక్టులు అప్పగించడం లేదని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఇది పక్కన పెడితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు స్వయంగా మంత్రి సమక్షంలోనే వారి వారి పార్టీలను వీడి కాంగ్రెస్‌లో చేరిన నాయకులను ఎన్నికలు ముగిసిన నుండే పార్టీలో సీనియర్ లీడర్లు తొక్కేస్తున్నారని వారి ఆవేదన వెల్లబోసుకుంటున్నారు. ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీలో సీనియర్, జూనియర్ లీడర్లు రెండు వర్గాలుగా ఏర్పడడంతోనే గత ఎంపి ఎన్నికలతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికలలో అనుకోని విధంగా ఫలితాలు వచ్చినట్లు పలువురు అనుకుంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఈనెల 14వ తేదీన నియోజకవర్గంలోని చిగురుమామిడి మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ ఛైర్మెన్, చిగురుమామిడి కాంగ్రెస్ మండల అధ్యక్షులు కంది తిరుపతిరెడ్డి అంబేద్కర్ జయంతి వేడుకలను తాను రాకంటే ముందే వేడుకలు నిర్వహిండం పట్ల తీవ్ర ఆగ్రహానికి లోనై పార్టీ నాయకులకు నోటికి వచ్చినట్లు తిట్టడంతో అదే పార్టీకి చెందిన నాయకులు సింగిల్ విండో ఛైర్మెన్ చిదుమల్ల శ్రీనివాస్, చిగురుమామిడి మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు వంగర మల్లేశంలు అంబేద్కర్ సాక్షిగా వందల మంది ముందే చెప్పులు ఎత్తి కొట్టుకునే ప్రయత్నం చేయడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. అంతే కాకుండా శాసనసభ ఎన్నికలు గడిచి పదిహేను నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఈప్రాంతం నుండి ఒక్క గ్రంధాలయ ఛైర్మెన్ నియామకం తప్పితే నామినేటెడ్ పోస్టులు ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ నాయకులే ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంత్రి గెలుపు కోసం ఎంత కష్ట పడ్డా ఫలితం లేకుండా పోయిందని, కనీసం ఏదో ఒక నామినేటెడ్ పదవైనా వస్తుందనుకుంటే ఎలాంటి పదవులు అందకపోవడంతో కొంత మంది పేరు మోసిన నాయకులు ప్రభుత్వం తీరుపైనే తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో జరుగుతున్న ఇలాంటి విషయాలపై మంత్రి దృష్టి పెట్టకుంటే వచ్చే స్థానిక, మున్సిపల్ ఎన్నికలలో పార్టీపై తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశాలు లేకపోలేదు. ఏది ఏమైనా ఇలాంటి విషయాలలో మంత్రి ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాల్సిన అవసరం ఉంది.

# వర్సిటీల్లోని ఖాళీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులన్నీ భర్తీ కష్టమే!

### ప్రస్తుత ఖాళీలు 1114, ప్రభుత్వ అనుమతి ఎన్నింటికిస్తుందో

### జీవో నంబర్ 21ని వ్యతిరేకిస్తున్న యూనివర్సిటీ కాంట్రాక్ట్ లెక్చరర్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం కావడానికి ఇంకా సమయం పట్టేలా ఉంది. అయితే రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేసేలా కనిపించడం లేదు. అందుకు కారణం ప్రభుత్వం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో ఎన్ని భర్తీ చేయనుందో ఇప్పటి వరకు జీవో విడుదలకాలేదు. అయితే యూనివర్సిటీల్లో ఇప్పటికే అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా కొనసాగుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు జీవో ఎంఎస్ నంబర్ 21ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని నిరసనలు చేస్తున్నారు. గతంలో 2017, నవంబర్ 25న రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ కోసం జీవో ఎంఎస్ నంబర్ 34ను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసింది. అందులో పేర్కొన్న పోస్టుల్లో 725 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయి. ఈ జీవో వచ్చి కూడా సుమారు 8 సంవత్సరాలు కావస్తోంది. ఈ నేపథ్యంలో చాలా మంది పదవీ విరమణ పొందడంతో ప్రస్తుతం రాష్ట్రంలో 1114 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు యూనివర్సిటీలు తెలంగాణకి పంపిన ఖాళీలను బట్టి చూస్తే తెలుస్తోంది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జీవో ఎంఎస్ నంబర్ 21లో జారీ చేసింది. ఈ జీవో ఆధారంగా రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మార్గం సుగమం అయింది. అయితే ఈ జీవో ఎన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నారో ప్రకటించ లేదు. ఈ జీవోలో మార్గదర్శకాలను అన్ని యూనివర్సిటీలు తమ ఈసీల్లో ఆమోదించి తీసుకోవాల్సి ఉంటుంది. అదే ఈసీలో తమ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సంఖ్యను కూడా ఫైనల్ చేసి వాటికి ఈసీలో అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీవో ప్రకారమే నియామకాలను చేపట్టాలని భావిస్తే అందుకు సంబంధించి అదే జీవోను అమలు చేస్తున్నట్లు మరోసారి జీవోను జారీ చేయాల్సి ఉంటుంది. లేదంటే ఇప్పుడు ఎన్ని పోస్టులు భర్తీ చేసుకోవాలనుకుంటున్న యూనివర్సిటీలకు అనుమతి ఇస్తుందో పేర్కొంటూ మరో జీవోను జారీ చేయాల్సి ఉంటుంది. అలా నవరీలేటగా జీవో ఇవ్వాల్సి వస్తే.. ముందుగా యూనివర్సిటీలు ఈసీలను ఏర్పాటు చేసుకుని వాటిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ఫైనల్ చేసి వాటి అనుమతి కోసం ప్రభుత్వానికి లేఖ రాయాల్సి ఉంటుంది. ఈ లేఖ ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే గతంలో ప్రకటించిన ఖాళీ కంటే ప్రస్తుత యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలు పెరుగుతున్నాయి. గతంలో ప్రకటించిన ఖాళీలో ఉస్మానియా యూనివర్సిటీలో 327 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఉండగా.. ప్రస్తుతం 470 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు యూనివర్సిటీ లెక్కలు చెబుతున్నాయి. కాకతీయ యూనివర్సిటీలో 2018లో జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 22 ప్రకారం 122 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండగా.. ప్రస్తుతం అవి 183కి చేరినట్లు యూనివర్సిటీ ఉన్నత విద్యా మండలికి పంపిన లెక్కల్లో తేలింది. అలాగే జేఎన్టీయూలో ప్రస్తుతం 146 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండగా.. గతంలో 2018లో జారీ చేసిన జీవో నంబర్ 8 నాటికి 102 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 34 ప్రకారం రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లో 102 ప్రొఫెసర్ పోస్టులు, 234 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 725 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రకటించింది. మొత్తం 1061 పోస్టుల భర్తీకి అనుమతులిస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లో 219 ప్రొఫెసర్ పోస్టులు, 792 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 1114 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు యూనివర్సిటీలు తెలంగాణ ఉన్నత విద్యా మండలికి పంపించిన ఖాళీల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గతంలో ప్రకటించిన 725 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తారా? లేకపోతే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1114 పోస్టులను భర్తీ చేస్తారా? అనేది చూడాలి. అయితే యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తారనేది ప్రభుత్వం స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేస్తేగానీ తెలియదు.

# ఎసిబికి పట్టుబడిన శామీర్‌పేట ఎస్ఐ

**శామీర్‌పేట, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** శామీర్‌పేట పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్ ఎం.పర్శరామ్ పిఎస్‌లోనే 22వేల రూపాయలు లంచం ఫిర్యాదుదారుని నుంచి తీసుకుని ఎసిబి అధికారులకు పట్టు బడ్డారు. శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ వద్ద ఎసిబి అధికారులు నిఘా పెట్టి పథకం ప్రకారం ఆయన్ని పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఎసిబి సిటీ రేంజ్ యూనిట్-2 డిఎస్‌పి శ్రీధర్ విలేకరులతో మాట్లాడుతూ ఆయిల్ రవాణా విషయంలో ఈ పిఎస్‌లో చీటింగ్ కేసు నమోదు కావటం జరిగిందని, ఫిర్యాదుదారు స్నేహితులను ఎస్ఐ విచారించటం, ఇబ్బందులు పెట్టటంతో దీనిలో లంచంను ఆశిస్తూ శామీర్‌పేట ఎస్ఐ ఎం.పర్శరామ్ లంచంగా రూపాయలు డిమాండ్ చేసినట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 1.45ంటల సమయంలో పిఎస్‌లోనే ఆ ఎస్ఐ ఉండటం ఫిర్యాదు దారుడు రావటం 22వేల రూపాయలు తీసుకవచ్చినట్లు ఎస్ఐ పర్శరామ్‌కు తెలుపటంతో తన టేబుల్ వద్ద ఉన్న డస్ట్‌బిన్‌లో ఆ డబ్బులు వేయమని చెప్పటంతో ఆ డబ్బులు



సబ్ ఇన్స్‌పెక్టర్ ఎం.పర్శరామ్

డస్ట్‌బిన్‌లో వేసి బయటకు రావటంతో ఆ వెంటనే అక్కడే నిఘాలో ఉన్న ఎసిబి అధికారులు పిఎస్‌లో దాడులు చేసి 22వేల రూపాయల లంచంను ఎస్ఐ వద్ద వాటిని పట్టుకున్నట్లు అతన్ని వెంటనే అదుపులోకి తీసుకుని విచారణ చేయటం జరిగిందన్నారు. ఈ కేసులో ఫిర్యాదు దారున్ని, అతని కార్యకర్తను మినహించటం కోసం, సెల్ పోన్ తిరిగి ఇవ్వటం కోసం ఫిర్యాదు దారుని నుంచి అప్పటికే 2లక్షల రూపాయలు ఎస్ఐ పర్శరామ్ లంచం తీసుకున్నట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. అయితే మరో 25వేల రూపాయలు ఇవ్వాలని ఎస్ఐ ఫిర్యాదుదారున్ని డిమాండ్ చేయగ 20వేల రూపాయలు ఇస్తానని అనటంతో ఒప్పుకున్నట్లు, మరో 2వేల రూపాయలు కింది వారికి ఇవ్వాల్సి ఉంటుందని అనటంతో ఎస్ఐ ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదుదారుడు ఆలోచించి ఎసిబి అధికారులను ఆశ్రయించటం జరిగిందన్నారు. లంచం తీసుకున్న ఎస్ఐ పర్శరామ్‌ను అరెస్ట్ చేసినట్లు విచారణ పూర్తి చేసి ఎసిబి కేసులకు ప్రత్యేక న్యాయమూర్తి (నాంపల్లి కోర్టుకు) పిఆర్ఎల్ ఎదుట హాజరు పర్చినట్లు ఆయన వివరించారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఎసిబిని టోల్ ఫ్రీనెంబరును 1064కు కాల్ చేసి సంప్రదించాలన్నారు. అయితే ఈ కేసులో ఎస్ఐ పర్శరామ్‌పై జరుగుతున్న విచారణ సమయంలో పిఎస్‌లోనే పేట్‌బషీరాబాద్ ఎసిపి కె.రాములు, శామీర్‌పేట సిఐ శ్రీనాథ్, ఎస్ఐలు, సిబ్బంది కూడ ఉన్నారు.

# ఆహార భద్రత, వ్యవసాయాభివృద్ధికి కట్టుబడిన కాంగ్రెస్

### కేరళలో డిప్యూటీ సిఎం విక్రమార్క

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ఆహార భద్రత, వ్యవసాయ రంగ అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి పనిచేసిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కేరళలో సోమవారం రైతు కార్మికుల మహాసభలో పాల్గొని మాట్లాడుతూ గ్రీన్ రెవల్యూషన్, ఉపాధి హామీ, రైతు రుణమాఫీ, వ్యవసాయ కమిషన్ ఏర్పాటు కాంగ్రెస్ ప్రభుత్వాల వల్లే అమలయ్యాయన్నారు. దేశ ఆర్థిక నిర్మాణంలోవ్యవసాయ భాగస్వామ్యం తగ్గుతుతోందన ఆందోళన వ్యక్తం చేశారు. ఆహార భద్రత, సాంస్కృతిక వారసత్వానికి రైతులు సంరక్షకులని చెప్పారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలలో వ్యవసాయం ఒక జీవన విధానంగా ఉందన్నారు. అలాంటి వ్యవసాయ రంగం నేడు అకాల వర్షాలు, పెరిగిన పెట్టుబడులు, మార్కెట్ ధరల్లో తీవ్ర హెచ్చు తగ్గులు, మారిన వాతావరణ ప్రభావం వంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటుంది అని తెలిపారు. భారతదేశ ఆర్థిక నిర్మాణంలో వ్యవసాయ భాగస్వామ్యం క్రమంగా తగ్గుతుంది అన్నారు. 2016లో 17.5 శాతం కాగా ప్రస్తుతం అది 14 శాతంగా నమోదు అయ్యిందని చెప్పారు. అయినప్పటికీ సగం జనాభా వ్యవసాయ రంగం తోనే ముడి వేసుకుని ఉన్నారని తెలిపారు. ఇందిరాగాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి హయంలో హరిత విప్లవాన్ని సహకారం చేశారని వివరించారు. అధిక ఉత్పత్తి ఇచ్చే విత్తనాలు, మెరుగైన నీటిపారుదల వ్యవస్థ, ఎరువులు అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. ఈచర్యల మూలంగా ధాన్యం ఉత్పత్తి 55 మిలియన్ టన్నుల నుంచి 1978-79 నాటికి 131 మిలియన్ టన్నులకు పెరిగిందని వెల్లడించారు. ఈ పరిణామం కేవలం వ్యవసాయం వృద్ధికే కాదు కాదు గ్రామీణ ఉపాధిని ఆర్థిక శక్తిని బలోపేతం చేసిందన్నారు. రైతు పండించిన పంటలకు కాంగ్రెస్ గిట్టుబాటు ధరలు కల్పించిందని పేర్కొన్నారు. వ్యవసాయ ధరల కమిషన్ స్థాపన, బలోపేతం చేశారని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం 71,000 కోట్ల రుణాలను మాఫీ చేసిందని, దీని ద్వారా దేశంలో 3.68 కోట్లమంది రైతులకు ఉపశమనం కలిగిందన్నారు. తెలంగాణలో ఇప్పటివరకు రూ.21 వేల కోట్ల రుణాలు మాఫీ, రైతు భరోసా పథకం ద్వారా ఎకరాకు 12,000 పెట్టుబడి మద్దతుగా అందించినట్లు తెలిపారు. రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా, సన్నధాన్యం సాగుచేసిన రైతులకు క్వింటాలుకు 500 బోనస్, 10,547 కోట్ల విలువైన పంటల సేకరణ వంటి చర్యలు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని చేపట్టినట్టు వివరించారు.

సమాజాన్ని నడిపించేది అసంఘటిత కార్మికులు, వ్యవసాయ కార్మికులే అన్నారు. తక్కువ వేతనాలు, రక్షణ లేని పరిస్థితులు వారి జీవితాలను ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి ఉపాధి, ఆదాయాన్ని స్థిరంగా అందిస్తున్నామని వెల్లడించారు, అసంఘటిత రంగ కార్మికులకు డిజిటల్ నమోదు ద్వారా బీమా, పెన్షన్ వంటి సహకారం అందిస్తున్నట్టు వివరించారు. ఆత్మీయ రైతు భరోసా పథకం ద్వారా తెలంగాణ ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఎకరానికి 12,000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. జిగ్ వర్కర్ల హక్కులను గుర్తించి, వారికి ఆరోగ్య భీమా, సామాజిక భద్రత కల్పించే విధానాలను తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తుందన్నారు.

# కన్నతల్లి కర్కశత్వం: నాలుగేళ్ల బాబును చితకబాదిన వైనం

**జగిత్యాల, బ్యూరో ప్రభాత వార్త:** ప్రతిరోజు కన్నతల్లి తన కుమారుని కోపంతో కొడుతూ ఉండగా ఇంటి చుట్టుపక్కల వారు వీడియో తీసి సఖి సెంటర్కు తెలుపడంతో తల్లికి కౌన్సిలింగ్ ఇచ్చి బాబును అమ్మమ్మ కు అప్పగించిన సంఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన రామను గత నాలుగు సంవత్సరాల క్రితం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసి నగర్ కు చెందిన ఆంజనేయులుకు ఇచ్చి వివాహం చేశారు. కాగా ఆంజనేయులుకు గతంలోనే వివాహం జరిగే ఇద్దరు కుమారులు ఉన్నారు భార్య భర్తలకు మనస్పర్ధలు రాగా ఆంజనేయులు మొదటి భార్యకు విడాకులు ఇచ్చాడు. కాగా ఆంజనేయులు రామాను రెండో వివాహం చేసుకున్నాడు రమ ఆరు నెలల గర్భవతి అయిన అనంతరం ఆంజనేయులు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం వెళ్లాడు. బాబు పుట్టినాక ఆంజనేయులు గల్ఫ్ దేశం నుండి జగిత్యాలకు వచ్చాడు. రెండో భార్య రమాకు అనుమానంతో మొదటి భార్యతో ఆంజనేయులుకు ఇంకా సంబంధం ఉన్నట్లు




అనుమానంతో రమకు ఆంజనేయులుకు ప్రతి రోజు ఘర్షణ జరుగుతుండేది.

రమ కొద్దిరోజులు తల్లిగారిల్లు అయోధ్య అత్తగారిల్లు జగిత్యాలలో ఉంటూ జీవనం సాగిస్తూ ఉండేది. మళ్లీ మూడు నెలల క్రితం ఆంజనేయులు దుబాయ్ దేశం వెళ్ళినాడు. ఆంజనేయులు దుబాయ్ దేశ వెళ్ళినాక కూడా అమ్మకు ఆంజనేయులకు ఫోన్లో రోజు ఘర్షణ జరుగుతుండేది. కోపంతో రమా బాబును ప్రతిరోజు కొడుతూ ఉండేది. ఇట్టి విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు రామ మళ్లి బాబును కొడుతుండగా వీడియో తీసి ఆ వీడియోను వైరల్ చేయడంతో పాటు సఖి సెంటర్‌కు అందజేసి వివరాలు తెలిపినారు దీంతో సఖి సెంటర్ నిర్వాహకులు రమా ఇంటికి చేరుకొని తల్లి రమను బాబును సఖి సెంటర్కు తీసుకెళ్లి రమకు కౌన్సిలింగ్ ఇచ్చారు అనంతరం బాబును అమ్మమ్మకు అప్పగించారు.

# వేతనాల కోసం ఎదురు చూస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 28 ,ప్రభాతవార్త :** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి సకాలంలో వేతనాలు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో పస్తులతో కాలం వెళ్లదీస్తున్నామని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలోని పరిస్థితులకు ఎక్కడా పొంతనలేదని, ఇందుకు తమ దుస్థితే నిదర్శనమంటున్నారు. కొద్ది రోజులు క్రితం వేతనాల కోసం కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయం ముందు కూడా ఆందోళన చేశారు. ముఖ్యంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉపాధి హామీ పథకంలో కూలీలతో పనులు చేయించడం, సకాలంలో వేతనాలు అందించడంలో సాంకేతిక, క్షేత్రస్థాయి సిబ్బంది విధులు నిర్వహిస్తారు. క్రమం తప్పకుండా కూలీలతో పనులు చేయిస్తూ కేంద్రం నుంచి వీలైనంత మేరకు నిధులు రప్పించడంలో ప్రధాన పాత్ర పోషిస్తారు. ఉపాధి కూలీలకు ఎంత ఎక్కువగా పనులు కల్పిస్తే అంత భారీ మొత్తంలో నిధులు విడుదలవుతాయి. కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించే బాధ్యతలో ఫీల్డ్ అసిస్టెంట్లు కీలక భాగస్వాములు. వారికి నెలకు రూ.10 వేల వేతనం. ఉపాధి పనుల్లో హరితహారం, డంపింగ్ యార్డులు, నీటినిల్వ పనులు, పండ్లతోటల పెంపకం, నర్సరీల నిర్వహణ, చెరువుల్లో పూడికతీత వంటి పనులను పర్యవేక్షిస్తుంటారు. ఇంత చేస్తున్నా సకాలంలో వేతనాలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమగోడును మంత్రులకు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించు కోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

**అమలుకు నోచుకోని పేస్కేల్ హామీ:** ఉపాధి హామీ పథకంలో అదనపు ప్రాజెక్టు అధికారులు 2006 నుంచి కాంట్రాక్టు ఉద్యోగులుగానే పనిచేస్తున్నారు. తమను టార్గెట్లు విధిస్తూ పనిభారం పెంచుతున్న ప్రభుత్వం పేస్కేల్ అమలులో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఏపీవోలు మండిపడుతున్నారు. 2024 ఫిబ్రవరి 2న రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఏపీవోలకు పే స్కేల్ అమలుచేస్తామని హామీ ఇచ్చారుని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏడాది దాటినా మంత్రి సీతక్క ఇచ్చిన హామీ అమలుకాలేదని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి సంవత్సర కేంద్రం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయిస్తుంది. ఇందులో 60 శాతం కూలీలకు, 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ కింద నిధులు కేటాయిస్తారు. ఏనెలకానెల చెల్లించాల్సిన జీతాలు మూడు నెలలు దాటి నాలుగో నెల కావస్తున్నా, తమ బ్యాంకు ఖాతాల్లో జమచేయక పోవటంతో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని వాపోతున్నారు. తమపై ఆధారపడ్డ వారికి బుక్కెడు బువ్వ కోసం బంధు, మిత్రుల వద్ద తెచ్చిన చేబదులు కూడా తిరిగి ఇవ్వక, అప్పు కోసం ఇతరుల వద్దకు వెళ్ళలేక పస్తులుండాల్సిన దుస్థితి దాపురిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాము పడుతున్న ఇబ్బందులు ప్రజావాణిలో నివేదించి అధికారులను వ్యక్తిగతంగా కలిసి తమ బాధలు తీర్చాలంటూ వేడుకున్నా ఫలితం కావరావటంతో రోడ్డున పడాల్సి వచ్చిందంటున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీ మేరకు తనకు పేస్కేల్ వర్తింపజేస్తూ, నెలకు రూ.25వేల వేతనం అందజేయాలని ఆరోగ్య కార్డులు అందించి, విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్సియేషియా విడుదల చేయడమే కాకుండా వారి కుటుంబాల్లో అర్హులైన వారికి ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సకాలంలో ప్రభుత్వం స్పందించకపోతే తమ ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

# ఆపరేషన్ కగార్‌ను ఖండిస్తున్నాం

**హైదరాబాద్(చిక్కడపల్లి), ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వ బలగాలు మావోయిస్టులపై హత్యా కాండ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామనీ, ఆ ఆపరేషన్‌ను వెంటనే ఆపాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ ప్రతినిధులను చర్చలకు పిలవాలని సూచించారు. సోమవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జ్యోతితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మావోయిస్టు పార్టీని అంతం చేయాలని ఛత్తీస్‌గఢ్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో బలగాలను మోహరించి వారి తుడిచిపెట్టాలని కేంద్రం ప్రకటించిందనీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చివరి మావోయిస్టును చంపేదాకా వదిలిపెట్టబోమని మాట్లాడటం ప్రజాస్వామిక దేశంలో అత్యంత అభ్యంతకర విషయం అని తెలిపారు. చర్చలకు పిలవాలని మావోయిస్టు పార్టీ ప్రతినిధులు అడుగుతుంటే వారిని గౌరవించి పిలువకుండా తుదిముట్టించేదాకా వదలబోమనటం దుర్మార్గమన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఆదివాసీలను నిర్మూలించే పద్ధతిని మోడీ సర్కారు కొనసాగిస్తున్నదన్నారు. భారత్ సమ్మిట్‌లో సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, ఆదివాసీ, గిరిజన హక్కులపై కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌లు చేస్తే సరిపోదనీ, ఆదివాసీలపై జరుగుతున్న

### కాళేశ్వరంపై అఖిలపక్షం వేసి చర్చించాలి: బీవీ.రాఘవులు




దాడిని ఆపేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్దిష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 370 పేజీల ఎన్‌డీఎస్ ఏ నివేదిక తీవ్రమైన లోపాలను, పలు కీలక అంశాలను ఎత్తిచూపిందన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసి అందులో దానిపై సమగ్రంగా చర్చించాలని కోరారు.

# బిజెపిని అడ్డుకునేందుకు సిఎం రేవంత్, కెసిఆర్ కలిసి కుట్ర

### బిజెపి శాసనసభపక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌లు కలిసి బిజెపిని అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారంటూ బిజెపి శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం రాష్ట్రపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కెసిఆర్ హయాంలో జరిగిన అక్రమాలపై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎల్కతుర్తిలో జరిగిన బిఆర్ఎస్ బహిరంగ సభ, కొండంత రాగం తీసి దిక్కుమాలిన పాట పాడినట్లుగా ఉందన్నారు. ప్రాజెక్టులు కడుతున్నామని, లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రాన్ని అధోగతికి తీసుకెళ్లారని, కెసిఆర్ ఫాంహౌస్ నుండి జిల్లా, నియోజకవర్గాల వారీగా 10 లక్షల మందితో సభ నిర్వహించాలంటూ ప్రకటించి, రూ.150 కోట్లు ఖర్చు చేసినా, లక్ష మందిని కూడా సమీకరించలేకపోయారన్నారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభ పూర్తిగా విఫలమైందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పు రూ.70 వేల కోట్లు ఉంటే, తెలంగాణ ఏర్పడిన తర్వాత రూ.8 లక్షల కోట్లకు రాష్ట్ర అప్పు పెరిగిందన్నారు. బిఆర్ఎస్ పాలనలో తీసుకున్న 11 శాతం వడ్డీకి అప్పు వెనుక భారీ అవినీతి ఉందని, రేవంత్ రెడ్డి అప్పట్లో ఆరోపించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన రేవంత్ దాని పై విచారణ జరపకపోవడం అనుమానాస్పదంగా ఉందన్నారు.

# సిఐడి కస్టడీకి సీనియర్ ఐపిఎస్ అధికారి పిఎస్ఆర్

**హైదరాబాద్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** ముంబాయి నటి కాదంబరి జత్వాని వ్యవహారంలో వైకాపా హయాంలో తప్పుడు కేసులు నమోదు చేసినట్లు అభియోగాలు ఎదుర్కొని అరెస్టయిన ఎపి నిఘా విభాగం మాజీ డిజి పెండ్యాల సీతామారామాంజనేయులు (పిఎస్ఆర్)ను ఆ రాష్ట్ర సిఐడి పోలీసులు సోమవారం కస్టడీలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జత్వాని కేసులో పిఎస్ఆర్‌పాత్రపై సిఐడి పోలీసులు ఆరాతీశారు. అయితే పిఎస్ఆర్ ధిక్కార స్వరం వినిపించినట్లు సమాచారం. అసలు ఇది కేసే కాదని, జత్వాని ఒక క్రిమినల్‌గా పేరొందిన మహిళగా ఆయన చెప్పారని సమాచారం. బడా వ్యాపారులను పథకం ప్రకారం హనీ ట్రాప్ చేసి కోట్లాది రూపాయలు బ్లాక్ మెయిల్ ద్వారా వసూలు చేసిన చరిత్ర ఆమెకు వుందని పిఎస్ఆర్ వెల్లడించారని తెలిసింది. జత్వాని వ్యవహారంలో కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు విజయవాడ పోలీసులు కేసు నమోదు చేస్తే తనను ఎందుకు అరెస్టు చేశారని ఆయన సిఐడి పోలీసులను ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. కాగా పిఎస్ఆర్‌ను విచారణ తరువాత సిఐడి పోలీసులు తిరిగి విజయవాడ జైలుకు తరలించారు. మంగళవారం మరోసారి ఆయనను విచారించనున్నారు.

# పనస పండ్ల మాటున గంజాయి సరఫరా

**హైదరాబాద్, ఏప్రిల్ 28,ప్రభాతవార్త:** పుష్పా సినిమాలో మాదిరిగా గంజాయిని పనస పళ్ళ కింద పెట్టి సరఫరా చేస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టు బడ్డారు. రూ.2.5 కోట్ల విలువ చేసే గంజాయి స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులు ఇద్దరు నిందితుల అరెస్ట్ చేశారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా చేసే స్మగ్లర్ల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగడుతూ మత్తు పదార్థాల అక్రమ వ్యాపారస్తుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు. ఇదే క్రమంలో ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వి బి కమలాసన్ రెడ్డికి ఒడిషా నుంచి ఆంధ్ర ప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా పలాస, విశాఖపట్నం విజయవాడ మీదుగా రాష్ట్రానికి కోటి రూపాయల విలువ చేసే గంజాయిని రవాణా చేస్తున్నారనే సమాచారం అందగా, స్టేట్ టాస్క్ ఫోర్స్ అడిషనల్ ఎస్పీ భాస్కర్ కు సమాచారాన్ని తెలిపారు. దీంతో అడిషనల్ ఎస్పి భాస్కర్ స్టేట్ టాస్క్ ఫోర్స్ టీం "సి" డి.ఎస్. పి.తులా శ్రీనివాసరావు, ఆయన బృందం సభ్యులు ఇన్స్పెక్టర్ కె వెంకటే శ్వర్లు సిబ్బందిని అప్రమత్తం చేశారు. అంతే కాకుండా టీం డి డి.ఎస్. పి .తిరుపతి యాదవ్ ,ఇన్స్పెక్టర్ నాగరాజులను కూడా సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి గంజాయిని తరలిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.2.5 కోట్ల రూపాయల విలువ చేసే 410 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# నేడు పధాధికారులు, జిల్లా అధ్యక్షులతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమావేశం: ప్రేమేందర్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సునిల్ బన్సల్ హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ వరంగల్‌లో కెసిఆర్ కోట్ల రూపాయల వ్యయంతో సభ నిర్వహించడం, సభలో అడ్డగోలుగా మాట్లా డడం, ఆ తరువాత ప్రజల్లో చర్చకు దారితీయడం, యేడాదికొకసారి సభలతో ప్రజల్లో కనిపించడమే కెసిఆర్ మోడల్, ఫామ్ హౌస్ మోడల్. బిఆర్ఎస్ మోడల్ అంటే ఇదేనని కెసిఆర్ భావిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు దొందు దొందే. గతంలో కలిసి ఎన్నికల్లో పోటీ చేసి, అధికారాన్ని పంచుకున్నాయి. మజ్లిస్ పార్టీకి మిత్రుల్లా వ్యవహరించాయి. మావోయిస్టులకు కూడా ఫ్రెండ్లీగా మారాయి. తెలంగాణ ప్రజలు శాంతిని, అభివృద్ధిని కోరుకుంటున్నారు. హింసను ప్రోత్సహించిన వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.



సోమవారం ధర్నాచౌక్ వద్ద మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

# పేదలకు వంద గజాల స్థలం ఇవ్వాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఏప్రిల్ 28, ప్రభాతవార్త:** హైదరాబాద్ పరిధిలో నివసిస్తున్న ఇల్లులేని పేదలకు వంద గజాల ఇంటి స్థలం ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ గుడెసెవాసుల సంఘం ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో ఇల్లు లేని పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ నీల వెంకటేష్, గుడిసెల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాకీ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గతంలో హైదరాబాద్‌లోని కాచువన్ సింగారంలో, తట్టి అన్నారం, ఆర్‌కే నగర్ తదితర ప్రాంతాలలో ఇళ్ల పట్టాలు ఇచ్చిన ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇవ్వకుండా, పొజిషన్ చూపకుండా నాలుగువేల మందిని మోసం చేశారని ఆరోపించారు. వెంటనే వీరందరికీ స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు పేదలు ఇల్లు లేక దుర్భరజీవితం గుడుపుతూ ఉంటే మరోవైపు పేదలకు కేటాయించాల్సిన ప్రభుత్వ భూములు వేలం వేసి, దొరలకు వందల కోట్ల రూపాయలకు అమ్ముకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు బి.ఎన్.రమేష్‌కుమార్ మాదిగ, కుశల్ కుమార్ మాదిగ, బీసీసంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.రాజేందర్, జి.అనంతయ్య, ఉమేష్‌యాదవ్, బాకి సోమయ్య, ఉపేందర్, ఎస్.వెంకన్న, డి.సాగర్, విష్ణుమాదిగ, కే.అలివేలుతోపాటు వేలాదిమంది ఇల్లులేని పేదలు పాల్గొన్నారు.

# సమాచార ప్రధాన కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

### కమిషనర్లుగా ఏడుగురు, జర్నలిస్టులకు చోటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్28:** ప్రధాన, రాష్ట్ర సమాచార కమిషనర్ల నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు పూర్తి చేసింది. ఒక చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్, 7 గురు ఇన్ఫర్మేషన్ కమిషనర్లను నియమించనున్న ప్రభుత్వం ఈ మేరకు ఆమోదం కోసం గవర్నర్‌కు పంపింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తరవాత ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది. కాగా సమాచార ప్రధాన కమిషనర్‌గా ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డిని నియమించినట్లు తెలిసింది. ఇక మరో ఏడుగురిని ఇన్ఫర్మేషన్ కమిషనర్లుగా నియమిస్తూ ప్రభుత్వం గవర్నర్ ఆమోదానికి పంపింది. కమిషనర్లలో సీనియర్ జర్నలిస్టులకు అవకాశం కలిపించారు. వారిలో పీవీ శ్రీనివాస్ రావు. అయోధ్య రెడ్డి బోరెడ్డి(సిఎం సిపిఆర్వో) కప్పర హరిప్రసాద్ (గాంధీ భవన్ పిఆర్వో), పీఎల్ఎన్ ప్రసాద్, రాములు, వైష్ణవి, పర్వీన్ మొహిసిన్‌లు ఉన్నారు. వీరి నియామకాన్ని ఫైనల్ చేస్తూ ఉత్తర్వులు వెలువడనున్నాయి.

### వరల్డ్ టేబుల్ టెన్నిస్‌లో ఛాంపియన్‌గా

# భారత్ జోడీ మనుష్-దియా

న్యూఢిల్లీ: వరల్డ్ టేబుల్ టెన్నిస్‌లో భారత్ జోడీ సంచలనం సృష్టించింది. అందరి అంచనాలు తారుమారు చేస్తూ వరల్డ్ టేబుల్ టెన్నిస్ ట్యూనిస్ కంటెండర్ టోర్నీలో భారత్‌కు చెందిన మనుశ్ షా-దియా చిటాలె జోడీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఛాంపియన్‌గా అవతరించింది. ట్యూనిషియా రాజధాని ట్యూనిస్‌లో ముగిసిన ఈ టోరన్ను మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో మనుశ్-దియా ద్వయం 11-9, 5-11, 14-12, 3-11, 11-6తో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్, జపాన్‌కు చెందిన సారా మత్సు షిమా-మవా హారిమోటో జోడీని బోల్తా కొట్టించింది. 37 నిముషాల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ఈ తుది పోరులో కీలక దశలో భారత్ జోడీ పై చేయి సాధించింది. సొంత సర్వీస్‌లో 22 పాయింట్లు నెగినగన దియా-మనుశ్ జోడీ తమ ప్రత్యర్థి సర్వీస్‌లోనూ 22 పాయింట్లు సాధించార. విజేతగా నిలిచిన మనుశ్-దియాలకు 2,500 డాలర్లు (భారత్ కరెన్సీలో రూ.2 లక్షల 13 వేలు) ప్రైజ్‌మనీతో పాటు, 400 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ప్రపంచర్యాంకింగ్‌లో 11వ స్థానంలో ఉన్న




మనుశ్-దియా ఈ టోర్నీలో మూడో సీడ్‌గా బరిలోకి దిగింది. తొలి రౌండ్‌లో దియా-మనుశ్ 11-6, 11-5, 11-5తో చైనాకు చెందిన సన్ యాంగ్-హు యిపై, క్వార్టర్ ఫైనల్లో 11-6, 2-11, 16-18, 11-4తో భారత్‌కు చెందిన సత్యన్ జ్ఞానశేఖరన్-ఆకుల శ్రీజలపై, సెమీ ఫైనల్లో 11-4, 11-5, 11-6తో ట్యూనిషియాకు చెందిన వసీమ్ ఇసిద్-ఈజిప్ట్‌కు చెందిన హనా గొడా జోడీపై విజయం సాధించారు.

# భారత్ మహిళా హాకీ టీమ్ ఓటమి



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ మహిళల హాకీ జట్టును వరుస పరాజయాలు వెంటాడుతున్నాయి. ఆస్ట్రేలియా ఎ జట్టుతో జరిగిన రెండో మ్యాచ్‌లో సలీమా టెటె నాయకత్వంలోని భారత్ జట్టుకు ఓటమి ఎదురైంది. ఆస్ట్రేలియా చేతిలో 2-3 గోల్స్ తేడాతో భారత్ మహిళా జట్టు పరాజయాన్ని చవిచూసింది. భారత్ తరపున జ్యోతి సింగ్ 13వ నిముషంలో, సునెలితా టొప్పో 59వ నిముషంలో ఒక్కో గోల్ చేశారు. ఆస్ట్రేలియా ఎ జట్టుకు ఇవీస్టాన్‌సబై 17వ నిముషంలో, డేలీ డాల్‌కిన్స్ 48వ నిముషంలో, జెమీ లీ సుర్హా 52వ నిముషంలో ఒక్కో గోల్‌ను అందించారు. తొలి క్వార్టర్ చివర్లో లభించిన పెనాల్టీ కార్నర్‌ను జ్యోతి సింగ్ గోల్‌గా మలచడంతో భారత్ ఖాతా తెరిచింది. నాలుగు నిముషాల తర్వాత ఆస్ట్రేలియా స్కోరును సమం చేసింది. ఒక దశలో మ్యాచ్ 1-1తో డ్రా గా ముగుస్తుందనిపించింది. అయితే నాలుగు నిముషాల వ్యవధిలో ఆసిస్ రెండు గోల్స్ చేసింది. మ్యాచ్ మరో నిముషంలో ముగుస్తుందనగా, భారత్ రెండో గోల్ చేసినా పరాజయాన్ని తప్పించుకోలేకపోయింది.



# మారథాన్ రేస్ విజేతగా అసిఫా

## పురుషుల విభాగంలో సెబాస్టియన్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక లండన్ మారథాన్ రేసులో మహిళల విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు నమోదైంది. లండన్‌లో భారత్ కాలమానం ప్రకారం సోమవారం జరిగిన ఈ రేసులో ఇథియోపియాకు చెందిన టిగ్స్‌ట్ అసిఫా విజేతగా అవతరించింది. 42.195 కిలోమీటర్ల దూరాన్ని 28 ఏళ్ల అసిఫా 2 గంటల 15 నిముషాల 50 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని అందుకుంది. ఈ క్రమం లో 2 గంటల 16 నిముషాల 16 సెకన్లతో కెన్యాకు చెందిన పెరిస్ జెప్‌చర్‌చర్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును అసిఫా బద్దలు కొట్టింది.గతఏడాది లండన్ మారథాన్



లోనే పెరెస్ జెప్‌చిర్‌చిర్ ఈ ప్రపంచ రికార్డును సృష్టించి స్వర్ణ పతకాన్ని సాధించగా, అసిఫా రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కిం చుకుంది. ఈ సంవత్సరం పెరెస్ జెప్‌చర్‌చర్ లండన్ మారథాన్‌కు దూరం కాగా, అసిఫా అద్భుత ప్రదర్శనతో పసిడి పతకాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, ప్రపంచ రికార్డును లిఖించింది. కెన్యాకు చెందిన జాయ్స్‌లిన్ జెప్‌కోస్గి 2 గంటల 18 నిముషాల 44 సెకన్లతో రజతాన్ని, నెదర్లాండ్‌కు చెందిన సిఫాన్ హాసన్ 2 గంటల 19 నిముషాలతో కాంస్య పతకాన్ని సాధించారు. కాగా లండన్ మారథాన్ పురుషుల విభాగంలో కెన్యాకు చెందిన సెబాస్టియన్ విజేతగా నిలిచాడు. సెబాస్టియన్ 42.195 కిలోమీటర్ల దూరన్ని 2 గంటల 2 నిముషాల 27 సెకన్లలో పూర్తి చేసి స్వర్ణ పతకానినన దక్కించుకున్నాడు. ఉగండాకు చెందిన జాకబ్ కిప్లిమో 2 గంటల 3 నిముషాల 37 సెక్లలో పూర్తి చేసి రజతాన్ని, కెన్యాకు చెందిన అలెగ్జాండర్ ముతిసో 2 గంటల 4 నిముషాల 20 సెకన్లతో కాంస్య పతకాన్ని సాధించారు.

# ఐపిఎల్ తర్వాత ఇంగ్లండ్ పర్యటన..

## టీమిండియాలో మార్పులు

### నలుగురు ఆల్ రౌండర్లు.. హార్దిక్‌కు నో ఛాన్స్




**న్యూఢిల్లీ:** ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025, సీజను 18 ఆద్యాంతం ఉత్కంఠభరితంగా సాగుతోంది. ఈ ఐపీఎల్ ముగిశాక ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (2025-2027)లో భాగంగా 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం ఇంగ్లాండ్‌లో జూన్‌లో భారత్ పర్యటించబోతుంది. రోహిత్ శర్మ కెప్టెన్‌గా కొనసాగుతాడని భావిస్తున్నారు. స్క్వాడ్ ను మేలో అధికారికంగా ప్రకటిస్తారు. గత బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత్ ఓడిపోయిన విషయం తెలిసిందే. దీంతో టీమిండియా ఇంగ్లాండ్‌లో జాగ్రత్తలు తీసుకుని ఆడాలని భావిస్తోంది. గతంలో జరిగిన తప్పులు మళ్లీ జరగకుండా చూసుకోవాలని ప్రణాళికలు వేసుకుంటోంది. ఇంగ్లాండ్ పర్యటన కోసం భారత కోచ్ గౌతమ్ గంభీర్ నలుగురు ఆల్ రౌండర్లను ఎంచుకోనున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఆల్ రౌండర్ ఆటగాళ్లలో హార్దిక్ పాండ్యా పేరులేదు. గౌతమ్ గంభీర్ ఎంచుకున్న ఆల్‌రౌండర్లలో రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్, శార్దూల్ ఠాకూర్ ఉన్నారు. టెస్ట్ ఫార్మాట్‌లో రవీంద్ర జడేజా అన్ని వేళలా అద్భుతంగా రాణిస్తాడు. అతడు ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లడం పూర్తిగా ఖాయమని అందరూ భావిస్తున్నారు. అతను గత బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కూడా ఆడాడు. ఇంగ్లాండ్‌పై అతడికి మంచి రికార్డు ఉంది. టీమిండియా యువ ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ టీమ్ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలోనూ తన బౌలింగ్, బ్యాటింగ్‌తో మ్యాచ్ విజయ అవకాశాలను మార్చే సామర్థం ఉన్న ఆటగాడు. ఇంగ్లాండ్ పర్యటనలో వాషింగ్టన్ సుందర్‌ను ఉంటే భారత జట్టుకు ఎన్నో ఉపయోగాలుంటాయి. గత బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో నితీశ్ కుమార్ రెడ్డి అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించాడు. దీంతో టీమిండియాలో అత్యుత్తమ ఆల్ రౌండర్లలో ఒకడిగా వెలుగొందుతున్నాడు. అందుకే నితీశ్ కుమార్ రెడ్డిని ఇంగ్లాండ్ పర్యటనలో ఆడించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో అతను ఐదు టెస్ట్ మ్యాచ్‌ల్లో 298 పరుగులు చేసి, 5 వికెట్లు కూడా తీసుకున్నాడు. శార్దూల్ ఠాకూర్ టీమిండియాలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా ఉన్నాడు. టీమ్ క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న సమయంలో వికెట్లు తీయగలడు. అలాగే, బ్యాటింగ్‌తో తన వంతు సహకారం అందిస్తాడు. 11 టెస్ట్ మ్యాచ్‌లలో 31 వికెట్లు తీశాడు. దీంతో అతడు ఇంగ్లాండ్ పర్యటనలో ఆడతాడని భావిస్తున్నారు.

# బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఓటమి

### సింధు ఓటమి.. క్లీన్ స్వీప్ నుండి తప్పించిన క్రాస్టో-శ్రుతి జోడీ



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక సుదిర్మన్ కప్ ప్రపంచ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి రోజు నిరాశే ఎదురైంది. గ్రూప్ డిలో భాగంగా చైనాలోని జియామెన్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో టీమిండియా 1-4 తేడాతో డెన్మార్క్ చేతిలో ఓడింది. ఈ పరాజయంతో భారత్ జట్టు నాకౌట్ దశకు చేరుకోవాలంటే తదుపరి రెండు మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాల్సి ఉంటుంది. గాయాల కారణంగా పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ, మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలి ద్వయం ఈ మెగా ఈవెంట్‌కు దూరంగా ఉన్నాయి. దాంతో భారత్ జట్టు విజయవకాశాలన్నీ రెండు సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌ల ఫలితాలపైనే ఆధారపడ్డాయి. అయితే ఈ రెంటింలోనూ భారత్ స్టార్‌లు ఆశించదగ్గ ప్రదర్శన చేయలేకపోయారు. వెరసి ఈ టోర్నీలో భారత్ జట్టు పరాజయంతో ప్రారంభించింది. తొలి మ్యాచ్‌గా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీసా క్రాస్టో-ధ్రువ్ కపిల జంట 13-21, 14-21తో జెస్పర్ టాఫ్ట్-అమెలీ మేగ్‌లండ్ జోడీ చేతిలో ఓటమిపాలైంది. రెండో మ్యాచ్‌గా జరిగిన పురుషుల సింగిల్స్‌లో భారత్ రెండో ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ 15-21, 16-21తో ప్రపంచ మూడో ర్యాంకర్ అండెర్స్ అంటోన్సెన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. మూడో మ్యాచ్‌గా జరిగిన పురుషుల డబుల్స్‌లో హరిహరన్-రూబన్ కుమార్ ద్వయం 7-21, 4-21తో ప్రపంచ నంబర్ వన్ అండెర్స్ స్కారప్-కిమ్ అస్ట్రుప్ ద్వయం చేతిలో ఓడిపోవడంతో భారత్ పరాజయం ఖరారైంది. నాలుగో మ్యాచ్‌గా జరిగిన మహిళల సింగిల్స్‌లో భారత్ నంబర్‌న వన్ పివి సింధు 20-21, 21-23తో లినె హోమార్క్ జార్స్‌ఫెల్డ్ చేతిలో ఓటమిపాలైంది. రెండు గేమ్‌ల్లోనూ సింధు ఒక దశలో ఆధిక్యంలో ఉన్నా దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. చివరిదైన ఐదో మ్యాచ్‌గా జరిగిన మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో-శ్రుతి మిశ్రా ద్వయం 13-21, 18-21తో నటాషా-అలెగ్జాండ్రాబొయె జంటను ఓడించి భారత్ క్లీన్ స్వీప్ కాకుండా కాపాడింది. ఇక ఈ నెల 29న జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో మాజీ ఛాంపియన్ ఇండోనేషియాతో భారత్ తలపడనుంది.

# హోమ్ లోన్ ఇఎంఐకి కొన్ని టిప్స్!

**ముంబై, ఏప్రిల్ 28:** ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును తగ్గించింది. ఈ నిర్ణయం వివిధ రుణాలపై, ముఖ్యంగా గృహ రుణాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యంగా ఫ్లోటింగ్ వడ్డీ రేట్ల ఆధారంగా రుణాలు తీసుకున్న వారి ఇఎంఐలు భారీగా తగ్గుతాయి. గృహ రుణాలను దీర్ఘకాలిక అవసరాలకు అనుగుణంగా తిరిగి చెల్లించాలి. కాబట్టి వడ్డీ రేట్లలో చిన్న తగ్గింపు కూడా రుణగ్రహీత నెలవారీ భారాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. తక్కువ రెపో రేటు సాధారణంగా బ్యాంకులు తమ సొంత రుణ రేట్లను తగ్గించుకోవడానికి ప్రోత్సహిస్తుంది. అయితే అన్ని బ్యాంకులు ఈ ప్రయోజనాన్ని కస్టమర్లకు త్వరగా బదిలీ చేయవు, ఎందుకంటే ఇది వారి లాభాల మార్జిన్లపై ప్రభావం చూపుతుంది. దీని వల్ల రుణగ్రహీతలు ఇలాంటి సమాచారంపై చురుగ్గా ఉండటం చాలా కీలకం. ఈ నేపథ్యంలో గృహ రుణాల ఇఎంఐలను తగ్గించుకునేందుకు నిపుణులు చెప్పే టిప్స్ గురించి తెలుసుకుందాం. మీ ప్రస్తుత బ్యాంకు తగ్గించిన రెపో రేటు ప్రయోజనాలను అందించడం లేదని మీరు భావిస్తే, మీ గృహ రుణాన్ని మెరుగైన నిబంధనలను అందించే మరొక రుణదాతకు బదిలీ చేయడాన్ని పరిగణించండి. మంచి రీపేమెంట్ హిస్టరీ మరెక్కడైనా తక్కువ వడ్డీ రేటును పొందే అవకాశాలను పెంచుతుంది. మారే ముందు ఏవైనా



ప్రాసెసింగ్ లేదా ఫోర్‌క్లోజర్ ఛార్జీలను తనిఖీ చేయాలి. మీ రుణంపై పాక్షిక ముందస్తు చెల్లింపులు చేయడానికి బోనస్‌లు, పొదుపులు, అదనపు ఆదాయాన్ని ఉపయోగించండి. ఇది నేరుగా అసలు మొత్తాన్ని తగ్గిస్తుంది. అలాగే వడ్డీ భారంతో పాటు ఇఎంఐ రెండింటినీ తగ్గిస్తుంది. మీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే మీ గృహ రుణాన్ని పునర్నిర్మించడం గురించి ఆలోచించాలి. అధిక డౌన్ పేమెంట్, మెరుగైన వడ్డీ రేటు రుణ వ్యవధి, మీ ఈఎంఐలను తగ్గించడంలో సహాయపడుతుంది. స్థిర వార్షిక ముందస్తు చెల్లింపుకు కట్టుబడి ఉండాలి. మీ రుణంలో వార్షిక ఏక మొత్తాన్ని చేర్చడానికి మీ ఆర్థిక ప్రణాళికలు వేసుకోవడం వల్ల మీ బకాయి ఉన్న అసలు మొత్తాన్ని త్వరగా తగ్గించవచ్చు, తిరిగి చెల్లింపును వేగవంతం చేయవచ్చు. ఈఎంఐలను తగ్గించవచ్చు.

# సిల్వర్‌లో పెట్టుబడికి మార్గాలివే..

**ముంబై, ఏప్రిల్ 28:** బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటికే లక్ష రూపాయల సమీపానికి చేరుకుంది. ఈ నెల ప్రారంభం నుంచి చూస్తే బంగారం భారీగా పెరిగింది. అమెరికా, చైనా మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం కారణంగా బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పెట్టుబడిదారులు బంగారాన్ని ఒక సురక్షితమైన పెట్టుబడి సాధనంగా భావించి ఇందులో పెద్దెత్తున ఇన్వెస్ట్ చేస్తున్నారు. దీంతో బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. అయితే బంగారంతో పాటు మరో లోహం కూడా విపరీతంగా పెరుగుతోంది. భవిష్యత్తులో బంగారం కన్నా కూడా ఎక్కువ స్పీడుతో పెరిగే లోహం వెండి అని నిపుణులు చెబుతున్నారు. బంగారంతో పోలిస్తే వెండి ధర తక్కువగా ఉన్నప్పటికీ దీని పరిశ్రమలో కూడా ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఈనేపథ్యంలో వెండిని ఇండస్ట్రీయల్ ప్లస్ ఇన్వెస్ట్‌మెంట్ రెండు లాభాలు కలిగి ఉన్న లోహంగా పేరు కలిగి ఉంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఎలక్ట్రిక్ వెహికల్స్ డిమాండ్ పెద్దఎత్తున పెరిగింది. ఈ నేపథ్యంలో సోలార్ ప్యానెల్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్ తయారిలో వెండిని విరివిగా ఉపయోగిస్తుంటారు. పెరుగుతున్న ఈ డిమాండ్ కారణంగా వెండికి మంచి ధర లభిస్తుంది. వాల్యూయేషన్ పరంగా చూస్తే వెండి బంగారం కన్నా తక్కువ ధర




ఉన్నా సుదీర్ఘకాలం పెట్టుబడి పెట్టే వారికి వెండి మంచి లాభాలను అందించే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. ఫిజికల్ రూపంలో వెండి కొనుగోలు చేయాలంటే వెండికాయిన్స్, బార్లుకొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే వీటిని తిరిగి మళ్లీ విక్రయించి నగదుగా చేసుకోవడం చాలా కష్టమైన పని. లేదంటే వెండి సామాన్యుల రూపంలో కొనుగోలు చేసుకోవాలి. వెండి సామాన్లు ముఖ్యంగా వెండి పళ్లాలు, వెండి చెంబులు ఆభరణాల రూపంలో వెండిని కొనుగోలు చేయాలి. అయితే వీటికి మేకింగ్‌ఛార్జీలు అదనంగా ఉంటాయి. వీటితో పాటు వీటిని విక్రయించి మళ్లీ డబ్బుగా మార్చుకోవడం అనేది చాలా కష్టతర మైన పని. ఎందుంటే మార్కెట్ ధరకు తగ్గట్టుగా మీకు ధర లభించక పోవచ్చు. స్టాక్‌మార్కెట్లో కూడా మీరు వెండిపై పెట్టుబడి పెట్టేఛాన్స్ ఉంది. ఇందుకోసం ఎక్స్ఛేంజ్‌ట్రేడేడ్ ఫండ్స్ అందుబాటులో ఉంటాయి. వీటిని సిల్వర్ ఇటిఎఫ్ ఫండ్స్ అంటారు.

# 'స్కామ్' యాప్‌లు డౌన్‌లోడ్ చేస్తే డబ్బులు మాయం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** సైబర్ నేరస్తులు రోజురోజుకూ కొత్త పద్ధతులతో వినియోగదారుల డేటాను దొంగిలిస్తున్నారు. ఫేక్ ఎపికె ఫైల్స్ ద్వారా జరిగే స్కామ్‌లు ఇందులో అత్యంత ప్రమాదకరమైనవి. ఈ ఎపికె ఫైల్స్, ఆండ్రాయిడ్ డివైస్‌లలో యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడానికి ఉపయోగించే ఫార్మాట్, సాధారణంగా వాట్సాప్, టెలిగ్రామ్ లేదా ఇతర మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా పంపుతుంటారు. ఈ ఫైల్స్ బ్యాంకింగ్ యాప్‌లు, కొరియర్ సర్వీస్‌లు లేదా యుటిలిటీ సర్వీస్‌ల వంటి చట్టబద్ధమైన యాప్‌లుగా కనిపిస్తాయి, కానీ వాస్తవానికి అవి మీ వ్యక్తిగత, ఆర్థిక డేటాను దొంగిలించే మాల్వేర్‌తో నిండి ఉంటాయి. ఈ జాగ్రత్తలు పాటిస్తే మీరు మీ డేటాను సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఎపికె (ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్) ఫైల్స్ ఆండ్రాయిడ్ డివైస్‌లలో యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడానికి ఉపయోగించే ఫైల్ ఫార్మాట్. సైబర్ నేరస్తులు చట్టబద్ధమైన యాప్‌లను అనుకరిస్తూ మాల్వేర్‌తో నిండిన ఫేక్ ఎపికె ఫైల్స్‌ను సృష్టిస్తారు. ఈ ఫైల్స్ తరచూ వాట్సాప్, టెలిగ్రామ్, లేదా ఎస్ఎంఎస్ ద్వారా కొరియర్ ట్రాకింగ్, బ్యాంక్ అప్‌డేట్, లేదా ప్రభుత్వ యోజన వంటి మోస పూరిత సందేశాలతో పంపబడతాయి. ఒకసారి ఈ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేస్తే, అది మీ డివైస్‌లోని వ్యక్తిగత డేటా, బ్యాంక్ వివరాలు, ఓటీపీలను దొంగిలించవచ్చు. ఉదాహరణకు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ) ఇటీవల ఈ స్కామ్‌ల గురించి హెచ్చరించింది, వినియోగదారులు అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని సూచించింది. సైబర్ నేరస్తులు సోషల్ ఇంజినీరింగ్ టెక్నిక్‌లను ఉపయోగించి వినియోగదారులను మోసం చేస్తారు. వారు బ్యాంక్ అధికారులు, కొరియర్ సర్వీస్ ప్రతినిధులు, లేదా ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ, మీ ప్యాకేజీని ట్రాక్ చేయండి లేదా మీ బ్యాంక్ అకౌంట్ అప్‌డేట్ చేయండి వంటి సందేశాలతో ఎపికె ఫైల్‌ను డౌన్‌లోడ్ చేయమని కోరతారు. ఈ ఫైల్స్ ఇన్‌స్టాల్ అయిన తర్వాత, అవి మీ డివైస్‌లో మాల్వేర్‌ను విడుదల చేస్తాయి, ఇది ఎస్ఎంఎస్‌లు, ఒటిపిలు, బ్యాంక్ వివరాలు, లేదా కీస్ట్రోక్‌లను రికార్డ్‌చేస్తుంది. కొన్ని సందర్భాల్లో, మాల్వేర్ డివైస్‌ను పూర్తిగా నియంత్రిస్తుంది, ఫలితంగా ఆర్థిక నష్టాలు లేదా గుర్తింపు దొంగతనం జరుగుతుంది. టెలిగ్రామ్ గ్రూప్‌లలో ఈ మాల్వేర్‌ను సర్వీస్‌గా విక్రయిస్తున్నట్లు కూడా కనుగొనబడింది. ఫేక్ ఎపికె ఫైల్స్ ద్వారా సైబర్ నేరస్తులు వివిధ రకాల సున్నితమైన డేటాను లక్ష్యంగా చేస్తారు. వీటిలో బ్యాంక్ అకౌంట్ వివరాలు, క్రెడిట్/డెబిట్ కార్డ్ నంబర్లు, సివివి, ఆధార్ లేదా పాన్ వివరాలు, ఎస్ఎంఎస్‌లు ఉంటాయి. కొన్ని మాల్వేర్‌లు, ఉదాహరణకు, ఎన్‌గేట్, ఎన్ఎఫ్‌సి (నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్) డేటాను దొంగిలించి, ఎన్ఎఫ్‌సి ఎనేబుల్డ్ ఎటిఎంల నుండి నగదును ఉపసంహరించడానికి ఉపయోగిస్తాయి. అదనంగా, ఈ మాల్వేర్‌లు డివైస్‌లో కీలాగర్‌లను ఇన్‌స్టాల్ చేస్తాయి, ఇవి మీరు టైప్ చేసే ప్రతి కీని రికార్డ్ చేస్తాయి, దీనివల్ల ఐడెంటిటీని చోరీ చేయడం, ఆర్థిక నష్టాలు సంభవిస్తాయి. మీ డేటాను సురక్షితంగా ఉంచడానికి, కొన్ని సాధారణజాగ్రత్తలను అనుసరించడం చాలాముఖ్యం. సెక్యూర్ యాప్‌ల నుండి మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేయండి, గూగుల్ ప్లే స్టోర్ లేదా ఆఫీషియల్ వెబ్‌సైట్‌ల వంటివి. అనుమానాస్పద వాట్సాప్, ఎస్ఎంఎస్ లింక్‌లలోని ఎపికె ఫైల్‌లను క్లిక్ చేయవద్దు. మీ డివైస్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను రెగ్యులర్‌గా అప్‌డేట్ చేయండి, ఎందుకంటే అప్‌డేట్స్ సెక్యూరిటీ లోపాలను పరిష్కరిస్తాయి.



# కల్తీ పెట్రోడీజల్‌ను చెక్ చేయండిలా..

**ముంబై, ఏప్రిల్ 28:** ఈ రోజుల్లో చాలా బంకుల్లో పెట్రోల్, డీజిల్ కల్తీ జరుగుతుంది. కల్తీపై వాహనదారులు ఆందోళనకు దిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఏదైనా వాహనం ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడానికి అనేక విషయాలను జాగ్రత్తగా చూసుకోవాలి. వీటిలో ఒకటి పెట్రోల్‌డీజిల్. వాహనాలు పెట్రోల్, డీజిల్ శక్తితో మాత్రమే నడుస్తాయి. అందువల్ల మీరు మీ కారులో పెట్రోల్‌డీజిల్ నింపినప్పుడల్లా మీరు కొన్ని విషయాలను తనిఖీ చేయడం ముఖ్యం. ఎందుకంటే పెట్రోల్, డీజిల్‌లో కల్తీ కేసులు చాలా వెలుగులోకి వచ్చాయి. మీరు మీ కారులో కల్తీ పెట్రోల్‌డీజిల్ ఉపయోగిస్తే, ఇంజిన్ జీవితకాలం తగ్గిపోతుంది. ఇతర భాగాలు కూడా ప్రతికూలంగా ప్రభావితమవుతాయి. అందువల్ల ఇంధన బంకులో పెట్రోల్‌డీజిల్ నింపేటప్పుడు కొన్ని విషయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా ముఖ్యమంటున్నారు టెక్‌నిపుణులు. అనేక ఇంధన బంకులలో లాభాల కోసం పెట్రోల్, డీజిల్‌ను కల్తీ చేస్తున్నారు. దీనివల్ల వినియోగదారులకు నష్టం వాటిల్లుతోంది. ఇంధన కేంద్రాలు చౌకైన, సులభంగా లభించే ద్రవాన్ని కలిపి పెట్రోల్, డీజిల్ పరిమాణాన్ని పెంచు తాయి. సాధారణంగా నాఫ్తాను పెట్రోల్‌లో కలుపుతారు. నాఫ్తా ఒక పెట్రోకెమికల్, పెట్రోల్ లాగా కనిపిస్తుంది. అయితే, దాని ధర తక్కువగా ఉంటుంది. అందుకే దానిని పెట్రోల్‌లో కలిపి అమ్ముతారు. ఇది కాకుండా కిరోసిన్ నూనెను కూడా పెట్రోల్‌లో కలిపి అమ్ముతారు. ద్రావకాలు, పారిశ్రామిక ఆల్కహాల్ కూడా పెట్రోల్‌లో కలుపుతారు. ఇవన్నీ పెట్రోల్‌లో కలుపుతారు. వాహనం మైలేజ్ తగ్గుతుంది. ఇంజిన్ కుదుపులకు గురవుతుంది. వాహనం స్టార్ట్ అవ్వదు. ఇంజిన్‌లో కార్బన్ పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. ఇంజిన్ జీవితకాలం తగ్గడం ప్రారంభమవుతుంది. వాహనం అకస్మాత్తుగా ఆగిపోతుంది. సైలెన్సర్, స్పార్క్ ప్లగ్ దెబ్బతింటాయి. వాహనం పికప్ తగ్గుతుంది. ఇంధనం నింపేటప్పుడు ఈ విషయాలను గుర్తుంచుకోండి: ఎల్లప్పుడూ గుర్తింపు పొందిన ఇంధన స్టేషన్ నుండి మాత్రమే పెట్రోల్ లేదా డీజిల్ వేసుకోండి. ఇంధనం నింపే ముందు మీటర్‌ను తనిఖీ చేయండి. ప్రిస్క్రిప్షన్ తీసు కోకుండా వెళ్లవద్దు. శుభ్రమైన కంటైనర్‌లో ఇంధనాన్ని పోయాలి. పెట్రోల్‌డీజిల్ నమూనాలో హైడ్రోమీటర్‌ను చొప్పించండి. పెట్రోల్ సాంద్రత 730 నుండి 800 మధ్య ఉంటుంది. అటువంటి ఇంధనాన్ని స్వచ్ఛమైనదిగా పరిగణిస్తారు. డిస్నీటి సాంద్రత 730 కంటే తక్కువ, 800 కంటే ఎక్కువ ఉంటే, అటువంటి ఇంధనం కల్తీ కావచ్చు. డీజిల్ సాంద్రత 830 నుండి 900 మధ్య ఉంటుంది.



# వాణిజ్యం

## సీనియర్ సిటిజన్లకు టాక్స్ రిటర్న్ దాఖలులో రకాలెన్నో!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:** సీనియర్ సిటిజన్లకు ఐటీఆర్ ఫారమ్ ఎంపిక వారి ఆదాయ వనరు మొత్తం ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. ఆదాయపు పన్ను శాఖ వివిధ రకాల ఆదాయాల కోసం వేర్వేరు ఫారమ్‌లను ఉన్నాయి. వీటిని తమ పరిస్థితిని బట్టి ఎంచుకోవచ్చు. 60ఏళ్లు, 80ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లకు ఆదాయపు పన్ను శాఖ అనేక రకాల రాయితీలు, వివిధ నిబంధనలు ఉన్నాయి. కానీ మీరు మీ ఆదాయాన్ని సరిగ్గా ప్రకటించడానికి, పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని పొందడానికి సరైన ఐటిఆర్ ఫారమ్‌ను ఎంచుకోవడం చాలా ముఖ్యం. సీనియర్ సిటిజన్లకు రూ.3,00,000 వరకు మినహాయింపు లభిస్తుంది. అయితే ఎక్కువ




మంది సీనియర్ సిటిజన్లకు (80 ఏళ్లు పైబడిన వారికి) రూ.5,00,000 వరకు మినహాయింపు లభిస్తుంది. సీనియర్ సిటీజన్లు కాని వారికి మినహాయింపు పరిమితి రూ. 2,50,000కు పరిమితం. 75 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు, వారి ఏకైక ఆదాయ వనరు పెన్షన్. ఒకే బ్యాంకులో వడ్డీ, ఆదాయపు పన్ను రిటర్నులను దాఖలు చేయడం నుండి మినహాయింపు పొందుతారు. కానీ మీరు గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే ముందుగా మీరు ఫారమ్ 12బిబిఎ ద్వారా డిక్లరేషన్‌ను పూర్తి చేసి, దానిని ఒక నిర్దిష్ట బ్యాంకుకు సమర్పించాలి. వారు దీన్ని పూర్తి చేసిన తర్వాత మాత్రమే వారు తమ ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయకుండా ఉంటారు. జీతం, అద్దె ఆదాయం, పెన్షన్, ఇతర వనరుల నుండి మొత్తం ఆదాయం రూ.50 లక్షల కంటే తక్కువ ఉన్న నివాసితుల కోసం ఐటిఆర్-1ను చాలామంది ఉపయోగించుకోగలుగుతారు. గత సంవత్సరంలో ఎప్పుడైనా ఒక కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న లేదా ఈక్విటీషేర్లను కలిగిఉన్న ఏ సీనియర్ సిటిజన్ కూడా దీనిని ఉపయోగించలేరు. దీనితోపాటు భారత దేశం వెలుపల ఆస్తి ఉన్నవారు లేదా దేశం వెలుపలి వనరుల నుండి ఆదాయం సంపాదిం చే వ్యక్తులు ఈ ఫారమ్‌ను ఉపయోగించలేరు. ఐటిఆర్-2 సీనియర్ సిటిజన్ ఆదాయంలో షేర్లు, మ్యూచువల్ ఫండ్ల నుండి వచ్చే ఆదాయాలు లేదా ఒకటి కంటే ఎక్కువ ఇళ్ల యాజమాన్యంలోని ఆస్తిఉంటే, అప్పుడు అతను ఐటిఆర్-2 ఫారమ్‌ను ఎంచుకోవాలి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.